


ఆరోజు చాలా తొందరగా నిద్రలేచాను. సమయం ఆరు గంటలు దాటింది. వెలుతురు అతి పల్చగా నా గదిలో పడుతోంది.

పరదాలు తొలిగించుకుని బాల్కనీలోకి వచ్చాను.

పక్క ఫ్లాట్స్‌లో వాళ్లు నిద్రలేచిన అలికిడి వినిపిస్తోంది. ఒక ప్రక్క వెంకటేశ్వర సుప్రభాతం, మరో పక్క పాప్ మ్యూజిక్ కలిసిపోయి ప్రొద్దున్నే కృష్ణశాస్త్రి పాటకు డిస్కో ట్యూన్ కట్టినట్లుగా వుంది.


పళ్లు బ్రష్ చేసుకున్నాక బాల్కనీలో వున్న కుర్చీలో కూలబడ్డాను. కూర్చున్న నిమిషానికి నా దృష్టి ఎదురుగా వున్న డాబా మీదకు పోయింది.

ఎవరో ఆగంతకుడు వీపుకు బాగ్ తగిలించుకుని డాబాకు వున్న పంపు గొట్టం ఆధారంగా పైకి ఎగబాకుతున్నాడు.

నా కళ్లు చురుగ్గా చూశాయి.

నవలిక

# మైథున



ఆ పాకటం, ఎక్కటంలో అతడికి చాలా అనుభవమే వుండి వుంటుంది. అతడు చాలా తేలికగా, సునాయాసంగా పాకి డాబా పైకి చేరుకున్నాడు.

భుజానికి వున్న లెదర్ బాగ్ మెల్లిగా విప్పాడు.

అందులోంచి ఓ స్టాండ్‌లా వున్న పరికరాన్ని బయటకుతీసి డాబా పిట్టగోడమీద వుంచాడు.

ఆ తరువాత ఆ బాగ్‌లోకి మరికొన్ని గొట్టాల్లాంటి నల్లటి వస్తువులను తీసి అన్నిటినీ ఆ స్టాండ్‌కు అమర్చసాగాడు. ఇది చేస్తున్నంతసేపూ వాడి చేతులు చాలా మామూలుగా, రోజూ అలవాటైన పనిలా కదలుతున్నాయి.

చిత్త చాంచల్యంతో కూడుకున్న వాడి పనికి నేను కుతూహలంగా తిలకించసాగాను.

వాడు అమర్చిన ఓ పొడవాటి నల్లటి గొట్టాన్ని సరిగ్గా మా ఫ్లాట్స్‌కి అభిముఖంగా పెట్టాడు. ఆ తరువాత ఆ గొట్టానికి పైన వున్న ఓ సర్కిల్‌లోకి చూడటం మొదలుపెట్టాడు.

నా కుతూహలం నన్ను కొంచెం ముందుకు తోసింది. నేను ముందుకు వంగిచూశాను.

## పుట్టగుంట గోపీచంద్

ఒక్కసారిగా భయంకరమైన మోత మొదలైంది. ఆ ఉదయపు నిశ్శబ్దంలో ఆ మోత ఫ్లాట్స్‌లో చెవులు గింగుర్లెత్తేలా ప్రతిధ్వనించింది.

వాడి మెషిన్‌గన్ క్షణం కూడా విశ్రాంతి లేకుండా నిప్పులు కక్కసాగింది.

బుల్లెట్స్ గోడలకు తగిలి చెదల్లా క్రిందకు రాలిపోయాయి. అద్దాలకు తగిలి నప్పుడు మోత మరింత హెచ్చుతోంది. అద్దాలకు చిల్లులు పడి బీట్లిచ్చి ముక్కలు చెల్లాచెదురుగా పడసాగాయి.

పక్క ఫ్లాట్స్ నుంచి ఆర్తనాదాలు, హాహాకారాలు ఒక్కసారిగా మొదలయ్యాయి.

నా కుతూహలం తగలెయ్య వెనక్కిరావడం కాస్త ఆలస్యమైపోయింది.

ముందు విసిరి పుచ్చుకుని వదిలిన రబ్బలా ఓ బుల్లెట్ నా ఛాతీలోకి దిగింది. అంత లెక్క ఫాక్కను చింపుకుని చిక్కని రక్తం బయటకు ఉబికింది.

వేడి చేసిన ఇనుప చువ్వను నా ఛాతీలో తిప్పుతోన్నట్లుగా వుంది.


వాడు తాపీగా గన్ ముడుచుకుని బాగ్‌లో పెట్టుకుని ఎంత తేలిగ్గా వచ్చాడో అంతే తేలిగ్గా గొట్టం మీదుగా జారుకుంటూ వెళ్లిపోయాడు.

బాధ మెలికలు తిరగడమంటే ఏంటో నాకు ఇప్పుడు తెలుస్తోంది. దాన్ని ఆపుకోవడం ఎంత అసాధ్యమైన పనో అర్థమౌతోంది.

కుర్చీలోంచి లేవాలని నా ప్రయత్నం. కానీ ఛాతీలో రేగుతోన్న మహాజ్వాలలు నా గుండెను కాల్చివేస్తున్నాయి.

అది క్రమక్రమంగా శరీరమంతటా ఆవహించుకుంటోంది. నా కళ్లల్లోకి మగతలాంటిది ప్రవేశిస్తోంది.

నాకు నిలబడాలనీ, మాట్లాడాలనీ చాలా ఆరాటంగా వుంది.




కుర్చీమీద నా చెయ్యి బిగుసుకుపోతోంది.

మెల్లగా.... మెల మెల్లగా..... నేను ముందుకు వాలిపోతున్నాను.

స్పృహ, స్పర్శ, కోల్పో.....

శరీరం తూలి కుర్చీలోంచి క్రింద పడింది.

** ** **

రెప్ప ఆర్పి తెరిచే సమయంలో సూర్యుడి నుంచి వెలువడుతున్న ఓ రేఖలా దూసుకుపోయిందా కారు.

ఆ మైక్రో సెకను కోసం ఎదురు చూస్తోన్న చేయి ఇగ్నీషన్ కీని తిప్పి వెనువెంటనే స్టీరింగ్ మీదకు వచ్చి చేరింది. ఈ ప్రయత్నంలో క్లచ్ వదలడం కాస్త కంగారులో వుండడంతో కారు చిన్న దుముకుతో ముందు కారును వెంబడించసాగింది.

గేరు మార్చడం కోసం చాచిన చేతి గడియారంలోని సెకన్లు చాలా వేగంగా కదిలిపోతున్నాయి.

వెనుక కారు తీసుకున్న ఆలస్యానికి, ముందుకారు దాదాపు అర కిలోమీటరు దూరంలోకి వెళ్లింది.

అయిన ఆలస్యాన్ని అతి లాఘవంగా కవర్ చేస్తూ ముందు కారు వెనక్కి చేరింది ఈ కారు.

వెనుక వచ్చే కారును ప్రక్కకు రానిచ్చే అవకాశాన్ని కానీ, ముందుకు పోనిచ్చే ఛాన్స్ కానీ కల్పించనీకుండా జాగ్రత్త పడసాగింది.

అతనిలోని ఆవేశం పిడికిలిగా మారి స్టీరింగ్‌ని బలంగా ఒక్క గుద్దు గుద్దింది. కారు కొద్దిగా కంపించింది.

అతని పేరు రాంబో. అసలు పేరు రాంబాబు. వేషధారణ వెనీజులా, ఆలోచనలన్నీ అమెరికా, చేష్టలు చైనా, శరీరం మాత్రం ఇండియాదే వినా ఆవేశం వస్తే ఆఫ్రికా.

యూనివర్సిటీలో క్లాసులు విపోగానే బయట గేటు దగ్గర కాపుకాయడం, ఆమె కారులో వేగంగా రావడం, తాను సునికిపాటు లోంచి మేలుకునేసరికి ఆమె కారు ముందుకు వెళ్లిపోవడం గత వారం రోజులుగా జరుగుతోంది.

ఇన్ని రోజుల్లో అతడు ఒక్క రోజు కూడా ఆమె కారును దాటి ముందుకు పోలేకపోయాడు.

"ఎలాగైనా సరే ఈ రోజు దాటాలి! దాటక పోవడం అనే అవమానాన్ని అతనిక భరించలేడు."

అతని చూపులు రోడ్డు కిరువైపులా ఖాళీగా వున్న పొలం మీద పడ్డాయి. "కారును కాస్త రోడ్డును తప్పించి పొలంలోంచి ప్లేస్ చేసుకుని ఆమె కారును దాటి ముందుకు పోవచ్చేమో?"

అతడింకేమీ ఆలోచించకుండా స్టీరింగ్ తిప్పాడు. ఆ మాత్రం రిస్క్ తీసుకోకపోతే ముందుకు పోవడమనేది అసాధ్యమైన పని.

అతడి గడుసు పనిని గమనించి ముందు కారు స్లో అయి ఒక ప్రక్కగా ఆగింది.

మెల్లగా పొలంలోకి ప్రవేశించిన అతడి కారు మట్టిలోకి కూరుకుపోయి పైకి రాలేక శబ్దం చేయసాగింది.

సుతారంగా డోర్ లాక్ తీసుకుని కారులోంచి క్రిందకు దిగింది మేఘన.

బలంగా వీస్తోన్న గాలికి కేశాలు ఒక్కసారిగా గాలిలోకి ఎగిరి మొఖం మీద, భుజాల చుట్టూ చిందరవందరగా పరుచుకున్నాయి. వాటిని సరిచేసుకుంటూ మొఖమంతా వికసించేలా, తెల్లని పలువరుస మెరిసిపోయేలా నవ్వింది.

జుట్టు ఓ చేత్తో పైకి తోసుకుంటూ, మరో చేయి పైకి లేపి వేళ్లన్నీ వెడల్పు చేసి "వాహ్! ఏం సాహసం?" నవ్వు ఆపుకోలేక అంది.

"షటప్!" రాంబో కోపంగా కారు పైకి తీసుకొచ్చే మార్గం చూడసాగాడు.

అతని అవస్థను అత్యంత ఆసక్తికరంగా కారుకు ఆనుకుని చేతులు కట్టుకుని వేడుకగా చూడసాగింది.

దాదాపు పదిహేను నిమిషాల అవస్థ తరువాత అతడు రెండు సొట్టలతో, అరడజను గీతలతో కారును రోడ్డు మీదకు తేగలిగాడు.

మేఘన ముందుకు కదిలి చేయి చాచి "గ్లాడ్ టు మీట్ యు! నా పేరు మేఘన" చిరునవ్వుతో చెప్పింది.

రాంబో గుండె రగిలిపోయింది. ఆమెను పట్టించుకోకుండా కారు చూసుకోసాగాడు.

"పెద్దగా ఏమైనట్లు లేదు. రెండు సొట్టలు, కొన్ని గీతలు మాత్రమే పడ్డట్టున్నాయి" చెప్పింది మేఘన.

తలపైకెత్తి చూసిన అతని కళ్లు గుర్రుమనే సింహం కళ్లలా భయంకరంగా వున్నాయి.

"మీకు కోపం వచ్చినట్లుందే?"

"నెత్తి పగలగొట్టాలని వుంది" రాంబో చెప్పాడు.

ఆమె ఒక్కసారిగా పకపకా నవ్వింది.

తిరిగి ఆమె "ఇలా రోజూ పంతాలెందుకు కానీ నేనో పందెం చెబుతాను. ఒప్పుకుంటారా?" అని అడిగింది.

రాంబోకి విసుగ్గా అనిపించినా చెప్పమన్నట్లు చూశాడు.

"పందెం చెప్పనా?" అడిగిందామె.

విసుగులోంచి కుతూహలం తొంగి చూసింది. తలెత్తి "ఏమిటి?" అన్నట్లు ఒక కనుబొమ పైకి లేపి చూశాడు.

"ఇక్కడ్నుంచి సిటీకి ఎంత దూరం?"

"పన్నెండు కిలోమీటర్లు."

"ఓ.కే.! కారు పందెం! ఈ పన్నెండు కిలోమీటర్లు ఎవరు గెలిస్తే వాళ్లు...." ఆగి "....పందెం మీరు చెప్పండి" రాంబోని అడిగింది మేఘన.

"తమరే నిర్ణయించండి."

ఆమె నవ్వి "సరే ఐతే! కిలోమీటరుకు వెయ్యి రూపాయిల చొప్పున పన్నెండు కిలోమీటర్లు పన్నెండు వేలు" చెప్పిందామె.

అప్పుడు రాంబో తలతిప్పి ఆమె మొఖంలోకి పరీక్షగా చూశాడు. ఎక్కడా వెక్కిరింత కనిపించలేదు. ఆమె నిజంగానే అన్నట్లుగా గమనించాడు.

ఆమె బొటనవేలు లేపి తనకేసి చూపించి "గెలిస్తే ఇచ్చుకోవాలి మరి" అని చెప్పింది.

"ఎంత ధైర్యం. నిజంగా పన్నెండు వేలూ గెల్చుకోగలనని నమ్మకమే. ఏమైనా సరే ఈ

అమ్మాయి అహం అరవై వక్కలు చెయ్యాలి" రాంబో మరుగ్గా చూసి "సరే" అని చెప్పాడు.

మేఘన తిరిగి "మళ్ళీ చెప్పనా? సరిగ్గా విన్నారా?" అని అడిగింది.

రాంబో చిరాగ్గా "విన్నాన్లే" అన్నాడు.

"అబ్బే నేను వినలేదు! అలాక్కాదు! నేనివ్వను! అంటే కుదరదు!" మేఘన తిరిగి అంది.

"నా చెవులు బాగా పనిచేస్తున్నాయని నా నమ్మకం. పందెం ఎప్పుడో చెప్పు" కోపంగా చెప్పాడు రాంబో.

"ఇప్పుడే!" చెప్పిందామె.

రాంబో వెళ్ళి కారు కండిషన్ పరిచూసుకున్నాడు.

మరో మూడు నిమిషాల్లో రెండు కార్లు ప్రక్క ప్రక్కనే చేరి పందెం మొదలనబోయే సెకను కోసం చాలా కాన్సన్ట్రేషన్‌తో ఎదురు చూడసాగాయి.

"ఒన్...టూ...త్రీ...ఫోర్...ఫైవ్...కమాన్ స్టార్ట్" మేఘన మెల్లగా అంకెలు పలుకుతూ చివర్న గావుకేక పెట్టింది.

లోపల పెట్టబోతోన్న అతడి 'కీ' జారి క్రింద పడింది. వంగి తీసేలోగా ఆమె కారు ముందుకు ఉరికింది.

అంతలా పెట్టిన ఆమె కేకకు రాంబోకి వళ్ళు మండిపోయింది. అతను తిట్టుకుంటూ కారును ముందుకు ఉరికించాడు. కానీ అప్పటికే ఆమె చాలా దూరం వెళ్ళిపోయింది.

రాంబో జీవితంలో మొదటిసారిగా ఎక్కువ ఆవేశం పొందాడు.

ఆమె మాత్రం తాపీగా వెనక సీట్‌కు ఆనుకుని స్టీరింగ్‌ని ఎన్నాళ్ల నుంచో మచ్చిక చేసుకున్న గుర్రపు కళ్లాన్ని పట్టుకున్నట్లు చాలా తేలికగా, సునాయాసంగా తిప్పుతూ దూసుకుపోతోంది.

రాంబోకి ఆ నిదానం కానీ, ఆ ఒడుపు కానీ భరించలేని వాడిలా ఆవేశంతో వేగం పెంచడంతో కారు ప్రతి గొయ్యికీ కీచుమంటూ ఆపి టైరు ముద్దర వల్లగా పడేలా పక్కకు తిప్పి ముందు కారును వెంబడించసాగాడు.

ఆమె ఒక్కోసారి హఠాత్తుగా తప్పుకుని అతనికి దారి ఇవ్వసాగింది. అతడు ఆ అవకాశాన్ని అందుకోబోయే సమయంలో ఎదురుగా భూతంలా లారీనో, ఇంకేదన్నా వాహనమో కనిపించేది.

కసి, కోపంతో కలిసి అసహనమైంది రాంబోకి.

అప్పటికి ఆమె మూడు కిలోమీటర్లు ముందుంది.

"మూ...డు...కి...లో...మీ...ట...ర్లు."

చప్పున రాంబో బుర్రలోకి మేఘన మాటలు జ్ఞాపకం వచ్చాయి. "కిలోమీటరుకి వెయ్యి చొప్పున పన్నెండు కిలోమీటర్లకి పన్నెండు వేలు."

అతనికి ఆమె మాటల్లోని గారడి అర్థమైంది. ఎవరు ఎన్ని కిలోమీటర్లు ముందుంటే వాళ్లు అన్నివేలు గెల్చుకున్నట్లే. ప్రస్తుతం ఆమె మూడు కిలోమీటర్లు ముందుండి మూడు వేలు గెల్చుకుంది. ఇంక మిగిలింది తొమ్మిది కిలోమీటర్లు. అంటే తొమ్మిది వేలు. అసంభవం... ఇక ఆ అమ్మాయిని ముందుకు పోనివ్వకూడదు.

రాంబో చురుగ్గా ఆలోచించసాగాడు.

కారు దాటిపోవడం అసంభవంగా తోచింది. ఆమె అలాంటి అవకాశాన్ని కల్పించే ఉదారత చచ్చినా చూపదు.

ఎలా దాటాలి? అన్న సమస్య రాంబోని సరిగ్గా సీటులో కూర్చోనివ్వడం లేదు.

అప్పటిదాకా పొలంలోని గడ్డిని మేస్తున్న గేదెలు కొన్ని దూరంగా రోడ్డు మీదకు వస్తూ కనిపించాయి.

రాంబో తెలివినుపయోగించి ఓ వ్యూహం పన్నాడు.


అతి వేగంగా కారును కుడివైపుకు దూసుకు పోనిచ్చి హారన్ అతి భయంకరంగా కొట్టాడు.

దూరంగా గేదెలు కుడివైపు పొలంలోంచే రోడ్డుమీదకు వస్తున్నాయి. మేఘన కారు ఎడమవైపు దూసుకుపోతోంది.

కుడివైపుగా వచ్చిన హారన్ మోతకు గేదెలు బెదిరి మేఘన కారుకు అడ్డంగా పరుగుపెట్టాయి. మేఘన ఏ మాత్రం తగ్గకుండా ఎడంవేపు నుంచి కుడివేపుకు వచ్చేసింది. కానీ అదే ఆమె చేసిన తప్పు! రాంబో అనుకున్నది అనుకున్నట్టే జరిగింది.

అతడు ఆమె ఖాళీ చేసిన కుడివైపుకు చేరుకునే సరికి రెండు కారులూ ప్రక్క ప్రక్కకొచ్చాయి. అతడు సెకను వృథా చేయకుండా మరింత భయంకరంగా హారన్ కొట్టసాగాడు.

గేదెలు కుడివైపుకు వస్తున్నవి కాస్తా తిరిగి కుడివైపు శబ్దానికి బెదిరి కొన్ని



ఆగిపోయాయి. కొన్ని మేఘన కారుకు అడ్డంగా వచ్చాయి.

రాంబో ఇక ఆక్కుండా దూసుకుపోయాడు.

తొమ్మిది కిలోమీటర్ల తరువాత సిటీ మొదట్లో కారు ఆపాడు.

తాపీగా ఆమె కారు వచ్చి అతని కారు ప్రక్కన ఆగింది.

అతడు గర్వంగా నవ్వి ఆమె మొఖంలోకి చూశాడు. కానీ ఆమె మొఖంలో ఓడిపోయిన తాలూకు విషాద ఛాయలు ఒక్కటీ కూడా కనిపించలేదు.

కారు దిగి వచ్చి "మీరు చాలా నేర్పుగా డ్రైవ్ చేస్తారు" అని అన్నది.

"నేను తొమ్మిది వేలు గెల్చుకున్నాను" రాంబో చెప్పాడు.


నవ్వు ఆమె పెదాలపై తేలి వచ్చే కెరటాల్లా వుంది. కోమలమైన కంఠ స్వరంతో "లేదు మీరు మొత్తం ఓడిపోయారు" అని అన్నది.

రాంబో ఆశ్చర్యంగా "ఎలా? నేను తొమ్మిది కిలోమీటర్లు ముందున్నాను. ఎవరెన్ని కిలోమీటర్లు ముందుంటే అన్ని వేలు గెల్చుకున్నట్లే. మీరే చెప్పారు కదా కిలోమీటరుకు వెయ్యి చొప్పున పన్నెండు వేలని" అడిగాడు.

ఆమె ప్రశాంతంగా "నేను పందెం గురించి ఏమని చెప్పాను?" అని అడిగింది.

"కిలో మీటరుకు వెయ్యి చొప్పున పన్నెండు కిలోమీటర్లకి పన్నెండు వేలు" రాంబో చెప్పాడు.

"ఆ తర్వాత ఏమన్నాను?"



"గెలిస్తే ఇచ్చుకోవాలి" అతను గుర్తు తెచ్చుకుంటూ చెప్పాడు.

"మరి గెలిచింది మీరే గదా?" ఆమె ఎంత అమాయకంగా పెడదామన్నా మొఖంలో ఫీలింగ్స్ కుదరలేదు.

రాంబోకి కడుపులోంచి నిప్పులు సెగలై రగిలి పైకి తన్నుకొచ్చాయి. అంటే ఇంత శ్రమా తను ఫూల్‌లా చేశాడన్న మాట. ఆవేశపడటానికి కూడా ఓపికలేనంతగా ఆవేశపడ్డాడు.

"నీవి చాలా కన్నింగ్ మాటలు. గెలిస్తే ఇచ్చుకోవాలి అంటే నేను ఎవరు గెలిస్తే వాళ్లకి ఇవ్వాలి అనుకున్నాను. మోసపోవడానికి నేనేమన్నా వెర్రివెంగళప్పలా కనిపిస్తున్నానా?" అన్నాడు కోపంగా.

"వెంగళప్పవో, వెధవాయివో నా కనవసరం. అందుకే నేను సరిగ్గా విన్నావా? అని పదిసార్లు అడిగాను. పెద్ద నాకేం చెవుడు లేదని నువ్వేగా చెప్పావు?" మేఘన కూడా కోపంగా అంది.

రాంబో నషాళానికి అంటింది. అతడు ఆమె కేసి రెప్ప ఆర్పకుండా కోపంగా చూస్తూ "నువ్వు ఫూలన్‌దేవి లాంటి దానివి, దారి దోపిడీలు చాలా తేలికైన పనుల్లా కనిపిస్తున్నాయి. నీకు. ఇంత మోసమా? నీకు పైసా కూడా ఇవ్వను" చెప్పాడు రాంబో.

"డోన్ట్ లూజ్ యువర్ టంగ్. నీ బోడి డబ్బులెవడికి కావాలి? అసలు రోజూ నా కారు వెంట ఎందుకు పడాలి? పందానికి ఎందుకు ఒప్పుకోవాలి? చెవిటి చెవులు పనిచేయక పోతే మంచి డాక్టర్‌కి చూపించుకో. కాని మాటంటే మాట మీదే నిలబడాలి."

అతన్ని మాటలు అనే అవకాశం లేకుండా వేగంగా వెళ్లి కారెక్కి డోర్ విసుగ్గా వేసుకుని వెళ్లిపోయింది.

బాంబులుంటే విసిరేసి బద్దలు కొట్టేద్దామన్నంత కోపంతో రాంబో నిలబడిపోయాడు.

** ** **

బుల్లెట్ దెబ్బకు ఒరిగిపోతోన్న నా దగ్గరకు చప్పున ఎవరో వచ్చి పట్టుకున్నారు.

ఆ వచ్చిన దెవరో చూడాలని అనుకున్నాను. కానీ సాధ్యం కాలేదు.

వచ్చిన వాళ్లు మాత్రం చాలా కంగారు పడిపోతున్నట్లు లీలగా గమనించాను.

అప్పుడే స్పృహ వస్తున్న నాకు నా మొఖం మీద నీటి చుక్కలు పడడం తెలుస్తోంది. అవి నన్ను పట్టుకున్న వ్యక్తి కన్నీళ్లుగా గమనించాను.

నా ఈ ఆఖరి క్షణాలు నన్ను పూర్తిగా విరక్తుడిని చేశాయి.

ఈసారి కన్నీళ్లు వేగంగా, చురుగ్గా విసిరి పుచ్చుకుని కొట్టినట్టుగా నా మొఖం మీద పడ్డాయి. బహుశా నా పైని ఆరాటం, ఆతృత ఎక్కువై వుండాలి.

త్రివేది కళ్లు మెల్లగా విప్పిచూశాడు.

'మెలుకువ వచ్చిందా? ఇంకొంచెం కొట్టనా?' లక్ష్మి కోపంగా భర్తకేసి చూస్తూ అడిగింది.

బాడీ పొజిషన్ని కదల్చకుండా చుట్టూ చూశాడు త్రివేది.

అది వేసవి కాలం కావడం, రాత్రి కరెంట్ పోవడం, తను బాల్కనీలో పడుకోవడం అన్నీ గుర్తుకొచ్చాయి.

ప్రస్తుతం త్రివేది పడుకున్న మంచం బాల్కనీలో ఆ మూల వుంది. అతడు మాత్రం ఈ మూల, ఇలా... వున్నాడు.

అసలెప్పుడో నిద్రలేచినట్లు ఇలా ఈ మూల వుండడం రోజూ జరుగుతున్న పనుల

లాగే సర్వసాధారణమైన పవిలా పూర్వ చాతుర్యంతో మొఖాన్ని పెట్టి భార్యకేసి చూస్తూ మందహాసం చేసి "హలో" అన్నాడు.

"ఆ.. చాల్చాలే అల్లుడూ! చూశాం కానీ లేచిరా?" ఆ పరదాల వెనుక గదిలోంచి త్రివేది మావగారైన రంగారావు గారి మాటలు వినిపించాయి.

త్రివేది ఉలిక్కిపడ్డాడు. "ఈయనెప్పుడొచ్చారు?" అని ఆశ్చర్యపోతూ లేచి లుంగీ సరిచేసుకుని లోపలికి వచ్చాడు. అతడి క్రైమ్ స్వప్నం కాస్తా కరిగి కల్లలై పోయింది.

"గుడ్ మార్నింగ్ మావయ్యా! ఎప్పుడొచ్చారు?" రంగారావు గారి మొఖంలోకి చూడకుండా అడిగాడు.

అప్పటికి నీకింకా బుల్లెట్ తగల్లేదులే. మొత్తానికి నువ్వు చాలా బాగా యాక్ట్ చేసావు" చిద్విలాసంగా నవ్వుతూ అన్నారాయన.

"ఏదో మీ దయ" త్రివేది సిగ్గును కప్పేసుకుంటూ అన్నాడు.

"అవునవును. నా దయ వుండబట్టే ఇలాంటి యాక్షన్ చూడాల్సి వస్తోంది. అమ్మాయి బెదురుకున్నట్లుంది. ముందు ఆమె సంగతి చూడు" ఆయన బాల్కనీలోకి వెళ్ళిపోయారు.

త్రివేది, లక్ష్మి కేసి చూసి ఓ వెర్రినవ్వు నవ్వి "గుడ్‌మార్నింగ్ గురూ!" అన్నాడు.

"స్నానం చేసి రండి ముందు. టిఫిన్ చల్లారిపోతుంది"

"అసలు డ్రీమ్ ఎంత థ్రిల్లింగ్‌గా వుందంటే..." చెప్పబోయాడు.

"తెలుసు?"

"తెలుసా?" ఆశ్చర్యపోయాడు త్రివేది.

"చూశాను."

"చూశావా? నా కల నువ్వు చూశావా?"

"చాల్లే ఊర్కోండి! ఆ బాల్కనీ లోంచి ఎక్కడ దూకేస్తారోనని హడిలి చచ్చి పోయాను" లక్ష్మి కళ్ళల్లో లీలగా తడి కనిపించింది.

"ఛ...ఛ... ఊర్కో లక్ష్మీ ఏమిటిది? కాస్త థ్రిల్లింగైన కల కన్నాను. అంతేగా?"

లక్ష్మి చురుగ్గా చూసి "నాన్న గారి ఫ్రెండ్ ఒకాయన వస్తున్నారట. మీరు త్వరగా స్నానం చేసి రండి" అని చెప్పింది.

త్రివేది మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

* * * * *

'షి ఎండ్ హి డిపార్ట్‌మెంట్ స్టోర్'

మేఘన కారును పార్క్ చేసి లోపలికి వెళ్ళింది.

రాంబో కారుదిగి ఆమెను వెంబడించాడు.


స్టోర్స్ లోపల రష్ ఎక్కువగానే వుంది.

అతడు చుట్టూ చూశాడు, మేఘన అటు చివర ఆరో సెక్షన్ మేకప్ మెటీరియల్స్ దగ్గర కనిపించింది.

పేంట్ జేబుల్లో చేతులుంచుకుని సీన్‌కానరీ నడకను అనుకరిస్తూ వెళ్ళి ఆమె పక్కన నిలబడి మెల్లగా దగ్గి షోకేస్‌లోకి చూడసాగాడు.

మేఘన తలతిప్పి చూసింది.

"మంకీ ఎండ్ పింకీ లిప్‌స్టిక్ వుందా?" రాంబో ఎదురుగా వున్న సేల్స్‌మాన్‌ని అడిగాడు.



మేఘన విసురుగా తలతిప్పుకుంది.

"అలాంటి ప్రొడక్ట్ ఏదీ లేదు సార్" సేల్స్‌మాన్ రాంబోకేసి వింతగా చూస్తూ చెప్పాడు.

"ఇందాక చెప్పిన రోజ్ కలర్ చూపిస్తారా?" మేఘన ఆ సేల్స్‌మాన్‌ని తనవైపు తిప్పింది.

"ఒక్క నిమిషం మేడమ్! అది లోపల స్టాక్ రూం లోంచి తేవాలి. తీసుకొస్తాను" అతను చెప్పి లోపలకు వెళ్ళాడు.

రాంబో మేఘన కేసి చూశాడు. ఆమె అతనికేసి చూసింది. రెండు పుంజులు పందేనికి ముందు మెడమీది ఈకలు నిక్కబొడుచుకుని కలబడబోవటానికి చూసుకున్నట్లు చూసుకున్నారు.

కోపం ఛాయలను రాంబో మొఖంలోంచి మెల్లగా తప్పిస్తూ గంభీరంతో కూడిన కొంటె నవ్వును పెదాలపైకి తెప్పించి "నీకున్న పొగరంతా ఇప్పుడు పూర్తిగా వదిలించేస్తాను" చెప్పాడు.

మేఘన కళ్ళు రెండూ ఎవరేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించగా కంఠం రెక్‌లెస్‌నెస్‌గా "గెట్ లాస్ట్" అని చెప్పింది.

ఏ మాత్రం చలనంలేని నిర్లక్ష్యమైన ఆమె స్వభావానికి రాంబో మండిపడ్డాడు. "తప్పక తను అనుకున్న విధంగా ఇప్పుడు ఈ అమ్మాయిని అవమానిస్తే తప్ప నా కోపం చల్లారదు" అనుకున్నాడు.

కోపంగా అతడు మేఘనకేసి చూశాడు.

అసలామె అతనివైపే చూడకుండా పక్కకు వెళ్ళిపోసాగింది.

రాంబో ఒక్కసారిగా కదిలి నిర్లక్ష్యంగా నడుస్తోన్న మేఘనను గట్టిగా పట్టుకుని ఆమెను గుంజుతూ, తనూ గింజుకుంటూ "దొంగ... దొంగ... అరె ఆగు" అంటూ అరవసాగాడు.

స్టోర్స్‌లో వున్న కస్టమర్లందరూ తలలు తిప్పి చూశారు.

ఒక అబ్బాయి దాదాపు పరుగెత్తి పారిపోబోతున్న స్థితిలో వున్న ఓ అమ్మాయిని గట్టిగా పట్టుకు బంధించి ఆపబోవడం, ఆ అమ్మాయి గింజుకుంటూ తప్పించుకోవాలని చూడడం కనిపించింది.

అంతా కదిలి అక్కడకు వచ్చారు.

స్టోర్ ఓనర్ కూడా గొడవను చూసి గబగబా వచ్చి చేరాడు.

"ఏంటి? ఏమైంది??" అడిగాడా ఓనర్.

అప్పుడు రాంబో మేఘనను వదిలి అతి పెద్దగా వచ్చిన దొంగ ఆయాసాన్ని మెల్లిగా తీర్చుకుంటూ "ఈ... ఈ... అమ్మాయి నా పర్స్ కొట్టేసి పారిపోతోంది" అని చెప్పాడు.

మేఘన చివ్వున తల ఎత్తింది.

అంతా ఆమె ముఖంలోని గుచ్చి గుచ్చి చూడసాగారు.

అప్పటికింకా రాంబో చేతిలోనే వున్న చేతిని విసురుగా గింజుకుని కోపంగా చూసింది.

"నిజమేనా?" స్టోర్ ఓనర్ అడిగాడు.

"నిజమే సార్! నా పర్స్ ఆ హాండ్‌బాగ్‌లో దాచేసింది. కావాలంటే పరిశీలించి చూడండి."

"అది నీ పర్సేనని నమ్మకమేమిటి?"

"అందులో ఐదు వందలున్నాయి. అంతేకాదు. నా అడ్రస్, నా ఫోటో కూడా వున్నాయి."

షాప్ ఓనర్ మేఘనకేసి తిరిగి "ఏదమ్మా! నీ హాండ్‌బాగ్ ఓసారిలా ఇవ్వు" అన్నాడు.

మేఘన విసురుగా ఇచ్చింది.

ఆయన అందులోంచి పర్స్ బయటకు తీశాడు. అందులో నిజంగానే ఐదు వందలు, అతని ఫోటో, అడ్రస్ అతను చెప్పినవన్నీ వున్నాయి.

అప్పటిదాకా నిశ్శబ్దంగా వున్న జనాల్లో కలకలం మొదలైంది.

"పర్లు(హాండ్ చాలా గట్టిదే!" ఎవడో జనంలోంచి మతారంగా ఆమె మనసును దెబ్బ కొట్టాడు.

అప్పుడు చూసింది మేఘన, మెల్లమెల్లగా స్లోమోషన్‌లో తలను పైకెత్తి అందరినీ నిశితంగా, పరిశీలనగా చూసింది. అది ఎంత గొప్ప చూపంటే ఆ చూపులోని ఎమోషన్స్ బహుశా మహానటి సావిత్రికి కూడా దొరికి వుండవు. అంత గొప్ప ఫీలింగ్‌తో నిండిన చూపది.

"నేను... నేను... దొంగనా? ఏ నిజం మీకు తెలుసునని నన్నిలా చూస్తున్నారు. కళ్ళుండీ నిజాన్ని చూడలేని గుడ్డి సమాజంలోని మనుషులు మీరు. ఓ ఆడదాన్ని మలినం చేయడంలో ఆనందం చూడగల రాక్షసులు. ఇంత అవమానాన్ని, నిందను..." ఆమె యాంగిల్ మెల్లగా స్టోర్ ఓనర్‌కేసి తిప్పి చూసి '... మీకు.. మీకేగానీ ఓ కూతురు వుండివుంటే ఆమే అన్యాయంగా పదిమందిలో అవమానింపబడుతోంటే కలిగే ఆనందం ఇదే సార్! బాగా ఆనందించండి! తనివితీరా" కంఠం పూడుకు పోగా ఒక్కసారిగా కుప్పకూలిపోయి చూసే వాళ్ళ గుండెలు చెదిరిపోయేలా రోదన మొదలెట్టింది.

స్టోర్ ఓనర్‌కి ఆమె రోదన చూస్తుంటే అంతరంగం కదిలిపోయి పైకి తన్నుకొచ్చింది.

అక్కడున్న జనాలంతా దేవదాసు సినిమా అయిపోయాక లేచి బయటకు వచ్చిన

## అద్దంలో నీ ముఖం

భయం నీ నీడలాంటిది
జడుసుకుని పలాయనం చిత్తగిస్తే,
శ్మశానం దాకా వెన్నంటి తరుముతుంది.
నీ సుందర స్వప్నాలకి
మృతిమగీతం పాడేసి
నిన్ను ఎక్కడో పారేసుకున్న
నిషాదాన్ని వెతుక్కుంటావెందుకు?

జానెడు కడుపే నీ జీవితాన్ని ఆక్రమిస్తుంటే
అనుమానాలు, కన్నీళ్ళు, దిగుళ్ళతో
నీ జీవిత పటాన్ని నింపివేస్తావెందుకు?
జాలి, సానుభూతి గుర్తింపులొచ్చు వైపు
పరుగులిడతావెందుకు?

జీవన సౌందర్యం తెలిసినా,
వాస్తవం నీకు శత్రువు
సంస్కృతి మురికి ప్రవాహంలో
అభ్యంగన స్నానాలాచరిస్తావు

సహచరుల్లో శాంతిని వేటాడి
అశాంతితో అలమటిస్తున్నట్లు ఆక్రందిస్తావు
ప్రేమను, మానవ సంబంధాలను
ప్రయోజనాల స్కేలుతో కొలుస్తూ
ఉజ్వల భవిష్యత్తులోకి పాకాలంటావు
నీదైన సర్వం పోగొట్టుకుని
నిన్ను నీవే దగా చేసుకుంటూ
ఊసరవెల్లిలా బతుకుతావు

పసిపాప నవ్వు
ఓ అరవిరిసిన పువ్వు
ఓ సంధ్య రువ్వే వెలుగు

నీ మురికి హృదయానికి సోకకుండా
డబ్బు గోడ కట్టేస్తావ్

నీ జీవన మార్గంలో
ప్రకృతి అందం
ఓ సుమధుర గీతం
నపుంసకుడికి అందాల భార్యలా
నీ ఇంద్రియాలను సోకవ్!

'కరెన్సీ' ఊబిలో పడి
వచ్చి కంపుకొడుతున్న
మా నవ జాతిలో నువ్వొకడివి
నడుస్తున్న శవానివి.

— పానుగోటి కృష్ణారెడ్డి

ప్రేక్షకులయ్యారు.

"లేమ్మా! లే! అసలేం జరిగిందో చెప్పు. నేను నీకు న్యాయం జరిగేలా చూస్తాను" ఓవర్ మేఘనను లేపుతూ అన్నాడు.

అనూహ్యమైన రీతిలో ఆ వాతావరణంలో సెంటిమెంట్ సూపర్‌హిట్ కావడంతో, కంగారు నిండిన రాంబోకి కాస్త చెమట పట్టింది.

మేఘన చెంపలమీద చారికలను తుడుచుకుంటూ "అసలతని పర్సు గురించి నాకేం తెలియదు. నేను నా హాండ్‌బాగ్ లోని మనీపర్సు తీసి డబ్బులు లెక్క పెట్టుకుంటూంటే అతడు చటుక్కున దాన్ని కొట్టేసి పాంట్ వెనుక జేబులో తోసి పారిపోబోయాడు. నేను అరిచాను. జనాలు వెనక్కి తిరగటంతో అతడు పారిపోలేక పర్సు నాబాగ్‌లో పడేశాడు. కానీ అది నా పర్సు కాదు. అతడిదే. అతడు హడావుడిలో ఆ సంగతి చూసుకోలేదు. కానీ అతడు వెంటనే దాన్ని గమనించి ఇలా అరుస్తూ నాటకమాడుతున్నాడు" సినిమాస్కోప్ లెవల్లో కళ్ళకు కట్టినట్లు చెప్పింది మేఘన.

స్టార్ ఓవర్ రాంబో కేసి ఒక్క చూపు చూశాడు. అది చాలు సెంటిమెంట్ ఎంతలా పేలిందో తెలుసుకోడానికి.

"వెనక్కి తిరుగు" ఓవర్ కంఠం కరుకుగా పలికింది.

రాంబో తిరిగాడు.

ఆయన రాంబో పాంట్ వెనుక జేబులోంచి ఆమె మనీ పర్సును బయటకు తీశాడు.

రాంబో కళ్ళు మూసుకున్నాడు. "బహుశా చైనుతో, లేక ఇంకే వస్తువైనా తీసుకొని కొట్టవచ్చు"

అంతపనీ జరుగబోయింది.

మేఘన వారించి "ఎవరూ కావాలని అరాచకానికి పాల్పడరు. ఏ అవసరం వచ్చి అతను ఇలాంటి పని చెయ్యవలసి వచ్చిందో" అని రాంబో కేసి తిరిగి "...నీ ఇంట్లో ఎవరికైనా సీరియస్‌గా వుందా?" అని ఓ యాభై రూపాయిలు రాంబో చేతిలో పెట్టి వెళ్ళిపోయింది.

ఓదార్పు ఆ క్షణంలో రాంబోకి రవ్వంత దొరికితే చాలు గుండె బద్దలయ్యేలా అయిపోయాడు.

*　　*　　*　　*　　*

జూన్ 23, ఢిల్లీ, శాంతాక్రజ్

ప్రయాణీకులతో విమానాశ్రయం హడావుడిగా వుంది.

అతడు లోపలకు నడిచాడు. అతనితో ఒక చిన్న బ్రీఫ్‌కేస్ మరి మూడు పెద్ద సూట్‌కేస్‌లు వున్నాయి.

వాటిని తనతోపాటుగా విమానం లోపలికి తీసుకు వెళ్ళటం కుదరదు.

ఒక్క బ్రీఫ్‌కేస్ మాత్రం తనతో వుంచుకున్నాడు. దాన్ని కూడా మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ చేశాక కానీ లోపలకు రానివ్వలేదు ఆ ఏర్‌లైన్స్ ఉద్యోగి.

అతని మిగతా లగేజ్ మాత్రం కన్వేయర్ బెల్ట్‌మీదుగా విమానం చేరుకుంది.

అలా చేరుకున్న లగేజ్‌ను విమానంలోకి ఎక్కించే ముందు ప్రతి ప్రయాణికుడు తమ తమ వస్తువులను దూరం నుంచి గుర్తించాలి. అలా గుర్తించని లగేజ్‌ని విమానంలోకి ఎక్కించరు.

అతడు తన సూట్‌కేస్‌లు చూపించాడు.

ఏర్‌లైన్స్ ఉద్యోగి ఆ విషయం బోర్డింగ్ కార్డ్‌పై వ్రాసి సంతకం చేశాడు.

ప్రస్తుతానికి అక్కడ ఇద్దరే ఏర్‌లైన్స్ ఉద్యోగులు పని నిర్వహిస్తున్నారు. దానితో ఎక్కడా లేనంత హడావుడీ ఏర్పడింది వాళ్ళకు. విమానం సకాలంలో బయలుదేరాలి కాబట్టి వారంత హడావుడిగా వున్నారు. ప్రతి సామానూ వాళ్ళంతగా పట్టిపట్టి చూడడం లేదు.

ఆ హడావుడీని అవకాశంగా తీసుకుని అతడు కదిలాడు. తన మూడు సూట్‌కేస్‌లలో రెండోదాన్ని చురుగ్గా తెరిచాడు.

ఎవ్వరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు.

అందులోంచి తూటాలు నింపి వున్న రివాల్వర్‌ను అతడు తాపీగా బయటకు తీసి తన కోటు జేబులో పెట్టుకుని దర్జాగా విమానంలోకి ప్రవేశించాడు.

త్రివేదికి ఎవరో బాత్‌రూం తలుపు తడుతోన్న అలికిడి వినిపించి చదువుతోన్న పేపర్ మడిచిపెట్టి "ఎవరు?" అన్నాడు. అతడికి చాలా కోపంగా వుంది. చదువుతోన్న థ్రిల్లింగైన న్యూస్‌కి మధ్యలో అంతరాయం ఏర్పడినందుకు.

"త్వరగా రండీ!" లక్ష్మి గొంతువినిపించింది.

త్రివేది ఇక స్నానం చెయ్యడం మొదలు పెట్టాడు. దాదాపు పది నిమిషాల తరువాత బయటకు వచ్చాడు.

డ్రాయింగ్ రూంలో మావగారి గొంతుకు పోటీలా వున్న మరో వ్యక్తి గొంతు వినిపిస్తోంది.

త్రివేది అరగంటసేపు అది వెతుక్కుని, ఇది వెతుక్కుని తయారయి వచ్చాడు. మధ్యలో లక్ష్మిని పిలిస్తే అసలు రాలేదు.

డ్రాయింగ్ రూంలోకి అడుగుపెట్టిన త్రివేదిని చూసిన రంగారావుగారు "అల్లుడూ! నీకు రడీ అవడానికి ఇంత సమయం కావాలా? నా ఫ్రెండ్ విశ్వనాథానికి నిన్ను పరిచయం చేద్దామనుకున్నాను" అన్నారు.

"ఏరాయన?" త్రివేది చుట్టూ చూశాడు.

"వెళ్ళిపోయాడు. మళ్ళీ వస్తాడు రేపు."

పోన్లెండి. మళ్ళీ వస్తారు కదా?"


"కొన్ని రోజులు ఇక్కడే వుంటాడు కూడా!"

"చాలా మంచిది. వుంటేనే బాగుంటుంది"

అప్పుడు రంగారావుగారు అల్లుడు కేసి ఓ చూపు చూసి "అల్లుడూ నీకు గానీ, కాస్త చిత్త చాంచల్యం ఏమైనా వుందా?" అని సూటిగా అడిగారు.

త్రివేది ఉలిక్కిపడ్డాడు. ఆయనలా అడుగుతాడని అతడు ఊహించలేదు. అందుకే వెంటనే "ఎంత మాట అన్నారు మామగారు! ఈ విషయం మీకు నన్ను మీ అమ్మాయినిచ్చి చేశాక అనుమానం వచ్చిందా? పెద్దవారు, మీరిలా జంకూ,గొంకూ లేకుండా అనేస్తే మనస్సు చాలా కష్టపెట్టుకుంటుంది. లక్ష్మి కూడా బాధపడుతుంది" త్రివేది అలుపు లేకుండా, ఫుల్‌స్టాప్ లేకుండా సూటిగా చెప్పాడు.

అతని వాగ్ధాటికి తగ్గి రంగారావుగారు "సర్లేవయ్యా! ఆ థ్రిల్లింగ్ అంటూ వుంటావటగా. అది కాస్త తగ్గించుకో. అమ్మాయి జడుసుకుంటోంది." అని వెళ్ళిపోయారాయన.




త్రివేది నిలబడిపోయాడు. అతడికి ఎదురుగా అంతకు ముందెప్పుడో వచ్చిన థ్రిల్లింగ్ ఆలోచనకు బలైన టేప్‌రికార్డ్ కనిపించింది.

*　　*　　*　　*　　*

సుదీర్ఘమైన డెఫినిషన్స్ ఇస్తూ క్లాస్‌లో వున్న ప్రతి అణువూ తనిచ్చే లెక్చర్‌నే చెవులు పెద్దవి చేసుకుని శ్రద్ధగా వినాలనే విపరీతమైన ఆశతో ఇండస్ట్రియల్ మేనేజిమెంట్ లెక్చరర్ దీక్షితులుగారు ఓ ప్రొఫెసర్ లెవల్లో సోషియల్ రెస్పాన్సిబులిటీ గురించి వివరించసాగారు.

చదివేది ఎం.బి.ఎ.నో లేక మెకానికల్ ఇంజనీరింగో అర్థంకాక స్టూడెంట్స్ మధ్య నుంచి నిశ్శబ్దం మెల్లగా తప్పుకోసాగింది.

ఆయన బోర్డ్ మీద ఫిగర్స్ వేయడం ఆపారు.

తప్పుకుంటోన్న నిశ్శబ్దం లోంచి ఓ పేపర్ రాకెట్ శరవేగంతో దూసుకొచ్చింది.దాని చివర వున్న గుండుసూది సాయంతో బ్లాక్‌బోర్డ్ ఫ్రేంకి వున్న చెక్కలో కస్సున దిగబడి ఇక అక్కడ సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరుచుకుంది.

ఆ యూనివర్సిటీ లెవల్లో, ఆ క్లాసు లెవల్లో అది చాలా విశేషమైన పని. ఇంత వరకు 'ఎం.బి.ఎ. క్లాస్ చరిత్రలోకెక్కని మొదటి దండయాత్ర.

ఆయన మొఖాన్ని బోర్డుమీంచి మెల్లగా డైరక్షన్ తప్పిస్తూ స్టూడెంట్స్ కేసి చూశారు.

పిన్‌డ్రాప్ సైలెన్స్ ఒక్కసారిగా క్లాస్‌రూంలో పేరుకుపోయింది.

ఇంత శ్రమ పడి, అర్థం చేసుకోలేని వెధవ కూడా అర్థం చేసుకునేట్లు, ముఖ్యంగా తనకు కంఠ శోష వచ్చేట్లు లెసన్ చెబుతోంటే జరిగిన ఈ అరాచక చర్యకు కారకుడెవరో తెలిస్తే అక్కడికక్కడే క్రైమా చెయ్యాలన్న ఆలోచన వచ్చి కూడా ఆయన అంతరంగంలో ఆగిపోయింది.

ఆయన యూనివర్సిటీకి రాకముందు ప్రైవేటు కాలేజీలోను, అంతకు ముందు ట్యుటోరియల్ కాలేజీలోను పనిచేశారు. బహుశా ఇంకో ఆరేళ్ళ తరువాత రిటైర్ అయిపోవచ్చు. అప్పుడు శ్రేష్ఠమైన గొర్రెలు ఓ పాతిక కొనుక్కుని వాటిని ఆస్ట్రేలియా లెవల్లో పెంచగలిగే సత్తా, ఆయన సంపాదించాడు.

ఆయన స్టూడెంట్స్ మనోభిలాషను గుర్తించి 'మీకు నా లెసన్ బోరు కొడుతోందా?' అని అడిగారు. ఆయన ఏ క్లాసు వాళ్ళని ఏ లెవల్లో సరిచెయ్యాలో బాగా అనుభవంలో వున్న మనిషి!

ఎవరూ మాట్లాడలేదు.


"నాకు తెలుసు. మీకు బోర్ కొడుతోంది. అంటే మిమ్మల్ని నేను విసిగిస్తున్నానన్న మాట" అని నవ్వి రాంబో వెనుకగా వున్న షీలా మాధురిని "మిస్ షీలా ఈ మధ్య సినిమాలేమైనా చూశారా?" అని అడిగారు.

షీలా మాధురి లేచి నిలబడింది. ఆమెకు మొహమాటం అంటే అర్థం తెలీదు. "జాన్‌బాజ్ చూశాను సార్" అని చెప్పింది.

"ఎలా వుంది?"

"టెర్రిఫిక్ సార్"

"మీరు వారానికి ఎన్ని సినిమాలు చూస్తారు?"



"మీరు నన్ను సీరియెస్‌గా అడుగుతున్నారా?"

"అవును. చెప్పండి."

"నాలుగో, అయిదో చూస్తాను"

"కూర్చోండి." చెప్పాడాయన.

ఎందుకు అడిగాడో, ఎందుకు కూర్చోమన్నాడో మాత్రం షీలా మాధురికి అర్థం కాలేదు. ఆమె కూర్చుంది.

"మిస్ మేఘనా మీరీమధ్య కొత్త పాటలు ఎవైనా విన్నారా?" ఆయన మేఘనను అడిగారు.

మేఘన లేచి నిలబడింది. "యస్ సార్" అంది.

"అవేమిటో తెలుసుకోవచ్చా?"

"ష్యూర్! సిరివెన్నెల, రాక్షసుడు" చెప్పింది.

"రెండిట్లో మంచి పాటలు వున్నాయా?" ఆయన అడిగారు.

"మీ రెలాంటివి ఇష్టపడతారు?" మేఘనే ప్రశ్నించింది ఆయన్ని.

"నేను వ్రాయలేని సాహిత్యం వున్న పాటలైతే నాకిష్టం. నేను ఇంకా బాగా వ్రాయగలను అనిపించే పాటలైతే నేను అలా విని ఊరుకుంటాను" చెప్పారాయన.

"అయితే సిరివెన్నెల వినండి. రాక్షసుడి పాటలు అలా విని ఊరుకోండి" చెప్పింది మేఘన.

ఆయన నవ్వి "మంచిది" అని స్టూడెంట్స్ అందరి వైపు చూసి "క్లాస్ పూర్తి కావడానికి పదిహేను నిమిషాలుంది. ఈ సమయంలో మీకో చిన్న ఐ.క్యూ. టెస్ట్ పెడతాను" అని చెప్పారు.

ఐ.క్యూ. టెస్ట్ అనగానే కుతూహలంగా చూశారు ఆయన కేసి.

"ముందు మీరు ఈ రూమ్‌లో వున్న వస్తువులను ఓ అయిదు నిమిషాలు పరిశీలించండి. తర్వాత చెప్తాను" అని చెప్పి "ఊ! చూడండి. కేవలం అయిదు నిమిషాలే సుమా!" ఆయన చెప్పి తన పుస్తకంలో తలదూర్చాడు.

దాదాపు మూడు నిమిషాల తరువాత తలెత్తి చూశారు. అంతా గోడలు, తలుపులు పరిశీలిస్తూ కనిపించారు. ఆయన నవ్వుకొని తలవంచుకుని మరో రెండు నిమిషాల తరువాత తలెత్తారు.

తలుపులు, కిటికీలు చూడ్డం అయిపోయిన అబ్బాయిలు, అమ్మాయిలు ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుకుంటున్నారు. అంతేకాదు, అమ్మాయిలు కొంగులు సరిచేసుకుంటోంటే, అబ్బాయిలు క్రాఫ్‌లు, కాలర్లు సరిచేసుకోటం యాదృచ్ఛికంగా జరిగిపోతోంది.

చదువుతోన్న ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బుక్ మూసేసారాయన. ఇంకాస్సేపాగితే క్లాసులోనే కనిపించేటట్లుంది లేటెస్ట్ డెవలప్‌మెంట్.

"ఒ.కే. ఇటు చూడండి. అంతా అన్నీ గమనించారా?" అని అడిగారు.

అంతా చూశామని చెప్పారు.

"అయితే మీరు ఓ పేపర్ మీద మీరు ఈ రూమ్‌లో ఎన్ని వస్తువులున్నాయో, ఏవేవి మీరు చూశారో వ్రాయండి! ఎవరెక్కువ వ్రాస్తే వాళ్ళకు ఐ.క్యూ ఎక్కువన్నమాట! కానీ ఐదు నిమిషాలే సుమా నేనిచ్చే సమయం!" ఆయన చెప్పారు.

అందరి తలలూ ప్రేయర్ చేస్తోన్నట్టు బల్లలమీదకు వంగాయి. అంటే వ్రాయడం మొదలు పెట్టారు.

ఆయన నవ్వుకున్నారు.

దాదాపు ఐదు నిమిషాల తరువాత ఆయన లేచి నిలబడి స్టూడెంట్స్ దగ్గిరకు వెళ్ళి వాళ్ళు వ్రాసిన పేపర్‌లు తీసుకున్నారు.

ఆయన ఒక్కొక్క పేపర్ చూడసాగారు. మూడు నిమిషాల్లో ఆయన కావలసిన ఓ ఐదు పేపర్లు పక్కన పెట్టారు. ఆయనకు కావలసినది ఎవరెక్కువ రాశారు అన్నదికాదు. ఎవరు రాకెట్ కూడా రాశారు అన్నది.

ఆయన ఆ రాకెట్ వ్రాసిన ఐదుగురి పేపర్లు తిరిగి పరిశీలించాక తల ఎత్తి "మిస్టర్ పవన్ ఈ రోజు క్లాసులన్నీ అయిపోయాక నన్నోసారి డిపార్ట్‌మెంట్‌లో కలవండి" అని చెప్పారు. ఎందుకంటే అతడొక్కడే పేపర్ రాకెట్‌కున్న గుండు సూదికూడా వ్రాసింది.

బెల్ మోగింది. ఆయన లేచి వెళ్ళిపోతూ మనసులో "దటీజ్ దీక్షితులు" అనుకున్నారు.

*        *        *        *        *

త్రివేది చాలా కంగారుగా వున్నాడు. కంపెనీ రిప్రజెంటేటివ్ పోస్ట్ ఖాళీ అయింది. దానికి ఇవ్వాళ ఇంటర్వ్యూలు నిర్వహించాలి.

కంపెనీకి అతి ముఖ్యమైన పోస్ట్‌కి అర్హత ఇవ్వబడే వ్యక్తిని త్రివేది చాలా సునిశితంగా అబ్జర్వ్ చెయ్యాల్సి వుంది.

అతడు ఇంటర్‌కమ్‌లో సెక్రటరీని పిలిచి "అభ్యర్థులను వరుసగా పంపించండి" అని చెప్పి రిసీవర్ పెట్టాడు.

"మే ఐ కమిన్" తలుపు తీసుకుని మొదటి అభ్యర్థి నిలబడి అడిగాడు.

"యస్, కమిన్"

అతడు వచ్చి కూర్చున్నాడు.

త్రివేది వచ్చిన వ్యక్తికేసి చూశాడు పరిశీలనగా. వయసు కాస్త ఎక్కువలాగా వుంది. కానీ కొంతమంది రిటైర్డ్ పీపుల్స్ చాలా యాక్టివ్‌గా రిప్రజెంటేటివ్ వర్క్ చేయగలరు.

త్రివేది అతను కూర్చున్న పొజెషన్ చూశాడు. "ఫర్వాలేదు. కమాండింగ్ గానూ, 'గంభీరంగానూ కనిపిస్తున్నాడు" అనుకున్నాడు.

"మీ పేరు?" త్రివేది అడిగాడు.


"విశ్వనాథం"

కంఠం కంచులా ఖణఖణ మోగింది. త్రివేది మనసులోనే మెచ్చుకున్నాడు. ఈ ఉద్యోగానికి వాయస్ పెట్టని ఆభరణం.

"మీకీ వయసులో ఉద్యోగం చెయ్యాలని ఎందుకనిపించింది, ఐ మీన్ మీరు రిటైర్ అయిన తరువాత?" త్రివేది అడిగాడు, ఆయన వయసును దృష్టిలో వుంచుకుని.

"ఖాళీగా వుండడం ఇష్టంలేక"

"ఇప్పుడీ ఉద్యోగం కనుక మీకిస్తే బాధ్యతగల రిప్రజెంటేటివ్‌గా మొదట మీరేమని కస్టమర్‌కి వివరిస్తారు?" త్రివేది అడిగాడు.



''ఇతర ప్రొడక్ట్స్ కన్నా మన ప్రొడక్ట్ ఎంత గొప్పదో వివరిస్తాను.

త్రివేది మెచ్చుకోకుండా వుండలేకపోయాడు. మొదట మనసరుకెంత గొప్పదో చెబుతానని చెప్పకుండా ఎదుటివాళ్ళ సరుకుకన్నా ఎంత గొప్పదో చెబుతాననే నిర్ణయం చాలా గొప్పది. అంతేకాదు ఈ ఉద్యోగం మీ కివ్వగానే అని అడిగినప్పుడు మీ ప్రొడక్ట్ అనకుండా మన ప్రొడక్ట్ అని చెప్పాడు'' త్రివేది మనసులోనే నిర్ణయించేసుకున్నాడు.

ఇంతలో ప్యూన్ కాఫీ తీసుకొచ్చాడు.

''తీసుకోండి'' త్రివేది చెప్పాడు.

ఆయన తీసుకోగానే కప్పు పట్టుకున్న పద్ధతిని, సిప్ చేసే విధానాన్ని గమనించాడు. క్రాఫ్ దువ్విన పద్ధతి, బట్టల కలర్ కాన్షస్‌నెస్ అన్నీ విశదంగా చూశాడు. ఇవి మనుషుల ప్రవర్తనను తెలియచేస్తాయి.

''ఈ పేపర్ మీద ఈ మేటర్ వ్రాసి సంతకం చెయ్యండి'' కాఫీ తాగాక చెప్పాడు త్రివేది.

ఆయన ఆ పని చేసి పేపర్ ఇచ్చాడు.

త్రివేది అక్షరాలు పక్కకు పడిపోయాయా? తిన్నగా వున్నాయా, గజిబిజిగా వున్నాయా? కుడి నుంచి పైకి పోయాయా? క్రిందకు పోయాయా? చూడసాగాడు. దీని ద్వారా మనిషి మనస్తత్వాన్ని తెలుసుకోవచ్చు.

''నువ్వు రంగారావు అల్లుడివి. అవునా?'' ఆ అభ్యర్థి త్రివేదిని అడిగాడు.

అక్షరాలను సమగ్రంగా పరిశీలించడంలో మునిగిన త్రివేది కళ్ళు ఓ చోట హఠాత్తుగా ఆగిపోగా మెల్లమెల్లగా తలపైకెత్తి ఎదురుగా కూర్చున్న ఆ అభ్యర్థికేసి సూటిగా చూశాడు.

''వున్నాడా లోపల?'' అడిగాడు అభ్యర్థి లోపల ఆఫీస్‌రూంలోకి చూస్తూ!

''ఎవడు?''

''రంగారావు''

త్రివేది అనుమానంగానూ, వింతగానూ చూశాడు.

''నాకు ఇంతకీ నువ్వు ఉద్యోగం ఇచ్చినట్లేనా?'' ఆయన త్రివేదిని అడిగాడు.


''అంటే ఇవ్వకపోతే మావగారి రికమెండేషన్ అడుగుదామనా? ఎంత ధైర్యం. నా సంగతింకా తెలిసినట్లు లేదు. పిచ్చి మానవుడు'' అనుకుని త్రివేది, ''రికమెండేషన్ ఎక్కడ్నుంచి వచ్చినా ఈ ఉద్యోగం మీకు రావడమనేది కల'' అని చెప్పాడు. అసలు ముందు ఉద్యోగం ఈయనకే ఇద్దామనుకున్నాడు. కానీ ఇతను రికమెండేషన్ కోసం పరుగెత్తడం చూస్తే త్రివేదికి చిరాకేసింది.

''ఓరీ విశ్వం! వచ్చావురా? నీ కోసం నేను రాత్రి నుంచి ఎదురు చూస్తున్నాను. నువ్వే వస్తావని అనుకున్నాను'' ఒక్కసారిగా లోపల్నుంచి రంగారావుగారు బయటకు రావడం, తాను ఇంటర్వ్యూ చేస్తోన్న అభ్యర్థిని ఆప్యాయంగా పలుకరించడం త్రివేదికి చాలా ఆశ్చర్యంగాను, వింతగాను తోచింది.

త్రివేది తన ఆశ్చర్యాన్ని ఆపుకోలేక ''ఈయన... ఈయన'' అంటూ మావగారికేసి చూశాడు.

## సంప్రదాయ దీపావళి

ఏటేటా మనం జరుపుకుంటున్నాం
సత్యభామ నరకుని చంపిన సంప్రదాయ దీపావళి
రిజర్వేషన్ల వంటి ఎన్నో కలహాల
నిప్పుబుడ్లను కాల్చుకుంటున్నాం
రకరకాల సమ్మెల సీమ టపాకాయల
టపటపలను మనం వింటూనే ఉన్నాం
రోజురోజుకీ పెరిగే వేగంతో రివ్వున
నింగికి ఎగిరే ధరల తారాజువ్వలను చూస్తున్నాం



గిరున భూచక్రంలా తిరిగే కరువును
మనం కళ్ళారా వీక్షిస్తూనే ఉన్నాం
వివిధ రూపాలలో పేలే ట్రాన్సిస్టర్ బాంబుల
చప్పుళ్ళకు బెదిరి చెవులు మూసుకుంటూనే ఉన్నాం
ఇది ఏడాది పొడుగునా జరుగుతున్న దీపావళి
మనకొద్దు ఇటువంటి సరికొత్త దీపావళి
లెండి నడుం బిగించి రండి
సరికొత్త దీపావళికి పాడుదాం భరతవాక్యం మనమంతా
జరుపుకుందాం ఆనంద సంప్రదాయ దీపావళి

—ఇసుకపల్లి సుజాత

"అల్లుడూ! వీడే నా ఫ్రెండ్ విశ్వం. చిన్నప్పట్నుంచి మంచి స్నేహితులం. వీడితో ఒకే కంచంలో అన్నం తినాలనుకుని విఫలమయ్యాను. నేను ఒక ముద్ద తినేలోగా మొత్తం ఖాళీచేసేవాడు. ఇక ఒకే మంచం అంటావా, చూస్తున్నావుగా ఆ కుర్చీలో ఎంత నిండుగా కూర్చున్నాడో, ఇక ప్లేస్ వుండదు" రంగారావుగారు నవ్వారు.

వెంటనే తిరిగి "ఇతనేరా విశ్వం నా అల్లుడు" అని రంగారావుగారు విశ్వనాథంగారికి త్రివేదిని పరిచయం చేశారు.

"ఓహో! అనుకున్నాను! నువ్వు చెప్పిన లక్షణాలన్నీ కనిపిస్తున్నాయి" ఆయన చిద్విలాసంగా నవ్వి రంగారావుగారితో కలసి లోపలకు వెళ్ళిపోయారు.

లోపల గదిలో కుర్చీలో కూర్చుంటూ విశ్వనాథంగారు "ఒరేయ్! నేను ఊరు వెళ్ళిపోతున్నారా? అమ్మాయికి చదువైపోయి వచ్చేస్తోంది" అని చెప్పారు.

"అమ్మాయి వచ్చేస్తోందని ఇంతదూరం, ఇంత కాలానికి వచ్చి వెళ్ళిపోతావా?"

"తప్పదురా! చాలా కాలానికి వస్తోంది అమ్మాయి!"

"చంపేస్తాను. రాకరాక వచ్చావు. పది రోజులైనా వుండాల్సిందే."

"ఉండాలని నాకూ వుందిరా! మరి అమ్మాయి ఒక్కతే అక్కడ వుండాలి"

"అందుకే నిన్ను వెధవ్వి అనేది. అమ్మాయికి ఫోన్ చేసి ఇక్కడికే రప్పించు. ఇద్దరూ కలిసి నా దగ్గర కొన్ని రోజులుంటే నాకెంత ఆనందం"

"అవున్రా! నువ్వు చెప్పిందీ బావుంది. అమ్మాయిని ఇక్కడికే రమ్మని ఫోన్ చేద్దాం. నీ దగ్గర వున్నట్లూ వుంటుంది. అమ్మాయికి కొత్త ఊరు చూపించినట్లూ వుంటుంది" విశ్వనాథంగారు ఏ మాత్రం మొహమాటం లేకుండా ఒప్పుకున్నారు.

* * * * *

"ఈ రోజు నీ కారేమైంది?" అని షీలా మాధురి మేఘనను అడిగింది.

"రిపేర్-షెడ్‌లో ఉంది?"

"మరి ఎలా వచ్చావు?"

"తెలుగు ప్రయాణ వాహనములో!"

"వామ్మో! ఎంత చక్కని తెలుగులో చెప్పావే నా రాణీ!"

"కడుపులో కాలుతోంటే ఇంకా స్వచ్ఛమైన తెలుగు వచ్చేస్తుంది. కాంటీన్‌కి పోదాం పదవే నా రాజా!" చెప్పింది మేఘన.

"ఆగండి...ఆగండి..." మేమూ వస్తున్నాం." వాళ్ళ మిగతా బృందం కూడా తరలి వచ్చింది.

గుంపుగా కలిసి కేకలతో, నవ్వులతో యూనివర్సిటీ కాంటీన్ కేసి నడిచారు.

కాంటీన్‌లో ఒక్క పురుగు లేదు. వంటవాళ్ళు, క్యాషియర్ తప్ప. ఆ క్యాషియరు కూడా అమ్మాయే!

"నాకు ఇడ్లీ!"

"నాకు దోసె"

ఆ తరువాత పూరి, చపాతీ లాంటి కేకలు కూడా వినిపించాయి. కానీ గోలలో క్యాషియర్‌కి ఏ టోకెన్లు ఎన్నివ్వాలో అర్థం కాక సీరియస్‌గా చూడసాగింది.

"హోరుమయ్యిందే!" అని షీలా మాధురి అందరినీ గదమాయించింది.

అప్పుడు మేఘన "ఇప్పుడు ఒక్కొక్కళ్ళే చెప్పండి" అంది.

అంతా చెప్పారు. ఎవరికి ఏమేం కావాలో.

క్యాషియర్ టోకెన్స్ ఇచ్చింది.

ఆ టోకెన్లన్నీ తీసుకెళ్ళి వంటవాడి చేతిలో పోసి "త్వరగా ఇస్తావా లేక ఉల్లిపాయల కోసం కొట్టుకి, పిండి కోసం సిటీలోకి వెళ్ళిరావాలా?" అని అడిగింది షీలా మాధురి.

"అమ్మా! మీరు కూర్చోండి తల్లీ! అన్నీ ఉన్నాయి. పది నిమిషాల టైమిస్తే అన్నీ ఇచ్చేస్తాను" అని వాడు చెప్పాడు.

"దట్స్ గుడ్" షీలా మాధురి వెళ్ళి కుర్చీలో కూలబడింది. మిగతా బృందంలో కొందరు ఎలక్షన్స్ కోసం అంటించిన పేపర్ పోస్టర్స్‌ని చదివి కామెంట్ చేస్తున్నారు. కొంతమంది కూలబడి బాతాఖానీ మొదలుపెట్టారు.

పన్నెండు నిమిషాల తరువాత వేడి వేడి టిఫిన్ వచ్చింది.

అంతా కలిసి ప్లేట్ల మీద పడ్డారు.

"ఇది దోసా? ఉల్లిపారా? ఏమే నీ చీర చూపించవే?" అంటూ పూరన్ చీర కొంగు తీసి "దోసె కన్నా నీ చీరే మందంగా ఉంది కదే" అంది పర్వీన్.

"చాల్లే ఈ గారె చూడు ఎంగేజ్‌మెంట్ రింగ్‌లా ఎలా ఉందో?" షీలా మాధురి అంది.

మేఘన పూరీ తీసి "ఇదెలా ఉందో ఎవరైనా చెప్పగలరా?" అని అడిగింది.

"ఓ యస్! అది దీక్షితులుగారి బుగ్గలా ఉంది."

మేఘన ఉబ్బిన పూరీని నొక్కేసి "ఇప్పుడు?" అంది

"మదన్ మొఖంలా ఉంది" చెప్పింది పూరన్. ఒక్కసారిగా అంతా నవ్వారు.

ధఢేల్ మన్న శబ్దంతో కాంటీన్ తలుపు మూసుకుంది. చేతులు రెండు వెనక్కి పోనిచ్చి తలుపు గడియ వేసి మదన్ లోపలికి వచ్చాడు.

అతడు ఈ యూనివర్సిటీలో తిరుగులేని పెద్దమనిషి. అతనితో గొడవ పెట్టుకుంటే గోదారి లోతులు చూసుకోవాల్సిందే.

"ఎవ్వరూ కదలకండి" చెప్పాడు.

క్యాషియర్ మాత్రం వణికిపోసాగింది.

"నిన్నేం చేయను! ఏమీ అనను! వణక్కుండా కూర్చో" చెప్పాడతను.

మేఘన కదిలింది.

తాపీగా పాంట్ జేబులోంచి మడత చాకును తీసి చాకు పదును చూడసాగాడు.

"ఎంత కళాత్మకంగా ఉంది" శీలా మాధురి గొణిగింది.

"భయపడుతున్నారా మైడియర్ చిక్స్. ఎందుకు భయం?" అంటూ ముందుకు నడిచాడు.

సరిగ్గా పూరన్ దగ్గర కొచ్చి ఆగి "మైడియర్ చికెన్ సిక్స్టీ ఫైవ్ నా మొఖం ఎలా ఉంది?" అని అడిగాడు.

"చె...చె... చెందర బింబం"

మదన్ కాంటీన్ దద్దరిల్లేలా నవ్వాడు.

"ఎవ్వర్నీ ఏమీ చెయ్యను. మర్యాదగా పర్సులు ఇలా ఇచ్చేయండి."

"పర్సులా దేనికి! పర్సుల కోట్లు చాలా ఉన్నాయ్‌గా. ఆ బిజినెస్ అంత బాగుండదేమో!" శీలా మాధురి చెప్పింది.

"అలాగా చిల్లీ చికెన్! అయితే పర్సులుంచుకుని డబ్బులు ఇచ్చేయండి" అని చెప్పాడు.

"భలే! కొత్త రకం పందాలా బావుంది...బావుంది..." మెచ్చుకోలుగా నవ్వింది.

"షటప్! పర్సులు, మీ నగలు కూడా ఇచ్చెయ్యండి. లేదా నాలుగు పోట్లన్నా పొడిపించుకోండి" కత్తి చూపించి చెప్పాడు.

"నేను అమర జీవినౌతా! వీర వనితనౌతా! పర్సులు, నగలు చచ్చినా ఇవ్వను" శీలా మాధురి గంతులు వేయసాగింది.

"కాళ్ళు కూడా విరక్కొడతా? మర్యాదగా పర్సులు, నగలు ఇవ్వండి" అన్నాడు ఒక్క దూకు మరిదుకు దూకి.

పూరన్, పర్వీన్, శీలా మాధురి, రాధ, మాధవి అంతా కెవ్వున అరిచారు.

ఆ కేకలు శ్రవణానందకరంగా వున్నాయి. వికటాట్టహాసం చేశాడు మదన్.

"లాభం లేదు ఇచ్చెయ్యండి" మేఘన చెప్పింది.

అంతా ఒకే యూనిట్‌గా మారి పర్సులు, నగలు గుట్టగా పోశారు.

అతడు అన్నీ ఖర్చీఫ్‌లో మూట కట్టుకుని ఆనందంగా విజిల్ వేసి "థాంక్స్ మైడియర్ జింజర్ చికెన్స్" అన్నాడు.

చప్పున శీలా మాధురి కదిలి "ఇన్ని ఇచ్చేం కదా! ఆ కత్తి మాకిచ్చేసి వెళ్ళకూడదూ బోన్‌లెస్ చికెన్" అంది.

"ఆ." అంటూ ఆమె కేసి చూసి ఆమె అన్న మాటలకు మరొక్క వికటాట్టహాసం చేసి "ఉంచుకో చిన్నమ్మా! ఎప్పటికైనా పనికొస్తుంది" అని చాకు విసిరేసి నాలుగు గెంతుల్లో బల్ల మీంచి దూకి తలుపు తీసుకుని పారిపోయాడు.

అప్పుడు చూసింది శీలా మాధురి మేఘన కేసి అనుమానంగా. తర్వాత "నువ్వు చెప్పింది నిజమే" అంది.

మేఘన సన్నగా విజిల్ వేసి నవ్వింది

అందరూ ఆశ్చర్యంగా, ఆనందంగా నవ్వుకుని కాంటీన్ నుంచి బయటకు బయలుదేరారు.

**   **   **

"తెచ్చావా?" ఆత్రంగా అడిగాడు రాంబో

"ఖర్చీఫ్ తెరిచి పర్సులన్నీ ఓ గుట్టగా పోసి "నగలు పెద్దగా లేవు. అన్నీ చిన్ని చిన్ని, బుల్లి బుల్లి పోగుల్లాంటివి. చాలా సన్నగా ఉన్న నాలుగు గొలుసులే వచ్చాయి" అని చెప్పి "...ఫాషన్‌లు పెరిగాక నగలు తక్కువై పోయాయంటావా? ఏమైనా కానీ నీ కోర్కె తీర్చాను" చెప్పాడు మదన్.

మదన్ భుజం ఆనందంగా తట్టి "థాంక్స్‌రా బాబాయ్! నీలాంటి పెద్ద మనుషులు ఇలా పెద్ద మనసుతో హెల్పు చేయడం చాలా ఆనందదాయకం" అని చెప్పాడు రాంబో.

"చూసుకో పర్సుల్లో ఎంతుందో? ఇంతకీ నువ్వేంటి ఈ బిజినెస్‌లోకి దిగావు?" అడిగాడు మదన్.

"దిగలేదురా బాబాయ్! ఆ మేఘన గర్వం అణచాలి. ఇవ్వాళా అమ్మాయి బస్సులో వచ్చింది. చేతిలోని డబ్బులిప్పుడిలా కోల్పోయింది. పాపమిప్పుడింటికెలా వెళ్తుంది చూడాలి" చెప్పాడు.

"నాకెందుకులే గానీ నే పోతున్నా! గుర్తుంచుకో ఎలక్షన్స్‌లో మాత్రం నన్ను గుర్తుంచుకో" మదన్ వెళ్ళిపోయాడు.

రాంబో పర్సులు తీశాడు. ఓ పర్సులో ఐదు పైసలు, మరో పర్సులో పది, మరో దాన్లో ఐదు పైసలు.

రాంబో కనుబొమలు ఆశ్చర్యంతో ముడుచుకున్నాయి.

అన్ని పర్సులు గాలించాడు. ఏ ఒక్క దాన్లోనూ పది పైసలకు మించి లేవు.

అతను ఆఖర్న మేఘన పర్సు తీసి చూశాడు. అందులో రాగి రంగులో ఉన్న ఓ నాణెం కనిపించింది.

అతడు వెళ్ళిపోతోన్న మదన్‌ని బిగ్గరగా పిలిచి ఆపి పరుగెత్తుకుంటూ వెళ్ళి "ఇదేమిటి? దీన్నేమంటారు?" అని అడిగాడు.

"దీన్ని దమ్మిడీ అని పిల్చేవారు పూర్వకాలంలో" మదన్ నవ్వి చెప్పాడు.

రాంబో మొఖంలో కత్తి వాటుకు నెత్తురు చుక్క కూడా లేనంతగా తెల్లబడింది. గొలుసులు తీసి చూశాడు. రోల్డ్ గోల్డ్‌వని తెలిసిపోయింది.

రాంబో వేలాడిన మొఖంతో కారు దగ్గరకు నడిచాడు. అతడి కారు ముందు టైర్లలో ఒక దానికి పూర్తిగా గాలి తీసేయబడి వుంది.

**   **   **

ఎన్నో రోజులనుంచి యావచ్ఛక్తినీ వినియోగించి చిక్క పట్టుకున్న బాధ ఒక కన్నీటి బొట్టుగా మారి బలవంతానా మూయడానికి ప్రయత్నిస్తోన్న బరువైన రెప్పలను తెరగబడి బయటకు జారింది.

చేయి స్టీరింగ్ తిప్పుతున్నా మనసు మాత్రం కురిసే వానలా కలచివేస్తోంది.

వాన తుంపర్లు తుంపర్లుగా పడుతూనే వుంది.

రాత్రి కావడంతో లైట్ల వెలుగుల్లో తడిసిన రోడ్డు మిలమిల లాడుతోంది.

ఆమె కారు ఎటు పోతోందో ఆమెకే తెలీనట్లు డ్రైవ్ చేస్తోంది.

అనుకోకుండా ఆమె కారు శబ్దం చేసుకుంటూ ఆగిపోయింది.

ఆలోచనా తరంగాలను వదిలి చూసిందామె.

ముందు బోనెట్ నుంచి పొగలు పైకి లేస్తున్నాయి.

ఆమె ఆగిపోయిన కారును చూసుకుని విరక్తిగా నవ్వుకుంది.

దూరంగా స్తంభం మీద వెలిగిన ఆకు పచ్చ సిగ్నెల్ లైట్ వెలగటంతో కాంతి వచ్చి అద్దాలపై పడి ఆకుపచ్చ రంగులో మెరవసాగింది.



ఆమె బయటకు చూసింది.

కారు ప్రస్తుతం రైల్వే ట్రాక్ మీద రెండు పట్టాల మధ్య ఆగి పోయి ఉంది.

ఒక్కసారిగా ఉలిక్కిపడిందామె.

చప్పున కీ తిప్పి స్టార్ట్ చేసింది. పొగలు, శబ్దాలు ఎక్కువయ్యాయి తప్ప, కారు కదల్లేదు.

దూరంగా కూసిన రైలు కూత చెవులు చిల్లులుపడేలా వికృతంగా వినిపించింది.

చప్పున కుడి వైపు డోర్ తీసింది. దానికేమైందో ఏమో లాక్ తెరుచుకోలేదు.

వెంటనే జరిగి ఎడం వైపు డోర్ తెరిచి దిగబోయింది. కారు ఎక్కినప్పుడు ఇరుక్కున్నట్లుంది. చీర చాలా వరకు కుడి వైపు డోర్లో ఇరుక్కుపోయి ఉంది.

ఏ క్షణం, ఏ విధంగా జరగాలో కొందరి జీవితాల్లో ఎవరో రాసినట్లే జరిగిపోతాయి.

ఆమె గుండె కొట్టుకునే వేగం ఆమె చెవులకు చాలా స్పష్టంగా వినిపిస్తోంది.

ఆమె ప్రస్తుతం విరక్తితో, విరాగినిలా ఉంది కానీ, జీవితం మీద మాత్రం విరక్తి లేదు.

బలమంతా వినియోగించి చీర లాగింది. రైలు వచ్చేలోగా బైటపడిపోవాలి. ఆమె ఆతృతతో గుంజ సాగింది.

కాల యముడిలా భయంకరమైన రూపంలో రైలు కొద్ది నిమిషాల దూరంలోకి వచ్చేసింది.

ఆమె గొంతు ఎండిపోయింది.

చేతులు ప్రయత్నిస్తున్నాయి. కళ్ళు బెదిరి పోతున్నాయి, గుండె వేగం ఎక్కువైంది, మెదడు మొద్దుబారి పోతోంది.

అతి పెద్దగా విరుచుకుపడుతోన్న ఉప్పెనలా రైలు వచ్చి పడింది.

ఆమె గుండెలు అవిసిపోయేలా కేక పెట్టి స్టీరింగ్ మీద వాలిపోయింది. జుట్టంతా ఒక్కసారి స్టీరింగ్ మీద చిందర వందరగా పడిపోయింది

ఓ పువ్వుల పువ్వుల గార్డెన్ సిల్క్ శారీ మెల్లగా వచ్చి క్రమ క్రమంగా స్క్రీన్‌ను ఆక్రమించింది.

ఆ చీర లక్ష్మిది. ప్రస్తుతం ఆమె త్రివేది టి.వి.లో చూస్తోన్న సినిమాకు అడ్డుగా నిలబడింది.

త్రివేది కళ్ళన్నీ టి.వి. మీదే ఉన్నాయి.

"ఒక్క సెకను డార్లింగ్. ఏమైందో చూడనీ" ఆత్రుత నిండిన మనసుతో అడిగాడు.

"ఆగను. ఇలాంటి సినిమాలు చూసి మీరు చెడిపోతున్నారు" చెప్పిందామె.

"ప్లీజ్...ప్లీజ్...ఆ అమ్మాయి కేమైందో చూడనీ!"

"నో... వీల్లేదు"

"మా అమ్మవుగా తప్పుకోమ్మా!"

'తప్పుకోను."

"నీకు టెక్స్‌లో ఐస్‌క్రీమ్ ఇప్పిస్తా!"

"వాయిగు కావాలి."

"అలాగే, తప్పుకో గురూ!"

ఆఖరి ఎగ్జామ్ వ్రాసి రాంబో బయటకు వచ్చాడు. ఆకాశం నిండా మబ్బు పట్టి ఉంది.

బయటకు వచ్చేసిన చాలా మంది చెట్ల క్రింద, పోర్టికోలో నిలబడి వ్రాసిన ఎగ్జామ్ గురించి, ఇక ముందు భవిష్యత్ గురించి మాట్లాడుకుంటున్నారు.

మేఘన కూడా బయటకు వచ్చింది.

దూరంగా కొండల వెనుక ఉన్న మేఘాలు మరికొన్ని ఒక్కసారిగా కదిలి వచ్చాయి.

యూనివర్సిటీ బాటకు ఇరుప్రక్కలా పొడవునా పెద్ద పెద్ద గుల్మొహరా చెట్లు ఆకులు కనిపించనంతగా ఎర్రని పూలతో విరగబూసి ఉన్నాయి.

మేఘన అడుగు ముందుకు వేసింది.


ఒక చినుకు కురిసింది. దాని వెంట కొన్ని, ఇక వెంట వెంటనే వాన పెరిగి పెద్దదైంది.

వాన భారానికి గుల్మొహరా పువ్వుల గుత్తులు బాగా క్రిందకు వాలి ఎర్రని సింహద్వారంలా మనోహరంగా ఉంది. రాలిన రేకులు నీళ్ళలో పడి కొట్టుకుపోతూ పగడాల వానలా అనిపిస్తోంది.

దూరంగా వెళ్ళిపోతోన్న స్టూడెంట్స్ కూడా వెనక్కి వచ్చి పోర్టికోలోను, వరండాలలోను నిలబడి పోయారు.

మేఘన స్తంభానికి ఆనుకుని శైలా మాధురితో మాట్లాడుతోంది. శైలా మాధురి కళ్ళజోడు పైకి తోసుకుంటూ వింటోంది.

జయసింహ అనుకోకుండా అందరి మధ్యలోకి వచ్చి ఎత్తుగా ఉన్న దిమ్మమీద నిలబడి "డియర్ ఫ్రెండ్స్ ఈ రోజుతో మన యూనివర్సిటీ చదువు అయిపోయింది. అంటే




"రమ్ చాక్లెట్స్ కూడా కావాలి?"

"అలాగే అసలా అమ్మాయికి ఏమైందో తెల్సుకుంటే చాలు కట్టేస్తాను. ఆ అమ్మాయి థ్రిల్లింగేం చూస్తారు. నేను చూపిస్తాను" లక్ష్మి త్రివేది ప్రక్కన కూర్చుంది.

త్రివేది చెయ్యి రిమోట్ కంట్రోల్ మీదకు వెళ్ళింది.

ఆప్యాయంగా భర్త మొఖాన్ని రెండు చేతులతో తీసుకుని పెదవులపై ముద్దు పెట్టబోయింది.

ఫాస్ట్ ఫార్వాడ్ నొక్కి వెనక్కి జరిగాడు త్రివేది.

లక్ష్మి వెనక్కి వచ్చింది.

చప్పున ఆపి టి.వి.లోకి చూశాడు.

వేగంగా వచ్చిన రైలు వేగంగానే దూసుకుపోయింది.

స్టీరింగ్ మీదకు వాలిపోయిన తల మెల మెల్లగా పైకెత్తింది. భయంతో పట్టిన చెమటకు ఎర్రగా ఓ గీతలా తిలకం చెదిరిపోయింది. జుట్టు ముఖానికి అంటుకు పోగా భీత హరిణిలా చూసింది.

రైలు ట్రాక్ మీదున్న వేరే లైన్ మీదుగా దూసుకుపోయింది.

పెదాలు వణుకుతో అదరుతున్నాయి. మెల్లగా మెల్లగా కూడగట్టుకున్న ధైర్యం ఒక్కసారగా ఉప్పెనలా పెరిగి ఏడుపు తెప్పించాయామెకు.

టి.వి. కట్టేసి త్రివేది లక్ష్మి కేసి చూశాడు.

ఆమె సోఫాలో దూరంగా కూర్చుని టి.వి., వి.సి.ఆర్. కేసి కసిగా చూస్తోంది.

"హలో!హాయ్!" త్రివేది పలుకరించాడు.

ఇక ఏం జరిగిందీ అన్నది నిజంగా ఇప్పుడు అనవసరం.

** ** **

జీవితంలోని ఆఖరి ఎంజాయ్‌మెంట్ లైఫ్ అయిపోయినట్లే. ఇక ఎవరి జీవితం వాళ్ళదే." చెప్పసాగాడు.

"సుత్తెందుక్కాని అసలు పాయింట్‌కి రా!" పర్వీన్ అంది.

"నువ్వు నోరెత్తకు, నేను చెబుతాను" అని అందరి కేసి చూస్తూ "ఈ ఆఖరి రోజున మనకి ఓ చిన్న ఎంటర్‌టైన్‌మెంట్" అని చెప్పాడు.

"ఏం నాయనా? నువ్వేమైనా పాడబోతున్నావా?" ముందే చెప్పు" శైలా మాధురి జోరుగా కురుస్తూ ఉన్న వానకేసి ధైర్యంగా చూస్తూ అడిగింది.

"షటప్‌శైలా నా పాట కాదు అందరికీ నచ్చే ప్రోగ్రాం గురించి నేను చెప్పేది."

"చంపకుండా చెప్పు" పూరన్ అరిచింది.

అతడు గొంతు పెంచి "యూనివర్సిటీ సిల్వర్ రేసర్ రాంబో డాన్స్ మీరిప్పుడు తిలకిస్తారు" అని చెప్పాడు.

అందరి గొంతుల్లోంచి ఒక్కసారిగా అనేక వాయిద్యాలన్నీ కలిపి ఒకే రాగం పలికిస్తోన్నట్లుగా "ఓ" అన్న శబ్దం వినిపించింది.

రాంబో డాన్స్ ఎలాంటిదో యూనివర్సిటీలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. అది డిస్కో డాన్స్ కాదు, రాక్ డాన్స్ కాదు, బ్రేక్ డాన్స్ కాదు, కుప్పిగంతులు, సాంప్రదాయసిద్ధమైన డాన్స్ అసలలాంటి దేదీకాదు.

అదో విచిత్రమైన కదలిక. తన శరీరం మీద తనకు కంట్రోల్ ఉంటే తప్ప సాధ్యం కానిది.

ఒక రోజు ఖాళీ అవర్ క్లాస్ దొరికితే చాలు, క్లాస్‌లోని పొడవాటి బల్లల మీద అతడి అడుగుల చప్పుళ్ళు గుండె తలుపులను ఇట్టే తట్టి లేపుతాయి. లయ విన్యాసంలా కదిలే కాళ్ళు శరీరాన్ని తిన్నగా నిలబెట్టి కుర్చీ చివర కాలు వేసి కుర్చీతో పాటుగా పడకుండా

ప్రొమెండప్‌గా జారుతూ చేసే విన్యాసమది. లయ దానికి ముఖ్యం.

చప్పున శీలా మాధురి చేతులు మెడను పిసుక్కోవడం మొదలుపెట్టాయి. ఆనందం పట్టలేనప్పుడు ఆ పిల్ల చేతులు అలా ఊరికే మెడ మీదకు వెళ్ళిపోతాయి.

మేఘన కళ్ళలో కూడా కుతూహలంతో కూడిన ఆనందం వచ్చి చేరింది. ఆ ప్రత్యేకత కలిగిన డాన్స్ ఆమెకు కూడా ఇష్టమే.

వెంటనే పది మంది అబ్బాయిలు వెళ్ళి పొడవాటి బల్లలు తెచ్చి స్టేజీని తయారు చేశారు.

ఇదంతా రాంబో ప్రమేయం లేకుండానే జరిగిపోయింది. రాంబో స్టేజీ ఎక్కక తప్పలేదు.

ఒక్కసారిగా "యా...యా...యాయా...యా...యా" అన్న కేకలతో పోర్టికో దద్దరిల్లింది.

"డియర్ ఫ్రెండ్స్..." రాంబో చెప్పబోతోంటే ఈలలు, చప్పట్లు మారు మోగాయి.

చేతులు పైకెత్తి అందిరినీ ఆగమని చెబుతూ "నేను ఇక్కడ ఇలా డాన్స్ చెయ్యమని అడగటం చాలా అన్యాయం. దానితో లయ కావాలి. మూడ్ కావాలి." అన్నాడు.

"అన్నీ ఉన్నాయ్! నువ్వు రడీగా ఉండు బడ్డీ!" పూరన్ అరిచింది.

రాంబో ఆశ్చర్యంగా చూశాడు.

"లయ మేఘన చూసుకుంటుంది. మీకు తెలుసుగా ఆమె గళంలోని పాటలు ఎంత రిథమిక్‌గా, వినసొంపుగా ఉంటాయో?" శీలా మాధురి చెప్పింది.

ఆ సంగతి ప్రతి ఒక్కరికీ తెలుసు. మేఘన ఏ మాత్రం మొహమాటం లేకుండా ఒప్పుకుంది. ఆనందం అనుభవించాలంటే మొహమాటాన్ని పక్కన పెట్టాలి దాన్ని పట్టించుకోకూడదు.

రాంబో స్టేజీ చివరకు వెళ్ళి కుడి చేతిని పెదాలపై ఉంచి విసిరాడు.

మేఘన అతడి ముఖంలోకి మొట్టమొదటి సారిగా పరిశీలనగా చూసింది. రెండు విశేష లక్షణాలు ఆమెను ఆకట్టుకున్నాయి. మొదటిది అతడు కనురెప్పలు త్వర త్వరగా ఆర్పడు. చాలా సూటిగా ఉన్న చూపులో అతడు మగవాడనే ముద్రపడి పోతుంది. రెండోది ఏ మాట చెబుతోన్నా పెదాల కదలిక తప్ప, తల ఊగటం కానీ, తిప్పడం గానీ జరగదు. చాలా స్థిరంగా చెబుతోన్నట్లు అనిపిస్తుంది. ఈ రెండూ ఆమెకు ప్రత్యేకంగా కనిపించాయి.

అతడు విసిరిన ముద్దును మేఘన వెనుక నిలబడిన శీలా మాధురి ఎగిరి అందుకున్నట్టు నటించి గుండెల్లో దాచుకుంది.

మేఘన స్తంభానికి ఆనుకుని లయ కూడిన పాటను ఆలోచించసాగింది.

రాంబో ఆమె కేసి చూశాడు. అతడు ఆమె పాడబోయే పాటకు డాన్స్ చెయ్యాలి. ఆమె పాడటానికి ఒప్పుకుంది. రాంబోకి ఆ విషయం మనసులో ఏదోగా అనిపించసాగింది.

జనాలు ఒక్కసారి కేకలు పెట్టారు.

ఆ కేకలను చీల్చుకుని మేఘన కమలమైన కంఠంలో నుంచి "ఆహో... అయ్యాహో..." అనే లయ వినిపించింది.

నిశ్శబ్దం వచ్చి పోర్టికోలో నిలబడింది.

ఆమె రాగం పూర్తికాగానే శీలా మాధురి ఆ రాగపు లయను అనుకరిస్తూ క్లాప్స్ కొట్టింది.

"మొగలి పూల తోటలోన ఆహో"

"సందమామ నవ్వాడు అయ్యాహో"

లయకు తాళం కలిపింది. జనాలందరూ లయను కాచ్ చేస్తూ చప్పట్లు కొట్టసాగారు. అందరి గొంతుల్లోంచి వాక్యం చివర "ఆహో...అయ్యాహో" అనే ముక్కను ఓ విన్యాసంలా పలుకసాగారు.

పడిపోయేట్లున్న శరీరాన్ని అతి చురుగ్గా లేపి తన పద్ధతిలో మైమరచి డాన్స్ చెయ్యసాగాడు.

"రేతిరంత వాదంటు ఆహో
చీకటమ్మ కులికింది అయ్యాహో
ముత్యమంటి పీమకు మూసి ఆహో!
మేఘమమ్మ మురిసింది అయ్యాహో"

గుల్మోహరా పువ్వుల మీద వానజల్లు విసురుగా వచ్చి పడింది. ఎర్రని రేకులు జల జలా రాలి క్రింద పడ్డాయి.

ఇప్పుడు కురిసే వానను ఎవరూ పట్టించుకోవడం లేదు. అదీ క్షణంలో పూర్తిగా తగ్గి పోయినా వాళ్ళలో ఒక్కళ్ళు కూడా ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్ళిపోయే స్థితిలో లేరు.

** ** **

# అల్లరుల వల్లరులు

జన సందోహానికి అర్థం అయ్యే కవిత్వం
మన సాహిత్యంలో రాలేదు యింకనూ సమత్వం.
ఇనకుల తిలకుడి చరిత్ర సమస్తం
ఇందీవరాక్షుడి నాలుగో నేత్రం.
ఇల వేలుపుగా కొలిచిన వేయి పడగలు
ఒకనాడయినా నిజం చెప్పిన బడగలు.
రాయలసీమలో కొలచిన ముత్యాలు
రతనాల రాశుల నోటి తీటలు.
ఎన్నికల సంరంభంలో చిక్కుకున్న జీవితం
ఎన్నుకున్న మార్గంలో జరగదు సంతతం.
విరాగం బోధించే ఉత్తమ పురుషులు
అనురాగానికి వేస్తున్నారు అల్లరి పునాదులు.
ఎంత దూరమయినా ప్రయాణం సాగును
అల్లంత దూరంలో ఒయాసిస్ కనిపించును.
కని పెంచిన తలిదండ్రుల నిదాన గతులు
వినిపించిన మృదంగ తంత్రుల నిర్ణయ రీతులు.
జగమంతా విచ్చలవిడిగా తిరుగగలవాడు
పగలంతా బయటపడక భయపడు దొరకాడు.
రాజమాణిక్యం దొరికిన తరుణంలో నేనా?
పూజా గృహంలో అల్లరి మొదలయిందన వలెనా?

—"శ్రీవిరించి"

త్రివేది సాయంత్రం కంపెనీ నుంచి తిన్నగా ఇంటికి వచ్చేశాడు. వస్తూ వస్తూ స్వాతి ముత్యం వి.సి.ఆర్. కాసెట్ తెచ్చుకున్నాడు.

కారు పోర్టికోలో పెడుతూ "లైట్లు వేసి లేవు. లక్ష్మి ఎక్కడకు వెళ్ళిందో?" అనుకున్నాడు.

కారుదిగి వచ్చాడు. నిజంగానే తలుపు లాక్ చేసి ఉంది.

తన వద్ద ఉన్న డూప్లికేట్‌తో తలుపు తీశాడు. అతడితో పాటుగా పిల్లగాలి మెల్లగా లోపలకు ప్రవేశించింది.

ఎదురుగా టేబుల్ మీద లక్ష్మి పెట్టిన పేపర్ తీసి చదివాడు. "మా ఫ్రెండ్ వచ్చింది. బలవంతంగా సినిమాకు వెళుతున్నాను. వచ్చేదాకా అల్లరిచెయ్యకుండా కామ్‌గా కూర్చోండి" అని ఉంది అందులో.

నలిపి మూలకు విసిరేశాడు.

వెళ్ళి తలుపేసి వచ్చి కాసెట్ పెట్టాడు.

కోటు తీసి సోఫా చివర పారేశాడు. పై కాస్త లూజయ్యేలా పీకి సోఫాలో ఫ్రీగా కూర్చొని సినిమా చూడసాగాడు.

సినిమా ప్రింట్ కాస్త బావుండటంతో కళ్ళన్నీ టి.వి. మీదే ఉన్నాయి. అలా ఏక నిరంజన్‌లా ఒంటరిగా సినిమా చూస్తూ ఆనందించసాగాడు.

పిల్లగాలికి పరదాలు కదిలాయి.

పురుగేదో వచ్చి చెంప మీద వాలింది. చేతితో కొట్టి తరిమేసి సినిమా చూడసాగాడు.




దాదాపు ముప్పావు గంట గడిచింది

కాలింగ్ బెల్ మూడుసార్లు మ్రోగింది.

త్రివేది లేచి వెళ్ళి తలుపు తీశాడు.

లక్ష్మి లోపలకు వస్తూ "సారీ బాస్, దాని దుంప తెగ, తెగ గోల చేయడంతో వెళ్ళక తప్పలేదు" సంజాయిషీగా అంది.

"భలే దానివే నేనేమన్నాను. అసలు నువ్వు అప్పుడప్పుడు ఇలా వెళ్ళడమే నాకు ఆనందం" అనేసి సోఫాలో కూర్చున్నాడు. ప్రస్తుతం అతని మనసు టి.వి. లోని సినిమా మీదుంది.

లక్ష్మి లోపలకు వస్తూ అడిగింది "ఏం సినిమా?"

"స్వాతి ముత్యం."

"ఎలా ఉంది?"

"చూసేశాక చెప్తాను."

అతని సమాధానానికి నవ్వుకుంటూ ముందుకు నడిచింది. కాలి కింద మెత్తగా ఏదో తగిలింది.

వంగి చూసింది. గులాబి రంగు లేడీస్ ఖర్చీఫ్ ఆమె కళ్ళను ఆప్యాయంగా పలకరించింది.

లక్ష్మి కనుబొమలు ముడిపడ్డాయి. అది ఆమెది కాదు. నెమ్మదిగా లోపలకు నడిచింది.

టి.వి.లో "రామా కనవేమిరా?" అంటూ పాట వినిపిస్తోంది.

బెడ్‌రూంలో లైట్ వేసింది.

ఎదురుగా నలిగిపోయిన మంచం.

టి.వి.లో "రఘురామా కనవేమిరా?" పాట చాలా స్పష్టంగా వినిపిస్తోంది.

పక్క దగ్గరకు నడిచింది. రెండు మల్లె పూవులు నలిగిపోయి పక్కన పడి ఉన్నాయి.

ఆమె గుండెలో నెప్పుని జ్వాలలు రగలసాగాయి.

వంగి మంచం క్రింద చూసింది. ఎవరూ లేరు కానీ మరికొన్ని పూలు మాత్రం కనిపించాయి.

ఆమె బయటకు వచ్చింది.

త్రివేది, కమల్‌హాసన్ యాక్షన్‌లో లీనమై, మిళితమై చూస్తున్నాడు. టై లూజుగా మెడమీద ఓ పక్క వేలాడుతూంది. కోటు సోఫా చివరపడి ఉంది. నుదిటిమీద జుట్టు చెదిరిపోయి ఉంది.

లక్ష్మి హృదయాంతరాళాలలో ఒక్కసారిగా ఎన్నడూ ఎరుగని వేదన పుట్టుకొచ్చింది.

టి.వి.లో పాట పల్లవి దాటింది.

"మిసి మిసి నగవుల రసిక శిఖామణులు
కొసవెరి చూపుల అసదన విక్రములు
మీసం మెలిపే రోష పరాయణులు."

త్రివేదికి పూర్తిగా వచ్చిందా పాట. ఎప్పుడు కమల్‌హాసన్ తాళి తీసి రాధిక మెళ్ళో కట్టేస్తాడా అని ఆత్రంగా చూస్తున్నాడు.

లక్ష్మి వెళ్ళి అడ్డంగా నిలబడింది.


మహిళలకు శుభవార్త!

అపోలో షోరూమ్

ఫోన్ : 32014



మహిళలకు కావలసిన
పట్టు చీరలు, పట్టు లంగాలు,
బెనారస్, ఆరంజీ, టిష్యూ,
పఠోలా, రేషన్ పఠోలా, చందేరి

మరియు

అన్ని రకముల ఫ్యాన్సీ చీరలు
మరియు సూటింగు,
షర్టింగు, మరియు
డ్రెస్ మెటీరియల్స్ -

పట్టుచీరలకు మా ప్రత్యేకత!

అపోలో షోరూమ్
బ్రాడీపేట, మెయిన్‌రోడ్, గుంటూరు-522 002

VISIONS.GNT

"తప్పుకో గురూ! చూడనీ మంచి సీన్ పోతోంది." అరిచాడు త్రివేది.

"ఇక్కడ నా జీవితమే పాడైపోతోంది" లక్ష్మి బాధగా చెప్పింది.

"ఏమైంది?"

"ఇదెవరిది?" ఖర్చీఫ్‌ను ఎలుక తోకను పట్టుకున్నట్టుగా తీసి చూపించింది.

"ఓహ్! నాకేం తెలుసు గురూ నువ్వు తప్పుకో!" అసహనంగా అటూ ఇటూ కదిలాడు.

"ఎవరా అమ్మాయి?" ఇక సూటిగా అడిగేసింది.

"అమ్మాయా?" వింతగా చూశాడు త్రివేది.

"మరి అబ్బాయిలు కూడా వాడతారా ఇలాంటి ఖర్చీఫ్‌లు." లక్ష్మి దగ్గరగా వచ్చింది.

ఆమె కోపగించిన కన్నులు అకస్మాత్తుగా త్రివేది చెంపమీద పడ్డాయి. బాగా దగ్గరకు పోయి చూసింది.

ఆటీన్ షేప్‌లో లిప్‌స్టిక్ ముద్దర చాలా చక్కగా పడింది.

లక్ష్మి అంతరంగంలో సుడులు తిరిగి కళ్ళలోంచి ఉబికి బయటకు వచ్చాయి కన్నీళ్ళు.

"మీ థ్రిల్లింగైన జీవితంలో ప్రవేశించిన ఆ అమ్మాయి ఎవరో చెప్పండి? మీరు నన్నెప్పుడు వదిలేయదలుచుకున్నారు?"

ఆమె అరుపులకు తల తిప్పి "హేయ్! ఏంటి? సినిమాకు వెళ్ళొచ్చి చిరు గంతులు వేస్తున్నావ్! అంత థ్రిల్లింగ్‌గా వుందా?" కన్ను కొడుతూ అడిగాడు.

"అవును నా జీవితమే థ్రిల్లింగైపోయింది" ఏడవసాగింది.

త్రివేది సినిమా పిచ్చి వదిలింది.

"కమాన్ లక్ష్మీ! ఏమైందిప్పుడు?" త్రివేది విసుగ్గా అడిగాడు.

"ఇలా రండి!" లక్ష్మి అతడిని లోపలకు తీసుకువెళ్ళి మంచాన్ని, అందులోని పూలను, చూపించి వెంటనే అద్దం తెచ్చి అందులో అతని చెంపపైని ప్రేమ ముద్రను చూపించింది.

త్రివేది అదిరిపడ్డాడు.

లక్ష్మి ఏడుపుకి అతడి చేతులు నెత్తిమీదకు పోయి జుట్టు పీకసాగాయి.

అలలు అలలుగా, తెరలు తెరలుగా ఎవరో నవ్విన ధ్వని.

త్రివేది తలతిప్పి చూశాడు.

గుమ్మంలో నిలబడి ఉంది ఓ పదిహేడేళ్ళ అమ్మాయి. వైట్ పాంట్, దానిమీద స్కై బ్లూ టాప్, సెన్సేషన్ అనే పెద్ద అక్షరాలు ఆ టాప్ మీద ముద్రించి ఉన్నాయి.

లక్ష్మి ఆశ్చర్యంగా "నువ్వా?" అంది.

త్రివేది వింతగా, ఆశ్చర్యంగా "ఎవరీ పువ్వు?" అని అడిగాడు.

"ప్రక్క ఫ్లాట్! కొత్తగా వచ్చారు." చెప్పింది లక్ష్మి.

త్రివేది ఆ అమ్మాయికేసి అనుమానంగా చూశాడు.

"ఐయామ్ చిత్రా ది గ్రేట్! ఈ పనంతా నాదే! మీకు థ్రిల్లింగ్ అంటే చాలా ఇష్టమని తెలుసుకున్నాను. పనిలో పని మీ ఆవిడ ఎంత అనుమానం మనిషో కూడా తెలుసుకున్నాను. థ్రిల్లింగ్ మీకిష్టం కదా, అందుకే ఇలా థ్రిల్లింగ్‌గా పరిచయమయ్యాను. ఒకే షాట్‌కి రెండు పిట్లు" నవ్వి చెప్పింది చిత్ర.

లక్ష్మి కూడా నవ్వేసింది "చాల్లే! నేనెంత హడిలి చచ్చానో తెలుసా?" అంది.

"తెలుసుకున్నాను. మీ ఆయనకు అసలు సెన్సేషనే లేదు. నోరు తెరుచుకుని సినిమా ఎలా చూశారనీ! చెంపమీద ముద్దు పెడుతూంటే పురుగును దులిపినట్టు దులిపేశారు." చిత్ర వింతగా నవ్వి అంది.

ఈ ఒక్క విషయంలో లక్ష్మి భర్త గురించి చాలా సంతోషించింది.

త్రివేది కోపంగా చూసి "ఏమ్మా! నీకు నేను ఎగతాళిగా కనిపిస్తున్నానా?" అన్నాడు.

"లేదు లెండి! ఊరికే అన్నాను."

"నిన్ను...... నిన్ను"

"నేనేం కొరుకుడు పడే రకాన్ని కాను అలా మింగబోయేట్లు చూడనవసరం లేదు."

"లక్ష్మీ! నువ్వు చేసిన మైసూర్‌పాక్‌లు ఎక్కడ?" త్రివేది అడిగాడు.

"లోపల దాచాను."

"ప్రటా!"

"దేనికి? అవి రాంబాబు కోసం అట్టేపెట్టాను."

"ఇంకా నయం. ఇప్పుడే సరైన అవకాశం వచ్చింది. ఇప్పుడుకానీ నువ్వవి బయటకు తీయకపోతే ఇంకెప్పటికీ వాటిని చెల్లుబాటు చెయ్యలేవు."

లక్ష్మి వింతగా చూస్తూ తేవడానికి లోపలికి నడిచింది.

"అమ్మ బాబోయ్! అది నేను నిన్న వచ్చినప్పుడు తిన్నాను, నాకొద్దు" చిత్ర పారిపోబోయింది.

త్రివేది తలుపుకు అడ్డంగా నిలబడ్డాడు.

చిత్ర పారిపోవడానికి దారులు వెదుకుతూనే "రాంబాబంటే ఎవరు?" అని అడిగింది.

లక్ష్మి ప్లేటుతో వస్తూ "నా తమ్ముడు" అంది.

"తమ్ముడా!" అంటూ ప్లేట్‌ను చూసి ఎగిరి గంతేసి "వదినా బతుకుంటే నా కంతే చాలు" అంటూ రివ్వున తప్పించుకుని బయటకు పారిపోయింది.

లక్ష్మి ఆశ్చర్యంగా చూసింది.

త్రివేది కడుపారా నవ్వుతూ "ఆ అమ్మాయి నిన్ను ఒదినా! అంది. అదీ రాంబాబెవరో తెలిశాక. నీ మైసూర్‌పాక్ మహత్యం. ఆ అమ్మాయిక్కూడా తెలిసిపోయింది. ఇక ఆ రాంబాబుని దేవుడే కాపాడాలి" చెప్పాడు.

* * * *

రైల్వే ప్లాట్‌ఫారం అంతా యూనివర్సిటీ విద్యార్థులతో చాలా బిజీగా వుంది. అందరికీ ఎగ్జామ్స్ అయిపోవడంతో ఇళ్ళకు వెళ్ళిపోయే వాళ్ళు, వాళ్ళకి సెండాఫ్ ఇవ్వడానికి వచ్చిన వాళ్ళతో ప్లాట్‌ఫారం హడావుడిగా ఉంది.

రైల్లో సెకండ్ క్లాస్ కంపార్ట్‌మెంటులో ప్రయాణం చెయ్యడమంటే రాంబాబుకి చాలా ఇష్టం. ఏ స్టూడెంటైనా సెకండ్ క్లాస్‌లో ప్రయాణానికే ఎక్కువ ఇష్టపడతాడు. రైల్లో ఈ చివర్నుంచి ఆ చివరికి తిరుగుతూ బాగా ఎంజాయ్ చెయ్యొచ్చు.

రాంబో ఫ్రెండ్స్ ఏడుగురు దాకా ఉన్నారు. మేఘనతో పాటు ఆరుగురు, వీళ్ళని పంపించడానికి షీలామాధురి, పర్వీన్ మొత్తం వాళ్ళ క్లాసంతా అక్కడే ఉంది.

ఈ రెండేళ్ళూ రెండు రోజుల్లా గడిచిపోయాయి. ఎన్నెన్ని మర్చిపోలేని అనుభవాలను వాళ్ళు తమలో పదిలంగా తీసుకుపోతున్నారు. యూనివర్సిటీ చదువుతో జీవితంలో ఆఖరి ఎంజాయ్‌మెంట్ లైఫ్ కూడా గడిచిపోయింది.

మేఘన బృందంలో ఎవ్వరి ముఖం కూడా వికసించలేదు. షీలామాధురైతే వెక్కిళ్ళు కూడా పెడుతోంది. ఆమెది ఈ ఊరే కావడంతో వెళ్ళిపోతున్న ఫ్రెండ్స్‌ని చూసి దిగులు పడుతోంది.

ఆమె తిన్నగా రాంబో దగ్గరకు నడిచి "మిమ్మల్నందరినీ మళ్ళీ ఎప్పుడు చూస్తానో!" అంది ఏడుపు గొంతుతో.

"నీ పెళ్ళికి కలుసుకుందాంలే షీలా! మమ్మల్ని మాత్రం మర్చిపోకుండా పిలు" రాంబో చెప్పాడు.

"మీ కోసమైనా వెంటనే చేసేసుకుంటా."


"ఎవడే ఆ పాలబుగ్గలవాడు?" పర్వీన్ అడిగింది.


"ఛీ... ఛీ... నాకు పాల బుగ్గల అబ్బాయిలంటే ఇష్టం లేదు. కబీర్‌బేడీలాంటి హీమాన్‌ని చేసుకుంటా" కోపంగా అంది షీలా మాధురి.

"అలాగేలే మీ నాన్న ఓ పర్వతాన్ని చూసి చేస్తాడు" పర్వీన్ నవ్వింది.

షీలామాధురి ఆమె మాటలు వినిపించుకోకుండా "మీరంతా వెళ్ళిపోతూంటే నాకేడుపు వస్తోంది" ఆమె నిజంగానే ఏడవసాగింది.

రాంబో షీలా నెత్తిమీద కొట్టి "కమాన్ బడ్డీ! నువ్వేడవటమేంటీ! నువ్వు హైద్రాబాద్





వచ్చేయి. ఓ వారం రోజులు చక్కగా ఊరంతా చూపిస్తా'' అని చెప్పాడు.

''నువ్వు నిజంగా అంటున్నావా?''

''అవును హనీ! నీకు ఇదే నా సుస్వాగతం.''

గ్రీన్ లైట్ పడింది.

అంతా ట్రైన్ ఎక్కారు.

రాంబో ఆఖర్ని ఎక్కి తలుపు దగ్గర నిలబడ్డాడు.

చిన్నబోయిన వదనాలతో నిలబడ్డ మిత్రులు, మిత్రురాళ్ళ మొఖం చూసి రాంబో మనసు అదోలా అయింది. చేతులు ఊపుతోన్న మిత్రులు కనిపించనంత దూరం రైలు వెళ్ళిపోయాక రాంబో లోపలకు వచ్చాడు.

అతని ఎదురు సీట్లలో జయసింహ, రాజు, భార్గవ్ ప్రక్కన మోహన్, వసంత, ఆ ప్రక్క రెండూ ఎదురుబొదురుగా ఉన్న సీట్లలో మేఘన, పూరన్, పక్క బ్లాక్‌లో మాధవి, రాధ, నళిని, జయ, రాజు, రఘు కూర్చున్నారు.

రాంబో మేఘనకేసి చూశాడు.

మేఘన కిటికీలోంచి బయటకు చూస్తోంది. ఆమెకు తెలుసు రాంబో చూస్తున్నాడని. తల తిప్పి అతని చూపుల్లో చూపు కలిపి వెంటనే తిప్పేసుకుంది.

ఆమె రాంబోతో సాధారణంగా సంభాషణ జరపడం కన్నా అతనితో గొడవ పెట్టుకుని అతన్ని గెలవడమే ఆనందంగా ఉంది. ఎంత ఆవేశం తెచ్చుకున్నా మొఖంలో కనబడే ఉక్రోషం ఆమెకు చెప్పలేని సంతోషాన్ని, ఇష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ భావాలేవీ ఆమె బయట పడకుండా అనుభవిస్తోంది.

అలా ప్రయాణం మొదటి అరగంటా డల్‌గా గడిచింది.

జయసింహ విసుగ్గా చూస్తూ ''బోర్ కొడుతోందిరా బాబాయ్! మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఏదన్నా చూడు'' అన్నాడు.

మోహన్ వెంటనే ''పేకాడుదామా?'' అన్నాడు.

''ఇప్పుడు రైళ్ళలో పేకలు బామ్మలాడుకోవాలి కాని మనలాంటి కుర్రాళ్ళు కాదు.''

మోహన్ ఉడుక్కొని ''పోనీ పరుగుడు పందేలు పెట్టుకుందామా?'' అన్నాడు కోపంగా.

''నీకేం నాయనా! మొన్నే సంధ్య చేత పళ్ళన్నీ రాలగొట్టించుకున్నావు. ఎన్ని పందాలు పెట్టినా నష్టం లేదు'' భార్గవ్ చెప్పాడు.

పూరన్ పెద్దగా నవ్వింది.

మేఘన కూడా నవ్వింది.

పక్క బ్లాక్ లోంచి మాధవి తొంగి చూసి ''ఏంటి? జోక్‌లన్నీ మీవేనా? మేమూ వచ్చేదా?'' అని అడిగింది.

జయసింహ వెంటనే ''రండి సార్! మీరు లేకపోతే మాకసలు కాలమే గడవడం లేదు'' చెప్పాడు.

మాధవి ''జరుగు... జరుగు'' అంటూ వచ్చి మేఘన పక్కన చేరింది. మిగతా వాళ్ళు కూడా వచ్చేసి ఇక్కడే ఇరుక్కుని కూర్చున్నారు.

జయసింహ ''మనందరికి ఇప్పుడు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ మేఘన పాట ద్వారా లభించబోతోంది'' అని అరిచాడు.

ఆనందంగా కేకలు పెట్టారంతా.

పక్క ప్రయాణీకులు కూడా తొంగి చూశారు.

మేఘన నవ్వింది.

''కమాన్'' మేఘనను చూస్తూ అంది మాధవి.

మిత్ర బృందం కిటికీలు దించేశారు. ఆమె పాట స్పష్టంగా వినపడటానికి.

మిగతా ప్రయాణీకులు ఈ కుర్రకారును చూసేసరికి వాళ్ళకు కూడా ఉత్సాహం వచ్చింది. ఆ అమ్మాయి ఏం పాడుతుందోనని కుతూహలంగా చూడసాగారు.

మేఘన గళం సిరివెన్నెలై ప్రవహించింది.

''పొలిమేర దాటిపోతున్నాం ఓ గువ్వల చెన్నా
పొరుగూరు చేరిపోతున్నాం ఓ గువ్వల చెన్నా
కలదీరే రోజులు కోరేరా ఓ గువ్వల చెన్నా
కథమారే దారులు వెదకేరా ఓ గువ్వల చెన్నా.

లయగా చప్పట్లు మొదలయ్యాయి. పడుచు గుండెల్లోకి ఆనందం చెంగున ఎగిరి దూకినట్లుగా ఉంది.

''గుళ్ళో నిను చూడలేకున్నా ఓ గువ్వల చెన్నా
గుండెల్లో దాచుకున్నా లే ఓ గువ్వల చెన్నా
ఏ సీమలు తిరుగాడినా ఓ గువ్వల చెన్నా
నీ దీవెన అందించాలన్నా ఓ గువ్వల చెన్నా.



...నా: సదుమదనపు సింగారింపుతో కూడిన మేఘన కంఠస్వరం మంచి వెలువడే పాటకు రైలు కూడా పరవశించినట్లు లయగా ఊగుతూ ముందుకు సాగిపోతోంది.

మాధవి గర్వంగా "మా మేఘన పాటకు సాటి మరెవ్వరు లేరు! ఇంత మంచి ఎంటర్‌టైన్‌మెంట్ మీ జీవితాల్లో దొరకదు!" అంది.

"అవును... నిజంగా చాలా మంచి ఎంటర్‌టైన్‌మెంటే" అంతా ఒప్పుకున్నారు.

జయసింహ రాంబోకేసి తిరిగి "ఏం బాబాయ్ అవును కదా?" అని అడిగాడు.

రాంబో మరుగ్గా చూశాడు.

మేఘన కళ్ళు గర్వంగా నవ్వాయి.

అప్పుడు రాంబో ఎవరూ ఊహించని రీతిలో చురుగ్గా కదిలి లేచి నిలబడి పొడుగ్గా ఉన్న కంపార్ట్‌మెంట్ మొత్తంలో బారుగా సీట్ల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో నిలబడి చప్పున రెండు క్లాప్స్ ఇచ్చి గిర్రున తిరిగి వేగాన్ని పెంచుకుంటూ నాలుగు క్లాప్స్ ఒకదానివెంట ఒకటి ఇస్తూ మెల్లగా వంగి నెమ్మదిగా మూడు క్లాప్స్ కొట్టి లేచి నిలబడి తిరిగి రెండు క్లాప్స్ కొట్టాడు.

ఎవరూ ముందు ఊహించలేదు. రాంబో అద్భుతమైన కదలికకు ఒక్కసారిగా ఆనందంగా అరిచి రాంబో క్లాప్స్‌తో ఇచ్చిన లయను అనుకరిస్తూ చప్పట్లు కొట్టసాగారు.

పడిపోయేలా వంగిన శరీరాన్ని చురుగ్గా నిలబెడుతూ, ఏ ఒక్క బెర్త్ తగలకుండా, పాము కన్నా వేగంగా, రబ్బర్ కన్నా చురుగ్గా ఆ కదిలిపోయే రైల్లో డాన్స్ చెయ్యసాగాడు. అతనికి తన శరీరం మీద అంత కంట్రోల్ ఉంది.

మాధవికేసి అమోఘంగా గర్వరేఖలు మొఖంలోకి తెప్పిస్తూ చూశాడు జయసింహ.

రైలు గమ్యస్థానం కోసం ఉరుకులు పరుగులమీద దూసుకుపోతోంది.

*   *   *   *

రైలు హైదరాబాద్‌లో ఆగింది.

చివరికి అక్కడ దిగడానికి మిగిలినవాళ్ళు రాంబో. మేఘన ఇద్దరే మిగిలారు.

ఇద్దరికీ తెలియదు ఇద్దరూ అక్కడే దిగుతున్నామని.

దిగిన తరువాత మేఘన సూట్‌కేస్ కుడిచేత్తో పట్టుకుని ఎటూ చూడకుండా నడవసాగింది.

రాంబో ఆమె వెనకే బయటకు వచ్చాడు.

మేఘన బయట నిలబడి చూడసాగింది.

రాంబో పక్కకు వచ్చి "లిఫ్ట్ కావాలా?" అని అడిగాడు.

"నో థాంక్స్."

"పర్వాలేదు. మీరెక్కడికి వెళ్ళాలి?" రాంబో అడిగాడు.

"అక్కర్లేదని చెప్పానా? నా కోసం కారు వస్తుంది" నిష్కర్షగా చెప్పింది.

సరిగ్గా అదే సమయానికి డ్రైవర్ రావడం, ఆమెను ఏదో అడగడం, ఆమె తల ఊపి వెళ్ళి కారెక్కడం అన్నీ రెండు నిమిషాల్లో జరిగిపోయింది.

రాంబోకి మేఘన సమాధానం కోపం తెప్పించాయి. "ఆడ పిల్లకి అందంతోపాటు అహం కూడా కలిస్తే ఇట్టే నమిలేస్తారు" అనుకొన్నాడు.

మేఘన ఎక్కిన కారు సరిగ్గా రాంబో ముందునుంచే వెళ్ళింది.

మహారాణిలా ఠీవిగా రాంబోకేసి ఓ చూపు మాత్రం విసిరింది వెళ్ళిపోతూ. ఆమెకు ఆ క్షణంలో రాంబో మొఖం చూస్తే జాలివేసినా మహా నవ్వుతో పాటూ ఆనందం కూడా కలిగింది.

*   *   *   *

రాంబో కారు పోర్టికోలో ఆగటం ఆలస్యం డోర్ తెరుచుకుని ఎదురొచ్చే బావగారిని పైకెత్తి "ఎన్నాళ్ళ కెన్నాళ్ళ కెన్నాళ్ళకు, ఎన్నేళ్ళ తిరిగొచ్చే మా కళ్ళకు!" ఆ పాట పాడి దింపి "బావూ వచ్చేశాం" అన్నాడు త్రివేదితో.

ఎదురుగా వచ్చే లక్ష్మిని చూసి బావగారిని వదిలి ఆమెను ఎత్తేసి "ఈ గాలి... ఈ నేల... నమగన్న నావాళ్ళూ..." ఇంకో రాగం లంకించుకున్నాడు.

"మన రాంబాబు ఈ రెండేళ్ళలో బాగా చిక్కిపోయాడు కదు లక్ష్మీ?" త్రివేది అడిగాడు.

"మరి హోటల్ తిళ్ళు, హాస్టల్ తిళ్ళు ఎలా ఉంటాయి?" లక్ష్మి కోపంగా రాంబాబు కేసి చూసి "ఏరా... రెండేళ్ళలో ఒక్కసారన్నా ఇంటికి వచ్చి వెళ్ళొచ్చుగా! పెద్ద దూరం కూడా కాదు!"

"రెండేళ్ళ తర్వాత ఇప్పుడు మనం చూసుకునే థ్రిల్లింగ్ అలా వస్తే ఉండేది కాదు కదా?" అని చెప్పి రాంబో త్రివేది కేసి తిరిగి "బావూ మన థ్రిల్లింగ్స్ ఎలా ఉన్నాయి?" అని అడిగాడు.

"ఈ మధ్య కాస్త తగ్గాయిరా రాంబాబు?" లక్ష్మి చెప్పింది.

"నిజంగా! ఎలా?"

"మంచి సముఉజ్జీ దొరికిందా? అక్కడ మన బాస్‌గారు డౌనైపోయారు."

"ఎవరా మనిషి? ఏమిటి కథ?"

*   *   *   *

మొదటి రెండు అడుగులు తిన్నగా పడ్డాయి. ఆ తరువాత ఉత్సాహంతో ఒక అడుగు వేగంగా పడింది. వెనువెంటనే వచ్చిన వుత్సాహంతో రెండు కాళ్ళూ నేలమీద చప్పుడు చేస్తూ మెట్లమీదకు ఎగిరాయి.

రెండు జడలూ ముందుకు వచ్చి రెండు చేతుల్లో నిలిచాయి.

వైట్ కలర్ ఊలీ ఫ్రాక్.

గుమ్మంలో నిలబడి ఎంతో కాలం నుంచి పరిచయం వున్నదానిలా నవ్వి "హౌ ఆర్ యూ రాంబో?" అని అడిగింది చిత్ర.

రాంబో పరీక్షగా ఆ అమ్మాయికేసి చూసి షేక్‌హాండ్ కోసం చేయి చాపి "హై స్వీటీ! హౌ ఆర్ యూ?" అని అడిగాడు.

చిత్ర చురుగ్గా షేక్‌హాండ్ చేసి "చిత్ర ది గ్రేట్!" చెప్పింది.

"స్వీట్ నేమ్!" చెప్పాడు రాంబో.

"థాంక్యూ" అని మెల్లగా ముందుకు వచ్చి రాంబో బుగ్గమీదుగా మీ... ...ంచి "ఇది మీసమా! దండకారణ్యమా!" అని అడిగింది.


"హో! మొదలెట్టావా తల్లీ! మావాడొచ్చి పది నిమిషా... ...లేదు" త్రివేది కోపంగా చెప్పాడు.

"భలే అన్నయ్యగారే మీరు. నేనేమన్నా కొరుక్కు తింటున్నానా? పలుకరిస్తున్నాను. అంతేగా?"

"నువ్వు పలుకరిస్తూనే ఫలహారం చేస్తావు?"

చిత్ర నవ్వి "నాట్" అనేసి, రాంబో కేసి తిరిగి "రాంబో నువ్వు డాన్స్ బాగా చేస్తావట కదా? నాకూ డాన్సంటే చాలా ఇష్టం" అని చెప్పింది.

"ఏక్కాడుగా చెప్పేది? రాంబాబు వచ్చిందిప్పుడే డాన్స్‌లు, దన్నులు ఏం లేవు. నువ్వు కామ్‌గా వుంటే వుండు లేదా వెళ్ళిపో?" త్రివేది మండిపడ్డాడు.




“ఒకే చిత్రా— నేను స్నానం చెయ్యాలి. టిఫిన్ తినాలి— కాస్సేపు కూర్చుంటావా?” అడిగాడు రాంబో. ఆతడికి అర్థమైపోయింది పరిస్థితి.

“ఒకే! రాంబో మళ్ళీ వస్తాన్లే” అని త్రివేదికేసి అలవోకగా ఓ చూపు చురకత్తిలా విసిరి వెళ్ళిపోయింది.

“నాన్నగారెక్కడ?” రాంబో త్రివేదిని అడిగాడు.

“ఆయన ఫ్రెండ్ విశ్వనాథంగారితో కలిసి బిజినెస్ పనిమీద మద్రాస్ వెళ్ళారు. సాయంత్రానికి రావాలి!” చెప్పాడు త్రివేది.

“రాంబాబూ త్వరగా స్నానం చేసి రా. టిఫిన్ చేస్తున్నాను” అక్క్ ...

చెప్పింది.

రాంబో సూట్ కేస్‌తో తన రూమ్‌లోకి నడిచాడు.

రెండేళ్ళ క్రితం డిగ్రీ అయిపోయాక వెళ్ళిపోయాడు. తిరిగి మళ్ళీ ఇప్పుడు వస్తున్నాడు. తన గదిలో ప్రతి వస్తువూ తను ఎలా వదిలివెళ్ళాడో అలాగే వున్నాయి.

అతడికి తన రూమ్ పాత మిత్రుడిలా, ఆప్యాయంగా పలుకరిస్తోన్నట్లు అనిపిస్తోంది.

షొక్కా విప్పి హేంగర్‌కి తగిలించి వెళ్ళి కిటికీ పరదాలు లాగాడు. ఎన్నాళ్ళ నుంచో వేచి వున్నదాన్లా వెలుతురు ఒక్కసారిగా లోపలికి వురికింది.

వెనక్కి తిరిగి స్టీరియో డెక్‌లో తనకెంతో ఇష్టమైన పంజాబీ బాంగ్రా డాన్స్ మ్యూజిక్ కాసెట్ పెట్టాడు.

షూస్ తీసి శ్రద్ధగా మూలపెట్టాడు. సాక్స్ పీకి కుర్చీలో పడేశాడు. వాడ్‌రోబ్ తెరిచి టవల్ తీసి మెడచుట్టూ వేసుకున్నాడు.

మ్యూజిక్ అనుగుణంగా కాళ్ళు ఆడుతూనే వున్నాయి. పాంట్ జిప్ లాగి మంచంమీద పడేశాడు. అండర్‌వేర్ మాత్రం మిగిలింది.

బాత్ రూం తలుపు దగ్గరకు వెళ్ళి తలుపు తీయబోయాడు.

కానీ ఆ తలుపు దానంతట అదే తెరుచుకుంది.

లోపల్నుంచి మేఘన బయటకు వచ్చింది.

పింక్ కలర్ బ్రా, అదే రంగు పెట్టీ కోట్, రెండిటికీ నడుమ పడుచుతనపు ఆరోగ్యం విరగబూసి చూపులకే మెత్తగా కనిపిస్తోంది. తెలుపుదనపు వెలుగులకు నగ్నంగా వున్న కోమలమైన చేతులు మెరుస్తున్నాయి. వెంట్రుకలు తడిసి బుగ్గకు అతుక్కుపోయాయి. నీటిచుక్కలు క్షణం సేపు విశ్చేష్టతతో నిలబడి చూసి అమితమైన సిగ్గు కమ్ముకొచ్చిన వాటిలా జర్రున జారిపోయాయి.

అనేక వేల రాగాలు ఒకే చోట వినిపించసాగాయి. ఇంత వరకెన్నడెరుగని ఆ సంగీతం మెల్లగా లోనికి ప్రవేశించి క్రమక్రమంగా హృదయమంతా నిండిపోయింది.

ఆమె చప్పున బాత్ రూంలోకి వెళ్ళిపోయి తలుపు వేసేసి, దానికే ఆనుకుని నిలబడి పోయింది. గుండె కొట్టుకుంటుందో లేదో కూడా తెలియని పరిస్థితి అంతులేని ఆశ్చర్యం.

రాంబో టవల్ పిసి సరిగ్గా కట్టుకుంటూ అలా నిలబడిపోయాడు. ...


**The choice in Black & White. And in Colour too.**



UPTRON

అప్‌ట్రాన్ విజేత తన నిజరూపాన్ని
మీ ముందు ఉంచుతుంది

తక్కువ ధర, ఉత్తమ పని- సామర్ధ్యంగల అందమైన టి.వి.లు
ప్రతి ఒక్కరి అభిరుచులకు అనువుగా విస్తృతమైన రకాలలో
కలర్-బ్లాక్ & వైట్ మరియు పోర్టబుల్ టి.వి.లు



* భారతదేశంలో మొట్టమొదటి టి. వి. తయారుదారు అప్‌ట్రాన్. * అప్‌ట్రాన్ బెస్ట్ కలర్ టి. వి. గా 1985 “ఎలిసినీ” అవార్డ్ పొందిన టి. వి. * అప్‌ట్రాన్ టి. వి. లు కంప్యూటర్ టెస్టింగ్‌తో అసెంబ్లీ చేయబడుచున్నవి.
* “టెలిటెక్స్ట్” సిస్టమ్ - (క్షణాలలో టి. వి. మీద సమాచారం తెలుసుకొనేందుకు రూపొందించిన పద్ధతి) అప్‌ట్రాన్ కలర్ T. V. లకు అనువైనది.
* భారతదేశంలో అత్యధికస్థాయిలో అమ్ముడుపోయి రికార్డు సృష్టించిన టి. వి. లు అప్‌ట్రాన్ మాత్రమే.
* అప్‌ట్రాన్ కలర్ మోడల్ U V 603 లో పసుపు రంగు పసుపుగానే కనబడును. అవి మిగతా టి. వి. లలో బిస్కట్ కలర్‌గా కనబడును.
* వోల్టేజ్ హెచ్చుతగ్గులను అదుపుచేసేందుకు 120 V నుండి 260 V స్టెబలైజర్ చేయబడినవి (అవి 20" బ్లాక్ & వైట్ కలర్ T. V. లకు)
* విద్యుచ్ఛక్తి వినియోగం బ్లాక్ & వైట్ - 30 W, కలర్ - 52 W మాత్రమే. (ఇవి మిగతా టి. వి. ల కంటే కరంటు చాలా పొదుపుచేస్తుంది.)

అప్‌ట్రాన్ భారతదేశపు అగ్రశేణి జాతీయ టి. వి. కంపెనీగా ప్రపంచంలోని అత్యున్నత సాంకేతిక ప్రక్రియలలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ సంస్థ నుండి విశిష్ట ఉత్పాదన:

ట్రస్లెట్, ఎలక్ట్రానిక్, ట్యూనర్, మరియు కోర్ మోడల్ రిమోట్ కంట్రోల్, బ్లాక్ & వైట్: పోర్టబుల్ 12", 14", 20" డబుల్ స్పీకర్ షట్టర్సు ఎలక్ట్రానిక్ ట్యూనర్స్‌తో (కలర్, 14" & 26" రిలీజుకు సిద్ధంగా వున్నవి.) అనేక మోడల్సులో మీకు యిష్టమైన వాటిని ఎన్నుకోవచ్చును.

డిస్ట్రిబ్యూటర్సు సేల్సు & సర్వీసింగ్- ఉభయగోదావరి జిల్లాలకు

రత్నం ఎంటర్‌ప్రైజెస్ -రాజమండ్రి మెయిన్‌రోడ్ (రాజమండ్రి రైల్వేస్టేషన్ వద్ద)
ఫోన్: 3161

ఒక్కసారి శూన్యమై ఏ ఒక్క ఆలోచనకూ తావులేకుండా పోయింది.

అతడు మెల్లగా గదిలోంచి బయటపడి లక్ష్మిని పిలిచాడు.

లక్ష్మి వచ్చింది.

"నా గదిలో ఎవరో అమ్మాయి వున్న సంగతి నాకెందుకు చెప్పలేదు?" అడిగాడు.

"అరె! హో! నేను మర్చేపోయాను. నువ్వొచ్చావన్న ఆనందంలో ఆ అమ్మాయినే మర్చిపోయాను. నాన్నగారి ఫ్రెండ్ విశ్వనాథంగారని ఆయన కూతురు. కొన్ని రోజులు ఇక్కడే వుంటారు. ఈ కొన్ని రోజులు నువ్వా పక్క రూమ్‌లో ఎడ్జెస్ట్ అవు" అని చెప్పేసి వెళ్ళిపోయింది.

జరిగిపోయిన అనర్థం తెలుసుకోకుండా రెండు ముక్కల్లో అత్యంత ఆశ్చర్యకరమైన విషయాన్ని చెప్పేసి వెళ్ళిపోతోన్న అక్కను చూస్తూ నిలబడిపోయాడు.

త్రివేది మెల్లగా వచ్చి రాంబో ప్రక్కన నిలబడి "ఏం బాసూ!ఆ అమ్మాయికి నీ అడవి దొంగ వేషం చూపించావా ఏంటి! ముఖం అలా వుంది?" అడిగాడు.

"నువ్వైనా చెప్పొచ్చుగా బాసూ — ఆ అమ్మాయి వుందని?" రాంబో త్రివేది కేసి కోపంగా చూసి అన్నాడు.

"గుర్తు రాలేదు. అసలింతకీ నే నన్నది జరిగిందన్నమాట. ఆదిలోనే ఆ అమ్మాయికి అడవి దొంగ వేషం చూపించావన్న మాట. ఎంత థ్రిల్లింగైన కలయిక" త్రివేది నవ్వాడు.

** ** **

సారీ చెప్పడంకన్నా అత్యున్నతమైనదీ, మర్యాదపూరితమైన పదమేదైనా వుందేమోనని రాంబో ఆలోచించసాగాడు. కానీ అలాంటిదేదీ దొరికినావడం లేదు.

ఎదురుగా మేఘన టిఫిన్ చేస్తోంది.

రాంబోకి తలుచుకుంటే వింతగానూ,ఆశ్చర్యంగానూవుంది. ఈ అమ్మాయికి, తనకీ క్షణం పడదు. కానీ అనుక్షణం కళ్ళలోనే వున్నట్టు ఎదురవుతోంది. ఇప్పటిదాకా ఒకే క్లాస్. ఇంతకుముందు వచ్చిందీ ఒకే రైలు. ఇప్పుడున్నదీ ఒకే ఇల్లు — ఎంత చిత్రంగా వుంది.

మేఘనకేసి చూశాడు ఆమె చూస్తుందేమోనని.

కానీ మేఘన తలెత్తి చూడలేదు. కానీ అతన్ని పూర్తిగా చదివేసింది. మొన్నటిదాకా ఒకలా కనిపించినఅతను ఆమెకిప్పుడు ఈ ఇంట్లోకొత్తగానూ, వింతగానూకనిపిస్తున్నాడు. ఆమె మనసులో కొత్త కొత్త భావాలేవో వచ్చి చేరసాగాయి. కానీ ఆమె బయటపడే ప్రయత్నం చేయడం లేదు. ఇలా ఏమీ ఎరుగనట్లుండి అతన్ని ఉడికించడమే ఆమెకు ఆనందంగా వుంది.

త్రివేది లోపలెక్కడో వున్నాడు.

"ఇతను మా తమ్ముడు రాంబాబు" అంటూ లక్ష్మి మేఘనకు పరిచయం చేసింది.

మేఘన తల పైకెత్తి రాంబోకేసి మొట్టమొదటిసారిగా పరిచయం చేసుకుంటోన్నట్లు పలుకరింపుగా నవ్వి "గ్లాడ్ టు మీట్ యు" అంది.

ఆమె పద్ధతి అర్థం కాక రాంబో చిత్రంగా చూస్తూనే నవ్వి "గ్లాడ్ టు సీ యు" అన్నాడు.

"మీ రెక్కడ చదివారు?" మేఘన అడిగింది.

లక్ష్మి వంటింట్లోకి వెళ్ళింది.

"ఏంటి! నే నెక్కడ చదివానా?" రాంబో ఆశ్చర్యంగా అడిగాడు. అసలామె అంత ఆప్యాయంగా మాట్లాడడం చూస్తే రాంబాబు మతి పూర్తిగా పోయింది.

అప్పటిదాకా ఆప్యాయంగా వున్న ఆ మేఘన మొఖం ఒక్కసారిగా మారి గంటు పెట్టుకున్నట్టుగా అయి సీరియస్‌గా రాంబోకేసి చూసింది.

రాంబో నోట్లోని మాట నోట్లోనే వుండిపోయింది.

ఆమె మనసులోనే ఆనందంగా నవ్వుకుంది. రాంబో అమాయకమైన మొఖం చూసి ఇంకా ఏడిపించ బుద్ధి వేసింది.

లక్ష్మి వచ్చి ఇంకో దోసె మేఘన ప్లేట్లో వేసి "మొహమాటం అలాంటివేవీ పెట్టుకోకు. మనమంతా ఇక పాతవాళ్ళమై పోయినట్లే" చెప్పింది.

"నా డిక్షనరీలో కూడా మొహమాటమనేది లేదు" చిత్ర సరాసరి లోపలికి వచ్చి టేబుల్ దగ్గరి కుర్చీ లాక్కుని కూర్చుంది.

ఆమె వెనకే త్రివేది నోరు తెలుచుకుని చూసుకుంటూ వచ్చాడు.

పసుపుపచ్చ రంగు సిల్క్ శారీ, అదే రంగు బ్లౌజ్, పొడుగాటి జడ, కూర్చోవడంలో కుచ్చిళ్ళు చెదిరిపోకుండా పట్టుకుని సాంప్రదాయం లోంచి ఊడిపడ్డట్టుగా వచ్చి కూర్చున్న చిత్రకేసి అలాగే చూడసాగాడు.

రాంబోకి కూడా చిత్రను చూస్తే వింతగా అనిపించి "ఇదే మొదటిసారా చీర కట్టుకోవడం?" అని అడిగాడు.

"అవును"

"చిన్నప్పుడు మా ఊళ్ళో కోతినాడించేవాడు ఒకడుండేవాడు. అప్పు వాడి కోతి కూడా చీర కడతే నీలాగే వుండేది" త్రివేది ఉడికింపుకు నాందిగా అన్నాడు.

చిత్ర ఏ మాత్రం చలించకుండా "మీరేమన్నా నాకు కోపం రాదు అన్నయ్యగారూ! నే నెలా వున్నా మీరు మాత్రం అప్పు ఆ కోతిని ఆడించేవాడిలా వున్నారు" అని చెప్పింది తాపీగా.

త్రివేది ఇక మాట్లాడలేదు.

చిత్ర మేఘనకేసి తిరిగి "మనం పరిచయం చేసుకోనవసరం లేదు. కొంతమందిని చిరునవ్వుతోనూ, ప్రశాంతమైన చూపుతోనూ పరిచయం చేసుకోవచ్చు అని నిన్ను చూసి తెలుసుకున్నాను" చెప్పింది.

"ఏం చదువుతున్నావు?" మేఘన అడిగింది.

"ఇంటర్ ఐపోయింది. ప్రస్తుతం హాలిడేస్!" అని ఆగి, "ఇక్కడ మీరంతా ఎన్ని రోజులు వుంటారు?" అడిగింది చిత్ర.

"నాకే తెలీదు."

"మీరు గోల్కొండ , చార్మినార్ ఏమన్నా చూశారా?"

"లేదు— హైదరాబాద్ రావడం నాకిదే మొదటిసారి"

"ఐతే కనీసం పది రోజులైనా వుండాలి"

"తప్పకుండా! నీ కంపెనీ వుంది కదా? చక్కటి కాలక్షేపం."

"నేనూ ఇందులో ఏదీ చూడకపోయినా చక్కగా తిప్పగలను. మనం తప్పకుండా వెళదాం!"




"టూరిజంవాళ్ళ బస్సులున్నాయా?"

లక్ష్మి వస్తూ "ఎందుకు, కారుంది కదా? రాంబాబు మిమ్మల్ని తీసుకెళతాడు" చెప్పింది.

"ఎందుకు మేము వెళ్ళగలం. కదు చిత్రా? మనం ఇద్దరమే ఇవన్నీ చూడలేమూ?" రాంబోకి ఒళ్ళు మండిపోతోంది.

"చాల్లే ఊర్కో! మీరు చూడగలరేమో కానీ నేను పంపను. రాంబాబునో, త్రివేదిగారినో తీసుకెళ్ళండి" లక్ష్మి చెప్పింది.

"త్రివేదిగారినా?" చిత్ర చిత్రంగా నవ్వింది.

"నాకేమైంది పిల్లకుంకా?" త్రివేది కోపంగా చూశాడామెకేసి.

"మీకు తెలిసినది, మమ్మల్ని తీసుకెళ్ళే ప్లేస్ ఒక్కటే?"

"ఏంటది?"

"జూ పార్క్!"

త్రివేది బలవంతాన నవ్వు తెచ్చుకుని "చిత్రా నిన్నెప్పుడో చితక్కొడతాను చూస్కో ఇక చింతకాయపచ్చడే" చెప్పాడు.

చిత్ర కిలకిలా నవ్వింది.

లక్ష్మి "ఇక చాలు ఆపండి. రాంబాబు నువ్వు వీళ్ళని తీసుకెళ్ళు!" చెప్పింది.

"దేనికి — మేమిద్దరం వెళ్ళగలం" మేఘన అంది.

"ఆ ఆ, మీరు వెళ్ళగలిగితే వెళ్ళండి. మీ వెంట తప్పకుండాఎవరో ఒకర్నిపంపుతాను" చెప్పింది లక్ష్మి.

రాంబోకి మేఘన తలపొగరు, నిర్లక్ష్యమైన ధోరణి చూస్తే ఒళ్ళు మండిపోతోంది. ఆమె తప్పకుండా ఊరు చూడడానికి తన సహాయం అడుగుతుందని అనుకున్నాడు. ఆమె



అడగకపోగా ఇప్పుడు బలవంతాన తనే బయలుదేరవలసి వచ్చేట్లుంది.

** ** **

వేటగాడి ఆనవాలు తెలిసిన లేడిలా ముందుకు దూసుకుపోసాగింది రాంబో కారు.

దాని గమ్యస్థానం గోల్కొండ. డ్రైవ్ చేస్తున్నది రాంబో. ముఖంలో ఎటువంటి భావాలూ లేవు. అంతరంగంలో ఉక్రోషం సెగలు, పొగలై రగిలి మండసాగింది. కారణం, అనుకున్నట్టుగానే కేవలం లక్ష్మి మాటను కాదనలేక రావడమే.

వెనుక సీట్లో వున్న మేఘన, చిత్ర మాటలను బట్టి ప్రస్తుతం లోకాన్ని వదిలేశారని తెలుస్తోంది.

ఎల్ క్లాసిక్ వాద్‌లోని మొదటి అంకె తొమ్మిది రావడం ఆలస్యం ప్రక్కనున్న నాలుగంకెలూ సున్నాలైపోయాయి.

కారు బుల్లెట్‌లా పోతోంది.

ఎడమ చెయ్యి స్టీరింగ్ మీద నుంచి లేచి కాసెట్ నొకదాన్ని టేప్‌లోకి తోసి ప్రక్కనున్న బాస్కెట్‌లోని బిస్కెట్ పాకెట్‌తో చిన్న యుద్ధం చేసి, దాన్ని పడగొట్టి ఒక బిస్కెట్‌ను సంపాదించింది.

మెల మెల్లగా బుడగల శబ్దంతో మొదలైన సంగీతం క్రమేపీ పెరిగి రాంబో మనసును. రిలాక్స్ చేయసాగింది.

చిత్ర మాటలతోపాటు, వెనుక మొదలైన సంగీతం ధ్వనితో మేఘన వాస్తవంలోకి వచ్చింది. తల తిప్పి కళ్ళన్నీ చిత్రమీదే వుంచి వింటోన్న ఆమె రాంబో మొఖంలోకనబడని అంతరంగపు ఆలోచనలను చదవసాగింది.

చిత్ర ఏదో చెబుతూనే వుంది.

మేఘన ఒక్కసారిగా తల తిప్పి చూసింది.

అతని కళ్ళు చిన్నగా రోడ్డుమీదున్నాయి. ఏ మూడు నిమిషాలకో ఒకసారి మూతపడే అతని కనురెప్పలకేసి చూస్తోంది.

పెదవుల మధ్య నున్న బిస్కెట్ చేతి ప్రమేయం లేకుండా నోట్లోకి వెళ్ళిపోయింది. పెదవులపైని మరకను తుడిచివేయడానికి నాలుక ఆకర్షణీయంగా బయటకు వచ్చి పని చేయసాగింది. మీసాల కొసలను పలుకరిస్తోన్న నాలుక హఠాత్తుగా ఆగింది.

మిర్రర్‌లోంచి చూపులు తాకుతున్నాయి.

వికసించబోయిన గులాబి మొగ్గలు ఒక్కసారిగా ముడుచుకుపోయిన అనుభూతి.

మేఘన చూపులతో అతని చూపులు కలబడ్డాయి. మేఘన చూపు తిప్పకుండా కావాలనే సూటిగా చూడసాగింది.

మధ్యవర్తి అయిన మిర్రర్ మాత్రం సిగ్గుతో కాస్త వణికింది. అప్పుడే కారు గోతులను దాటడంతో అదలా వణకవలసి వచ్చింది.

రాంబోకి తెలుసు — ఆ చూపుల్లో నుంచి ఏ క్షణాన్నైనా నిప్పులు రాలవచ్చునని. కానీ అతడి అంచనా తప్పింది. ఆ చూపుల్లో నిప్పులు రాలకుండానే మరలిపోయాయి.

కారు గోల్కొండ పొలిమేరల్లో కొచ్చేసింది.

చిత్ర దూరంగా కనబడే కోటను అత్యంత ఆసక్తికరంగా చూస్తోంది.




రాంబో కోట దగ్గరకు వెళ్ళాక కారు ప్రక్కన పార్క్ చేశాడు. అతని హృదయంలో మేఘన చూపులతో వింత ఉత్సాహం వచ్చింది.

అతడు ముందు వాళ్ళను కుతుబ్ షాహీ వంశ సమాధుల దగ్గరకు తీసుకువెళ్ళాడు.

తిన్నగా ఓ పెద్ద సమాధి దగ్గరకు తీసుకుపోయి "ఇదెవరిదో తెలుసా?" అడిగాడు.

"తెలీదు" చిత్ర మాత్రమే చెప్పింది.

"ఇది అబ్దుల్ హసన్ సమాధి! దీన్ని ఎలా కట్టవలసి వచ్చిందో తెలుసా?" అడిగాడు.

"ఊహు"

"తారామతి అనే ప్రేయసి వుండేదట ఈయనకి. ఆయన ఆ అమ్మాయిని ప్రేమించాడట. ఆ అమ్మాయికి అతనిలో ప్రేమ్‌వెల్ ఎక్కడా కనబడలేదని అందట. అయితే ఏ విధంగా ఋజువు చెయ్యాలి? అని అడిగాడట. అప్పుడా సుందరి ఓ పని చేయమని చెప్పిందట."

"ఏమని?" చిత్ర అడిగింది మేఘన కూడా ఇంట్రెస్టింగ్‌గా చూసింది.

"ఇదుగో ఇక్కడ ఇలా శాశ్వతంగా నిద్రపొమ్మని!" చెప్పాడు రాంబో.

చిత్ర కళ్ళు పెద్దవయ్యాయి. "మై గాడ్! నిజంగా?" అంది.

"నిజం!"

"పాపం" చిత్ర ఆ సమాధిని ఎనలేని జాలితో చూడసాగింది.

ఆ తరువాత అతడు కోట చూపించాడు. మధ్యలో ఆపి అతడు చాలా థ్రిల్లింగైన విషయాలు చెప్పసాగాడు.

కోట చూసి వస్తుంటే ఎడంవైపు కోటలో పెద్ద పొదలతో కప్పబడిపోయిన కొంత భాగాన్ని చూపించి "అక్కడే కోహినూర్ వజ్రం దొరికిందిట?" అని చెప్పాడు.

"అక్కడే?" చిత్ర అడిగింది.

"అవును. ఇంకా కొన్ని వజ్రాలక్కడే వుండిపోయాయి కూడా?"

"ఎవరూ తియ్యలా?"

"ఊహు!భయంకరమైన పాములుంటాయక్కడ. ఎవరూ వెళ్ళలేరు."

చిత్ర ఊపిరి పీల్చడం ఆపి చూడసాగింది.

రాంబో మేఘన కేసి చూశాడు.

ఆమె బయటపడకపోయినా అలాగే చూస్తోంది.

రాంబో తల తిప్పుకుని కడుపారా నవ్వుకున్నాడు. ఇప్పటిదాకా అతడు వాళ్ళకు చెప్పినవేవీ నిజాలు కావు. అతడికి తోచినవి, అనిపించినవి కల్పించి, సస్పెన్స్ ఇరికించి ఇంజెక్ట్ చేయడంతో గంజాయి దమ్ము లాగినట్టుగా వుంది వాళ్ళకు.

హఠాత్తుగా తల తిప్పిన మేఘన కళ్ళలో పడింది రాంబో నవ్వు. ఆమెకప్పుడు వచ్చింది అనుమానం.

చిత్ర తిరిగే సరికింకా రాంబో నవ్వు ఐపోలేదు. చిత్ర కూడా అనుమానంగా రాంబో కేసి చూస్తూ "ఎందుకు నవ్వుతున్నావు? అసలింతవరకు నువ్వు చెప్పినవేవీ నిజాలు కావనా?" అడిగింది.

రాంబోకి ఇక నవ్వు దాచుకోవడం కష్టమైంది.

అప్పుడు చెప్పింది చిత్ర "నవ్వకు రాంబో! నువ్విలాంటి దేదో చేస్తావని మేఘన ముందే చెప్పింది. అందుకే ఈ పుస్తకం తెచ్చాం. ఇందులో గోల్కొండ చరిత్రంతా పూర్తిగా వుంది."

రాంబో నవ్వుకు బ్రేక్ పడింది. అతడు తేరుకుని చూసేసరికి వాళ్ళుముందుకు వెళ్ళిపోయారు.

** ** **

తిరిగి కారు ఇంటి మార్గం పట్టింది. బాస్కెట్‌లోని బిస్కెట్స్ ఖాళీ చేస్తూ తిరిగి కబుర్లలో పడ్డారు చిత్ర, మేఘనలు. వాళ్ళు ఈ రోజు ఇంకేమీ చూడడానికి ఇష్టపడలేదు. రాంబో మాట్లాడకుండా కారు ఇంటివైపు తిప్పాడు.

కొంత దూరం పోయాక ఓ జీప్ సరిగ్గా వీళ్ళ కారును రాసుకున్నట్టు ముందుకుపోయి ఆగి, వీళ్ళ కారుకు అడ్డుగా వెళ్ళసాగింది.

ఆ కారులో వున్న అమ్మాయిలు, అబ్బాయిలు కూల్ డ్రింక్ మోడల్స్‌లా తెగ గోలచేయడం బట్టి చూస్తే పిక్‌నిక్‌కి వచ్చినట్టు తెలుస్తోంది.

అమ్మాయిలు కారును ఓవర్ టేక్ చేశాక అమితమైన శబ్దంతో ఈలలు వేసి డ్రైవ్ చేస్తోన్న రాంబోకి వెక్కిరిస్తోన్నట్టుగా చేతి బొటన వేళ్ళు అటూ ఇటూ ఊపసాగారు.

"ఓయ్! ఎవరీ మాడ్ మాక్స్!" చిత్ర కోపంగా అరిచి కిటికీలోంచి తలపెట్టి చూసింది.

వాళ్ళ ఈలలు మరింత ఎక్కువయ్యాయి.

"మేఘన మెల్లగా "వాళ్ళు తప్పుకునేట్టు లేరు" అంది.

"చిత్ర వెంటనే "యూ! బ్లడీ ఇడియెట్స్! తప్పుకోండి!" అంటూ కిటికీలోంచి అరవసాగింది.

మేఘన చిత్రను లోపలికి లాగి "చాల్లే! నువ్వు తిడితే తప్పుకుంటారా? చాలా మంచి ఉత్సాహంలో వున్నారు" చెప్పింది.

"అంటే మనమే ఓవర్ టేక్ చేసి పోవాలా?" చిత్ర అడిగింది.

రాంబో "అలాగే వుంది చూస్తుంటే" అంటూ హారన్ కొట్టాడు. వాళ్ళు అంగుళం కూడా చోటివ్వలేదు సరికదా వాళ్ళ కేకలు, వెక్కిరింతలు విపరీతమైపోయాయి.

కోతి మన పూర్వీకుడని వాళ్ళ లక్షణాలను బట్టి ఇట్టే చెప్పొచ్చు.

వాళ్ళు ఈ కారు ముందుకు పోనిచ్చే అవకాశం ఇవ్వడం మానేసి పైగా వెక్కిరింతలు కూడా ఎక్కువ చేయడం చూసి రాంబోకి ఒళ్ళు మండిపోయింది.

అతనికి ఆ రోజు మేఘనతో కారు పందెం గుర్తుకొచ్చింది. ఆ రోజు పడిన సొట్టలు ఇంకా తియ్యనే లేదు. కారు ఎడంవైపు హెడ్ లైట్ తగిలిన దాన్ని బాగుచేయలేదని తెలిసింది.

## అఖండ దీపాలు

ఒకదీప మొకనాడు ఉగ్రరూపము దాల్చి
సీ: "నరకాసురుని" జంపి! నవ్వుచుండె!
ఒక దీప మొకనాడు ఉల్లాస మూర్తియై
"దశ కంఠు" హతమార్చి! దనరు చుండె!
ఒక దీప మొకనాడు ఉజ్వల రూపమై
"బలి" గర్వమణగించి! వాసి గాంచె!
ఒక దీప మొకనాడు ఒంటరి పడతియై
"మహిషాసురుని" గూల్చి! మౌళిదాల్చె!

గీ. ఒకటి పాపాలు మాపుచు! ఒనరు చుండె!
ఒకటి సౌహార్ద్రమును బెంచి! యొప్పుచుండె!
అట్టి దీపాలఖండమై! అలరుచుండ!
వనజ పుష్పాల గొల్వుడీ! వనితలార!

— శేషం సుప్రసన్నాచార్యులు

పనిలో పని మెకానిక్‌కి కాస్త ఎక్కువ పనౌతుంది. రాంబో ఒక్కసారిగా వేగాన్ని పెంచుతూ "కాస్త సరిగ్గా కూర్చోండి. కారు అటూ ఇటూ ఊగవచ్చు" అని చెప్పాడు.

అతని మాటలకు చిత్రలో ఉత్సాహం ఉప్పెనలా ఉరికింది. "యా! కమాన్ రాంబో! పోనీయ్! పోనీయ్!" ఉత్సాహంగా ఎంకరేజ్ చెయ్యసాగింది.

కారు బుల్లెట్‌కన్నా వేగంగా ముందుకురికింది.

మేఘన ఊహించలేదు. చిత్ర తలంచనే లేదు. రాంబో కారు వేగంగా వెళ్ళి ఆ జీప్ కుడిపక్క ఒక్క గుద్దులాటి ఒక్క పోటు పొడిచాడు.

ఆ దెబ్బకి జీప్ పక్కకి తిరిగి, ప్రక్కనున్న రాళ్ళ గుట్టల్లోకి జారుకుంటూ పోయి రాళ్ళకు గుద్దుకుని ఆగిపోయింది.

"మై గాడ్ రాంబో! మన కారుకేమైనా అయిందేమో?" చిత్ర అరిచింది.


"అయినా పర్వాలేదు. వెధవలకి బాగా బుద్ధి చెప్పాం?" అంటూ కారాపి, డోర్ తెరిచి దిగాడు.

చిత్ర, మేఘనలు కూడా దిగారు.

చిత్రకైతే పట్టరాని ఆనందం వేసింది. జీపులోంచి అష్టకష్టాలు పడుతూ బయటకు వస్తోన్న జీవాలను చూసి పెద్ద పెట్టున నవ్వి చప్పట్లు కొట్టసాగింది.

మేఘన రాంబోకేసి చూసి ఉలిక్కిపడింది. అతని ఛాతీ కుడివైపు చొక్కాకి రక్తం అంటుకుంది.

"దెబ్బ... " అంటూ ఆగి అతడి మొఖంలోకి చూసి "...దెబ్బ తగిలింది" అంది.



చిత్ర నవ్వు ఆపి, తిరిగి చూసింది.

మేఘన చప్పున ఖర్చీఫ్‌తో అతని ఛాతీపైన నొక్కిపట్టింది. షాక్కా కొద్దిగా చిరిగింది. హాండిల్ దగ్గరి వస్తువేదో చిరిగి గీసుకుని వుండవచ్చు.

ఆమె ఖర్చీఫ్ కూడా రెండు నిమిషాల్లో రక్తసిక్తమైపోయింది.

"దెబ్బ బాగా తగిలింది" ఆమె కంగారుగా చెప్పింది.

"అవును" రాంబో మేఘన మొఖంలోకి చూడసాగాడు. అది ఎప్పుడు, ఎలా తగిలిందో తెలిదుకానీ, నొప్పి ఇప్పుడిప్పుడే తెలుస్తోంది.

చిత్ర వెంటనే "రాంబో! షాక్కా విప్పు, దెబ్బకి కట్టు కట్టాలి" అంది.

రాంబో గుండీలు విప్పాడు.

చిత్ర వెనుక నంచి అతని షాక్కా తీసేసింది.

కుడివైపు నాలుగు అంగుళాల పొడుగున బలంగా చీరుకుపోయింది. అంతలెక్కా ఎర్రగా కమిలిపోయి రక్తసిక్తమైంది.

మేఘన షాక్కాను వెంటనే వాటర్ బాగ్‌లోని నీళ్ళతో తడిపి గాయాన్ని తుడవసాగింది.

"రాంబో! నువ్వు ముందు కారెక్కెయ్యి. వాళ్ళు వచ్చేస్తున్నారు" చిత్ర డ్రైవింగ్ సీట్లోకి చేరుతూ చెప్పింది.

రాంబో ముందు ఎక్కబోయాడు.

"వెనక్కి రండి! గాయాన్ని తుడవాలి" మేఘన చెప్పింది.

"రాంబో! త్వరగా వెనక్కి వెళ్ళు" చిత్ర కారు స్టార్ట్ చేసింది.

రాంబో కూర్చుని డోరన్నా వేయక ముందే చిత్ర కారు ముందుకు ఉరికించింది.

రాంబో ముందుకు తూలబోయి ఆపుకుని డోర్ వెయ్యడానికి చేసిన ప్రయత్నంలో అప్రయత్నంగా మేఘన మీద పడబోయాడు.

మేఘన చేతులతో అతని భుజాన్ని పట్టుకుని పడకుండా ఆపింది.

నగ్నంగా వున్న అతని భుజంపై ఆమె చేయి తగలగానే ఓ మంచు ముక్క గొంతులోంచి మెల మెల్లగా లోపలకు జారి క్రమక్రమంగా చల్ల చల్లని స్పర్శతో గిలి గింతలు పెడుతోన్నట్టుగా అనిపించింది.

అతడు కుదటపడి కూర్చోగానే "ఇటు తిరగండి" చెప్పింది మేఘన.

రాంబో తిరిగాడు.

ఆమె అతని షాక్కాను చింపి గాయాన్ని తుడిచి కట్టుకట్టసాగింది. ఈ పని చేయడంలో ఆమె పూర్వపరిచయాన్ని కానీ, ప్రస్తుత మౌనాన్నికాని లక్ష్యపెట్టకుండా చాలా సాధారణంగా బాగా పరిచయమున్న వ్యక్తికి కడుతోన్నట్టు కట్టసాగింది.

"అసలీమె మనస్తత్వం ఏమిటి?" అని రాంబో ఆమె ముఖంలోకి పరీక్షగా చూడ సాగాడు. అలా దగ్గరగా కూర్చుని గాయాన్ని కట్టుకడుతుంటే ఆమె ఎన్నాళ్ళ నుంచో పరిచయమున్న ఆత్మీయురాలిలా, ఎంతో ఆప్తురాలిలా కనిపించసాగింది.

చిత్ర చేతిలో కారు రివ్వున సాగిపోతోంది.

** ** **

ఉదయం ఎనిమిదిన్నర కావస్తోంది.

మెల్లగా తలుపు తట్టింది.

ఎటువంటి రెస్పాన్స్ రాలేదు.

తలుపు ముందుకు తోసింది. అది తాళ్ తీసి వుండడంతో తెరుచుకుంది.

ఆమె లోపలకు అడుగువేసింది.

అతడింకా నిద్రలేవలేదు.

మంచం ప్రక్కనున్న టేబుల్‌మీద ఇంతకుముందే సర్వర్ తెచ్చిన టీ సరంజామా, వాటి మధ్యలో న్యూస్‌పేపర్ కనిపించాయి.

సమయం చూసింది. తొమ్మిదికింకా ఇరవై నిమిషాలుంది. అతనింకా లేవనే లేదు. లేచి ఈ ఇరవై నిమిషాల్లో రడీ అవుతాడనే నమ్మకం ఏ మాత్రం లేదు. అప్పుడామె పెదవులపై నవ్వు తేలివచ్చింది. విజయం దాదాపుగా ఆమె గుప్పెటలోకి వచ్చేసింది.

అతన్ని లేపడానికి మెల్లగా దగ్గింది. కాని అది హనుమంతుని ముందర కుప్పి గంతులుగా గమనించి గట్టిగా పిలిచింది.

అతడు గాఢనిద్రలో చేసే ఉఛ్వాస నిశ్వాసాల శబ్దం తప్ప మరింకేమీ వినిపించడం లేదు.

అతడిని నిద్రలేపి టైం గుర్తుచేయడమే తన బాధ్యత. ఆమె వంగి అతడిని తట్టి లేపింది.

అతడు కళ్ళు మెల్లగా తెరిచి బ్లాంకెట్ లోంచి చేతులు బయటకు తెచ్చి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ చూశాడు.

ఎదురుగా ప్రత్యూషం. మంచు బిందువులు నిలిచి వికసించిన ఓ కుసుమం.

కంగారుగా బ్లాంకెట్ గొంతుదాకా లాక్కొని "గుడ్‌మార్నింగ్" అని చెప్పాడు.

నవ్వి "గుడ్‌మార్నింగ్ మిస్టర్ రే. ప్రస్తుతం సమయం ఎనిమిదీ నలభై..." అని ఆగి వాచీలోకి చూసి "...నలభై నాలుగు" అని చెప్పింది.

"ఓ మైగాడ్" అతని నోట్లోంచి అప్రయత్నంగా వచ్చిన మాటలకు ఆమె కళ్ళు మెరిసాయి.

"ఇంకా పదహారు నిమిషాలే వుంది. బెస్ట్ ఆఫ్ లక్ మిస్టర్ రే!" అని చెప్పేసి తలుపు దగ్గరకు లాగి వెళ్ళిపోయిందామె.

అతడు వెంటనే లేచి కూర్చున్నాడు. ఆమె అనుకున్నట్లుగా నిద్రపోవడం లేదు. అతడు లేచి చాలాసేపైంది. ఆమెను తప్పుదారి పట్టించిన తన ఆలోచనకు గర్వంగా తల ఆడించి షర్ట్ తొడుక్కుని, బాగ్ సర్దుకుని, షూస్ వేసుకుని చప్పుడు కాకుండా తలుపు తీశాడు.

బయట ఎక్కడా లేదామె. బహుశా కింద వెయిట్ చేస్తూ వుండి వుండొచ్చు. సరిగ్గా అక్కడ ఇంకో పన్నెండు నిమిషాలే ఆమె ఎదురు చూస్తుందని రేకి తెలుసు.

అతడు తలతిప్పి కారు పార్కింగ్‌లోకి చూశాడు. తెల్లని ఓల్వో ఎండలో మిలమిల మెరిసిపోతోంది.

అతడు ముందుకు నడిచాడు. లిఫ్ట్‌దాటి మెట్ల దగ్గరకు వచ్చాడు. ఆ సమయంలో లిఫ్ట్ ఎక్కడం చాలా ప్రమాదం. అది గ్రౌండ్ ఫ్లోర్‌లోకి వెళ్ళాక తిన్నగా ఆమెకు ఎదురుగా ఆగి తెరుచుకుంటుంది. మిగిలిన ఈ పదకొండు నిమిషాల్లో అతడంత తెలివి తక్కువ పని చచ్చినా చెయ్యడు.

రే చురుగ్గా కదిలాడు. అంగకి మూడేసి మెట్ల చొప్పున దిగసాగాడు. మెట్లు ఆగే ప్రదేశానికి ఆమె చాలా దూరంలో వుంది.

అతడు చప్పున తిరిగి ముందుకు పరుగుతీశాడు. అత డనుకున్నట్లుగా మెట్లు దిగటానికి నాలుగు నిమిషాలకన్నా ఎక్కువ సమయం పట్టింది. దాదాపు ఏడు నిమిషాలు అందుకే సరిపోయాయి. ఇంకా నాలుగు నిమిషాలు...

అతడు కార్ల మధ్యలో పరుగుతీయసాగాడు.

తలుపు తీసుకుని చిత్ర లోపలకు వచ్చింది. సోఫాలో నిటారుగా కూర్చుని పుస్తకం చేతిలో బిగపట్టుకుని చదువుతున్న త్రివేదికేసి ఆశ్చర్యంగా చూస్తూ "రాంబో వున్నాడా? అన్నయ్యగారూ" అని అడిగింది.

త్రివేది ఉలిక్కిపడి చూశాడు. అతడికా సెకన్లో చిత్రను చూసేసరికి యమ చిరాకు వేసింది.

"లోపల వున్నాడేమో?"

"కొంచెం పిలుస్తారా?"

"నువ్వే పిల్చుకో!" అనేశాక త్రివేది ఆమె మొఖంలోకి ఓసారి చూసి "...వద్దులే నేనే పిలుస్తాను" అని ఆ నవల పక్కన పెట్టి లోపలకు వెళ్ళాడు.

రెండు నిమిషాల్లో తిరిగొచ్చి "లోపలికి నిన్నే రమ్మంటున్నాడు" అని చెప్పాడు.

చిత్ర లోపలకు వెళ్ళింది.

త్రివేది కళ్ళు అక్షరాల వెంటపోయి నిర్ఘాంతపోయాయి. అతడు చదవాల్సిన ఇంట్రెస్టింగ్ మేటర్ అంతకుముందుదాకా నిక్షేపంగా వుంది. ఇప్పుడేమో అంతలెక్కా చక్కా కత్తిరించి వుంది. "హీరో ఏమైపోయాడో ఏమో?"

ఇది తప్పకుండా చిత్రపనే. అతడు లోపలికి నడిచాడు.

''రాంబో! విన్నొకటి అడుగుతాను. ఒప్పుకుంటావా?'' చిత్ర రాంబో కెదురుగా వున్న కుర్చీలో కూలబడి అడిగింది.

రాంబో వింటోన్న పాట వాల్యూమ్ తగ్గించి పుస్తకం మూసి ''నాకు సాధమయ్యే పనైతే తప్పకుండా ఒప్పకుంటాను'' అని చెప్పాడు.

చిత్ర చేతిలోని పేపర్ తీసి అందులోపడిన ఎడ్వర్‌టైజ్‌మెంట్ చూపించింది. రాంబో చూశాడు.

చాలా పేరున్న ఓ పెద్ద కంపెనీ నిర్వహిస్తోన్న ఓ డాన్స్‌పోటీ ఎడ్వర్‌టైజ్‌మెంటది.

పేపర్ మడిచేస్తూ ''నీ కప్పుడప్పుడూ భలే తలతిక్క ఆలోచన్లు వస్తాయే?'' అన్నాడు.

''నీకు సాధ్యమయ్యే పనైతే ఒప్పుకుంటావని మాటిచ్చావు!''

''ఇది నాకు సాధ్యమయ్యే పనా?''

''తప్పకుండా!''

''నీ అభిప్రాయానికి థాంక్స్!''

''చాల్లే రాంబో ఒప్పకో!'' చిత్ర బలవంతం చేయసాగింది.


''చూద్దాంలే.''

''చూద్దాంలే కాదు! తప్పకుండా ఒప్ప...'' చిత్ర నవ్వుతోంది. ఆమె కుడి చెవి హఠాత్తుగా త్రివేది చేతిలో నలిగిపోసాగింది.

''ప్రొద్దున్నే హింసాత్మక చర్యలకు పాల్పడడం ఏం బావోలేదండి'' చిత్ర బాధగా చెప్పింది.

''పుస్తకంలో పేపరెందుకు చింపావు?''

''సాయంత్రం సినిమా, కసాటా ఐస్‌క్రీం తినాలి కాబట్టి!''




''అందుకని బంగారంలాంటి పుస్తకం చింపుతావా? నీకు చేతులెలా వచ్చాయి?''

''ఐస్‌క్రీం కోసం ఇలా వచ్చాయి?'' పొడుగ్గా చాపిన చేతులు చూపించింది.

''ఏదా పేపర్?''

దానికోసమే ఎదురు చూస్తోన్న చిత్ర ''మరి సినిమా, ఐస్‌క్రీం'' అని అడిగింది.

''సర్లే. ఇంకో పుస్తకం కొనుక్కుంటాను?''

''దాంతో రెండు సినిమాలు, రెండు ఐస్‌క్రీంలు వస్తాయి''

''మరైతే ఇటివ్వు!''

''మరి మీరు ఒప్పకోండి''

త్రివేది నిజంగా ఇప్పుడు వెళ్ళి ఆ పుస్తకాన్ని కొనలేదు, దాన్ని చదవకుండా వుండనూ లేదు. అతని చెయ్యి చెవిని మరింత చురుగ్గా తిప్పి ''అలాగే ఇవ్వు'' అన్నాడు. ఆమె కళ్ళు ఒక్కసారిగా మెరిశాయి. గోరుతో కత్తిరించిన పేపర్ తీసిచ్చింది.

త్రివేది కళ్ళు వెంటనే వెళ్ళిపోయాయి, ఆ కాగితపు లైన్లవెంట.

''మిస్టర్ రే కారు దగ్గరకు పరుగెత్తుకొని వచ్చాడు. అతడు డోర్ తీయబోతూ చుట్టూ పరికించి చూశాడు.

ఆమె ఎక్కడా కనిపించలేదు. కాని అతని ప్రమేయం లేకుండానే కారు డోర్ తెరుచుకుంది.

రే అనుమానంగా వంగి చూశాడు.

''మీరిలాంటి పని చేస్తారని తెలుసు'' లోపల కూర్చున్న ఆమె ప్రక్కకు జరిగి డ్రైవింగ్ సీట్ అతని కోసం ఖాళీ చేస్తూ చెప్పింది.

త్రివేది అక్కడ్నుంచి వచ్చేశాడు! అతడి థ్రిల్లింగ్ తీరింది.

చిత్ర కూడా లేచి ''నేనుకూడా వెళుతున్నాను. రాంబో! నా పాకెట్ మనీ అంతా పెట్టి ఆ పోటీకి ఎంట్రీఫారం కొని పూర్తిచేసి నీ సంతకం కూడా నేనే చేసి పంపేశాను. నువ్వు కాదంటే ఊరుకోను'' అతని మాటకోసం ఎదురు చూడకుండా వెళ్ళి పోయింది.

** ** **

ఒక్కసారి ఆకాశం రూపే మారిపోయింది. కలలో కూడా ఊహించని విచిత్రమైన మార్పు అది.

వెండి, బంగారం తీగల లతలు ఆకాశంలోని నాలుగు మూలల నుంచి పాక్కుంటూ వచ్చి మొత్తం ఆకాశమంతా అల్లుకుపోయాయి.

ఆ కమ్ముకుపోయిన లతల వెనుక వున్న వెన్నెల కిరణాలు తీగల సందుల్లోంచి పుంఖాను పుంఖాలుగా భూమి మీదకు విరజిమ్ముతున్నట్లుగా కురియసాగాయి. అవి ఒక్కసారిగా మధ్యలో జలతారు తీగలుగా మారి భూమిమీదకు జాలువారసాగాయి.

చెట్లన్నీ ఒక్కసారిగా విరగబూశాయి. ఋతువులన్నీ కలిసికట్టుగా మారి నవ్వులతో, కేరింతలు కొట్టసాగాయి.

కొమ్మలపై జారిన జలతారు తీగలపై చిలుకలు ఊయలలు ఊగుతున్నాయి. నల్లని కోయిలలు జలతారు తీగల మాటున వికసించిన వింత శోభకు పరవశించి పాడసాగాయి. నెమలి మెడలో జలతారు తీగ మెరిసింది. హృదయం ఉప్పొంగినట్లుగా పురి మెల్లమెల్లగా విడివడి మనోహరమైన జలతారు ఆభరణాల సొగసులతో మైమరచి నాట్యం చేయసాగింది.

బంగారు పచ్చికలో మెరిసిపోతోన్న మైదానంలో సిరివెన్నెల సరస్సులో రాజహంసల వీపులపై పరిచిన మేలిమబ్బుల పరుపులపై మేఘన ఆదమరిచి నిద్రపోతోంది.

ఒక్కసారిగా కురిసిన జలతారు వానకు ఆమె ఉలిక్కిపడి లేచి కూర్చుంది.

ఎవరో చేయి అందించారు.

ఆమె అందుకోబోయేలోగా అది మాయమైంది.

ఆమె చుట్టూ చూసింది. ఎవరూ కనిపించలేదు. ఆ చేయి ఎవరిదో అర్థం కాలేదు.

పానుపుమీంచి లేచి క్రిందకు దిగింది. జలతారు పట్టుచీర కుచ్చిళ్ళ మెరుపులు మైదానాల అంచులవరకూ కాంతి పుంజాలను వెదజల్లాయి.

ఆమెకోసం తిరిగి చేయి అందించారెవరో. కాని ఆమె దాన్ని అందుకోలేకపోయింది.

ముందుకు నడిచింది.

''ఆగు!'' ఎవరిదో కంఠం. గండుకోయిల గొంతులా, గుడిగంటలా వినిపించింది కానీ అదెవరిదో అర్థం కాలేదు.

ఆమెకు ఉక్రోషంగా వుంది. అదృశ్యంగా వుండి ఆడుతున్న వ్యక్తిపట్ల కోపంగా కూడా వుంది. అసలిక్కడికెలా వచ్చిందో? అర్థం కాలేదు. ఈ అలంకరణ ఎవరు చేశారో ఊహించలేకపోతోంది. ఆమెకు మాత్రం ఒక్కటి అర్థమైంది. ఆలోచనలు ఇంతకు ముందులా చురుకుగా సాగడం లేదు.

ముందుకు నడిచింది. జలతారు జల్లు వచ్చి కొట్టుకుంది. ఆమె నెవరో భుజాలుపట్టి ఆపారు. ఆ స్పర్శతో ఒళ్ళంతా ఒక్కసారిగా అనేక వేల తీగలై మధురరాగాలను పలుకుతోన్నట్లుగా అనిపించింది.

ఆమె చప్పన కళ్ళు విప్పింది. రాంబో భుజాలు పట్టి ఆపుతూ ''కలేదో వచ్చినట్టుంది?'' అని అడిగాడు.

ఆమె సిగ్గుపడి వెంటనే లేచి నిలబడింది. కిటికీలోనుంచి వెలుతురు చాలా హీనంగా వస్తోంది.

''అంతా సినిమాకు వెళ్ళారు. టీ రెడీగా వుంది'' అని చెప్పి రాంబో హాల్లోకి వచ్చేశాడు.

మేఘన మొఖం కడుక్కుని హాల్లోకి వచ్చి కుర్చీలో కూర్చుంది.

రాంబో టీ కలిపి ఇచ్చాడు.

ఆమె అందుకుని ''చిత్ర రాలేదా?'' అడిగింది.

''తనూ వెళ్ళింది.'' చెప్పాడు.

మేఘన మౌనంగా టీ తాగసాగింది. ఆమెకు కలను తలచుకుంటేనే పులకరింతగా వున్నట్లుంది. అంత అందమైన కలను ఆమె ఇంతకుముందు జీవితంలో ఎప్పుడూ చూడలేదు.

రాంబో మేఘనను ''మంచి కలేదో కన్నట్టున్నావు?'' అని అడిగాడు.

ఆమె అవునన్నట్లు తలూపింది.

ఇద్దరి మధ్యా ఇలాంటి సంభాషణ ఇదే ప్రథమం. ఆమెకూ, రాంబోకీ ఇద్దరికీ కొత్తగానే వున్నట్లుంది.

అతడు తిరిగి ఆమెను కలగురించి అడగలేదు.

చాలాసేపు మౌనం ఆ గదిలో రాజ్యం ఏలింది.

దాన్ని చెదరగొడుతూ అడిగాడతను "బయటి కెక్కడికైనా వెళదామా?"

"వద్దు" చాలా ఖచ్చితంగా చెప్పింది.

"ఇలా ఎంతసేపు కూర్చుంటాం?" అడిగాడు రాంబో.

ఇంకా ఆమె కల తాలూకు జ్ఞాపకాలలో నుంచి తేరుకోలేదు. రాంబో మాటలకు సమాధానం చెప్పడమెలాగో తెలియలేదు. ఆ తెలియకపోవడమే చిరాకుగా మారింది. అది మొఖంలోకి రాగానే "నాకు రావాలని లేదు" అని చెప్పింది.

ఆమె చిరాకు రాంబో మనసు నొప్పించినా దాన్నతడు ఓ చిరాకుగా పట్టించు కోకుండా

"బోర్ కొడుతుందేమో?" అన్నాడు.

"నాకు బోర్ కొట్టదు."



"బిర్లామందిర్ చాలా బావుంటుంది" చెప్పాడు రాంబో.

రాంబో మొఖంలోకి సూటిగా చూసి "నా కెక్కడికీ రావాలని లేదు. నన్ను విసిగించవద్దు" చెప్పింది.

ఆమె మొఖంలోని భావాలకు రాంబో "ఎప్పట్నుంచో చూస్తున్నాను. నీకు ఎందుకంత కోపం?" అడిగాడు.

అతడింకేమీ మాట్లడదనీ, విసిగించదని అనుకుంది. కానీ ఆమెను విమర్శిస్తూ అన్న మాటకు వెంటనే "అవును! నాకు కోపమెక్కువ! అందులో నిన్ను చూస్తే మరీ!" చెప్పింది. అలా అనడానికి ఏ మాత్రం మొహమాటపడలేదు. [illegible] అతడు విమర్శిస్తూ అన్న మాటలు విన్నప్పుడే ఆమె మొహమాటాన్ని వదిలేసింది.

ఆమె చెప్పిన సమాధానం, పలికిన పొగరైన తీరుకు రాంబో మనసంతా చేదు తిన్నట్లైంది. "ఎందుకూ కోపం? నే నేమన్నా పనికిమాలిన వాడిలా కనిపిస్తున్నానా?" అడిగాడు కోపంగానే.

"అవును"

రాంబో ఆమె ఇంత అవమానకరంగా మాట్లడుతుందని ఊహించలేదు. అతనెంత సౌమ్యంగా అడిగినా ఈమె పోట్లాటలోకి దిగుతోంది.

"నీ అంత పొగరుమోతు దాన్ని నే నెక్కడా చూడలేదు." రాంబో కుర్చీలోంచి లేచిపోతూ అన్నాడు.

మేఘన హృదయం ఒక్కసారి భగ్గుమంది. "నీలాంటి సంస్కార హీనుడ్ని కూడా నేనెక్కడా చూడలేదు" చెప్పింది

రాంబో మొఖం కందగడ్డలా తయారైంది. ఆమెకు చాలా మరుగ్గా సమాధానమిచ్చి మనసు బాధపెట్టడానికి గట్టి నిర్ణయం బుర్రలోకి రాగానే ఆమె భుజాన్ని గట్టిగా గుచ్చి పట్టుకుని ఏదో చెప్ప బోయాడు.

ఆమె భుజాన్ని రాంబో చేయి తాకటం ఆలస్యం మేఘన వెయ్యి పడగవిప్పిన త్రాచులా పైకి లేచి రాంబో చెంపను తాకింది. అంతలెక్కా అతని తెల్లని చెంప ఎర్రగా కందిపోయింది.

ఆమె చేసిన పనికి ఆమే నిర్ఘాంతపోయింది. చప్పున చేయి క్రిందకు దించేసి రాంబో మొఖంలోకి చూస్తూ నిలబడిపోయింది. సంభాషణ చిలికి చిలికి గాలివానలా మారి ఇంత దారుణంగా తయారౌతుందని ఆమె ఊహించలేదు.

రాంబో చప్పున ఆమె భుజాలు రెండూ గట్టిగా పట్టుకుని దగ్గరకు లాక్కున్నాడు. రెండు చేతులతో ఆమె మొఖం పెనుగులాడకుండా పట్టుకుని ఆమె పెదవులను తన పెదవులతో గట్టిగా నొక్కాడు.

అతని చేతిలో బందీగా చిక్కికూడా కాస్తకూడా చలించకుండా మరింత కోపంతో చూసే ఆమె కళ్ళలోకి రెప్పవాల్చకుండా చూస్తూ కసిగా ఆమె పెదవుల్లో దొరికిన మధురిమను చవిచూస్తూ వుండిపోయాడు.


మొదట అతని పనికి హృదయం దహించుకుపోయినా సెకన్లు గడిచే కొలదీ ఆమె శరీరం మొత్తం ఓపికపోయినట్లు కళ్ళపై మైకపు తెరలు దిగుతోన్నట్లుగా అనిపించింది.

రాంబో మరోసారి ఆమె అధరాల మధురిమను చవిచూసి వదిలాడు.

ఆమె కుర్చీ హేండిల్‌ను చేతిలో పట్టుకుని మెల్లగా అందులో కూలబడిపోయింది. తల ఎత్తి సూటిగా చూడలేకపోయింది. జరిగిన విషయాన్ని తెలుసుకోవడానికి, అర్థం చేసుకోవడానికి మొద్దుబారిపోయిన ఆమె బుర్ర ప్రయత్నించసాగింది.

అతడు రెండు నిమిషాలలాగే నిలబడిపోయాడు. ఆమెకు సారీ చెప్పాలని అనిపిస్తోన్న కోరికను బలవంతాన ఆపుకుని బయటకు వచ్చేశాడు.

** ** **




రాంబో తిరిగి ఇంటికి వచ్చేసరికి రాత్రి పన్నెండు దాటిపోయింది.

అంతా నిద్రపోతూ వుంటారని ఊహించాడు. కానీ లైట్లన్నీ వెలుగుతూనే వున్నాయి.

అతడు లోపలకు రాగానే లక్ష్మి ఎదురుగా వచ్చి "అదేంట్రా! రాంబాబు!! ఇప్పటిదాకా ఎక్కడకు పోయావు?" అని అడిగింది.

రాంబో మాట్లడకుండా ముందుకు నడిచాడు.

"ఇప్పటిదాకా చూసి పాపం వెళ్ళిపోయారు వాళ్ళు!" లక్ష్మి వెనకే వస్తూ అంది.

రాంబో వెనక్కి తిరిగి అనుమానంగా చూస్తూ "ఎవరు?" అని అడిగాడు!

"ఇంకెవరు? మేఘన, వాళ్ళ నాన్న!" అంది.

"వెళ్ళిపోయిందా?" రాంబోకి చెప్పలేని ఆశ్చర్యం, బాధ కూడా కలిగాయి. ఆమె ఇలా వెళ్ళిపోగలదని అతడు ఊహించలేదు.

"మేము సినిమానుంచి వచ్చేసరికి నాన్నగారు, మేఘన నాన్నగారు వున్నారింట్లో! అప్పుడే వచ్చారట! విశ్వనాథంగారి పార్ట్‌నర్ ఎవరో చనిపోయారట! అందుకని ఆయన వెంటనే వెళ్ళిపోవాలని అన్నారు. ఆ అమ్మాయి మేఘన తను కూడా వెళ్ళిపోతానని అంది. మేమింకా కొన్ని రోజులు వుండమని కూడా చెప్పాం. కాని ఎందుకో ఆ అమ్మాయి ఇక్కడ వుండడానికి ఇష్టపడలా?" లక్ష్మి చెబుతూనే ఇటుతిరిగి "... అది కాదురా నువ్వు బయటకు వెళ్ళేవాడివి కాస్త ఆ అమ్మాయిని కూడా తీసుకువెళ్ళొచ్చు కదా? ఒక్కదాన్నే వదిలేసి వెళ్ళిపోయావు? ముందే చెబితే మాతోపాటే సినిమాకు తీసుకువెళ్ళేవాళ్ళం, ఆ అమ్మాయి ఏమనుకుందో ఏమిటో?" అంది.

రాంబో లక్ష్మి చెప్పిన మాటలన్నీ శ్రద్ధగా విన్నాడు. విని "నేను రమ్మన్నాను రాలేదు? ఏమైనా అందా?" అని అడిగాడు.

"ఏమనలేదు. చాలా మంచి పిల్ల. ఎందుకునో మరి వెళ్ళిపోతానని అంది. దింపి రాటానికి అంతా వెళ్ళారు" చెప్పింది.

"ఎంతసేపైంది వెళ్ళి?" రాంబో

"ఇప్పుడే పది నిమిషాలు.

షూస్ విప్పబోతూ ఆగాడు రాంబో. "దేన్లో ట్రైన్‌లోనా?" అడిగాడు.

"అవును"

ఇక ఆలోచించకుండా ముందుకు నడిచాడు.

"ఆగరా? ట్రైన్ వెళ్ళిపోయిందేమో?"

అతడు లక్ష్మి మాటలు వినిపించుకోకుండా బయటకు వచ్చేసి కారెక్కాడు.

మేఘన వెళ్ళిపోయేలోగా ఒక్కసారి ఆ అమ్మాయితో ఒక్క మాట చెప్పేస్తే అతని బాధ తీరిపోతుంది. ఆమె తనను వేరేగా ఊహించుకుని వెళ్ళిపోవడం అతనికి ముల్లు గుచ్చుకున్నట్లుగా వుంది.

అసలామే తనను రెచ్చగొట్టింది. ఆమె అలా ప్రవర్తించకపోయి వుంటే తనలాంటి పని చేసేవాడే కాదు. ఏమైనా కానీ ముందామెకు జరిగిన దానికి సారీ చెప్పాలి. ఇకపై జీవితంలో కనిపిస్తుందో లేదో చెప్పడం కష్టం. అందుకే ఇప్పుడామెను ఎలాగైనా కలుసుకోవాలి!

రాంబో కారు రైల్వే స్టేషన్‌లో పార్క్‌చేసి చాలా వేగంగా ప్లాట్‌ఫారం మీదకు వచ్చాడు.

అక్కడ రైలు కనిపించలేదు. అంతేకాదు చిత్ర, త్రివేది, అతని తండ్రి ఎవ్వరూ అక్కడ లేరు.

చాలా కొద్దిమంది ప్రయాణికులు ఇంకా చాలా సేపటికి కానీ రాని తమ బండి కోసం కునికిపాట్లు పడుతూ సిమెంట్ బల్లలపై జోగుతున్నారు.

చాలా ఖాళీగా అశాంతి నిండిన హృదయంలా వుంది ప్లాట్‌ఫారం. వెయిట్ చూసుకునే మిషన్‌లోని ఎరుపు, పసుపు లైట్ల కాంతి గిర్రున తిరుగుతోంది.

మేఘన వెళ్ళిపోయింది.

** ** **

ఓ వారం రోజులు గడిచిపోయాక!

"నేను చెయ్యలేను చిత్రా! ఆ లైట్సు, ఆ మ్యూజిక్ నాకు సరిపడవు! అలాంటి వాతావరణంలో నా కాళ్ళు కొంచెం కూడా కదలలేవు" రాంబో చెప్పాడు చిత్రతో!

రవీంద్రభారతి స్టేజీ చాలా అట్టహాసంగా వుంది. మెల్లని పాప్ మ్యూజిక్ వచ్చిన ప్రేక్షకులను రంజింపచేస్తోంది.

వెలుగుతూ ఆరిపోయే ఆకుపచ్చ, నీలం, ఎరుపు, పసుపు లైట్ల కాంతి స్టేజీ మీంచి వచ్చి రాంబో, చిత్రల మొఖాలపై పడుతోంది. క్షణక్షణానికీ వాళ్ళ మొఖాలు కూడా ఆ రంగుల షేడ్ పడి మారుతోంది.

"లేదు రాంబో! నేను చెబుతున్నాను నువ్వు తప్పకుండా చెయ్యగలవు. నాకా నమ్మకం వుంది" చిత్ర తిరిగి చెప్పింది.

"నీకు నేను చెప్పేది అర్థం కావడం లేదు. నాకిలాంటి వాతావరణంలో డాన్స్ కుదరదు. కావాలంటే ప్రోగ్రాం చూసేసి వెళ్ళిపోదాం!"

"నీకు తెలుసుగా రాంబో ఈ పోటీని ఈ కంపెనీనే స్పాన్సర్‌చేసి ఢిల్లీ టి.వి.లో చూపిస్తారని. భారతదేశంలోని ఎన్ని లక్షల మంది టి.వి. ప్రేక్షకులు చూస్తారో ఈ ప్రోగ్రాంని! గెలిచిన వాళ్ళకు ఎంత పేరొస్తుందో ఊహించు రాంబో! ప్లీజ్ నువ్విలా తక్కువగా ఫీలవకు!"

"లేదు చిత్రా! ఇంత పెద్ద పోటీలో, ఏ మాత్రం అనుభవం లేని నేను ఎలా గెలుస్తానని అనుకున్నావు? అలా అనుకుంటే నిజంగా అది నీ తెలివితక్కువతనమే?"

"నీకు తెలీదు! రాంబో! ఒక్కోసారి మనలో వున్న టాలెంట్ మనకే తెలీదు! ఎవరన్నా చిన్ని అవకాశం ఇచ్చినప్పుడు మనం అమాయకంగా చేసిన పనిలో మన గొప్పదన మేమిటో తెలుస్తుంది."


"నువ్వెన్నైనా చెప్పు! నేను గెలవడమనేది అసంభవం!"

స్టేజీమీద ఎనౌన్సర్ మైక్‌లో "పోటీలో పాల్గొనే అభ్యర్థులకు మనవి. పాల్గొనే ప్రతి అభ్యర్థి అరగంటలోపు గనుక డాన్స్ చెయ్యలేకపోవడంగాని, మానుకోవడంగాని చేసే టట్లయితే ఎంట్రీకి కట్టిన డిపాజిట్ ఇవ్వబడదు. అరగంట దాటాక డ్రాప్ అయితే ఆ మొత్తం తిరిగి ఇవ్వబడుతుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

రాంబో నవ్వి "నీ పాకెట్‌మనీ ఎంత?" అని అడిగాడు.

"ప్లీజ్ రాంబో సీరియస్‌గా తీసుకో!" చెప్పింది చిత్ర.

"ఒ.కె. కాకపోతే నీ డిపాజిట్ గల్లంతయితే నాది కాదు బాధ్యత" రాంబో నవ్వుతూ అన్నాడు.




"సరేలే ముందు నువ్వు స్టేజి ఎక్కితే అంతే చాలు! తర్వాతంతా నేను చూసుకుంటాను"

ఆమె చెబుతూండగానే వారి వెనుక గోల ఒక్కసారిగా పెరిగింది. ఇద్దరూ తలలు తిప్పిచూశారు.

ఆ రోజు గోల్కొండ చూసివస్తోంటే ఆ మధ్యలో తగిలిన జీప్ వీరులు. చిత్రను, రాంబోను చూసి వాళ్ళు మరింతగా గోల చేయసాగారు.

చిత్ర చేయి ఊపి "హలో! మీరంతా బాగున్నారన్నమాట" అని పలుకరింపుగా అడిగింది.

"యస్ స్వీటీ! అంతా బావున్నాం!" చెప్పాడొకడు. వాడి ఒక చెవికి పోగులాంటిది వుంది.

"మీరుకూడా పోటీలో పాల్గొంటున్నారా?" అడిగింది.

"యస్ డార్లింగ్!" ఇంకోడు చెప్పాడు. అమ్మాయిలు కిలకిలా నవ్వసాగారు.

"పాపం" చిత్ర పెదవి విరిచింది.

"ఏమైంది బేబీ?"

"మీపై జాలి వేసింది."

రాంబో ఆమెను వారించి "మీరు వెళ్ళండి. ప్రోగ్రాం స్టార్టవబోతోంది" చెప్పాడు.

వాళ్ళు రాంబో నెత్తి మీదొకటి, చిత్ర నెత్తి మీదొకటి కొట్టి "వర్లే అక్కడ చూసుకుందాం!" అని వెకిలిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

ఒక్కసారిగా వెలిగి ఆరిపోయే లైట్ల కాంతి మెల్లగా తగ్గసాగింది. పోటీ మొదలవబోతోంది.

అప్పటి దాకా ప్రేక్షకులలో వున్న కలకలం తగ్గిపోయింది. ఈ డాన్స్ ప్రోగ్రాము తిలకించడానికి దాదాపుగా ఎక్కువమంది ముప్పై ఏళ్ళ లోపున్న వారే వచ్చారు. ఎంతో ప్రతిష్టాకరమైన ఈ పోటీలో బెస్ట్ డాన్సర్ ఎవరో కాని పోటీలో పాల్గొనబోయే ప్రతి వ్యక్తి ఒక స్పెసిమన్‌లా ఫీలవుతున్నాడు.

మైక్‌లో ఎనౌన్స్‌మెంట్ వినిపించగానే మొత్తం డాన్సర్స్ అంతా స్టేజీ పైకి చేరుకోసాగారు. ప్రతి ఒక్కరి కదలికకీ అనుగుణంగా వుండేలా ఆ స్టేజీ డెకరేట్ చేయడం జరిగింది. రాక్ డాన్స్, బ్రేక్ డాన్స్, రాక్ అండ్ రోల్ ఏదైనా సరే చెయ్యొచ్చు. కాని అక్కడ బెస్ట్ డాన్సర్‌గా సెలెక్ట్ అయ్యేది ఎవరెక్కువ సమయం డాన్స్ చెయ్యగలిగితే వాళ్ళే! దానికి మూలం ముఖ్యంగా ఎవలేని ఓపిక, ప్రేక్షకుల ఆదరణ కావాలి! మొదటిది మొదటి అరగంటలో తేలిపోతుంది. ఇక రెండోది పోటీ చివర్లో తెలుస్తుంది.

స్టేజీకి మధ్య చివరి వరుసలో ఒక ప్రక్కన నిలబడి వున్న రాంబో నవ్వుకున్నాడు. 'ఎలాంటి కష్టం వచ్చిందిరా దేవుడా!' అనుకుని తన చుట్టూ పరికించి చూశాడు. అసలే మసకగా వున్న వెలుతురు.

అతని ప్రక్కనున్న వ్యక్తి రాంబోకేసి చూసి నవ్వాడు. రాంబో అతని చెవిపోగు చూసి గుర్తుపట్టాడు.



దాదాపు పది నిమిషాలు మైక్‌లో డాన్సర్స్‌కి రూల్స్, తర్వాత ప్రేక్షకులకు వినోదం కలిగించే ఆ కంపెనీ ఘనత వినిపించింది.

ప్రేక్షకుల రణగొణ ధ్వనుల సవ్వడిలో మెల్ల మెల్లగా మొదలైన పాప్ మ్యూజిక్‌తో పాటు లైట్ల కాంతి కూడా పెరగసాగింది. నాలుగు తెల్లని లైట్ల కాంతి చాలా ఫోర్స్‌గా స్టేజీ లోపం పై నుంచి ఏటవాలుగా పడింది. అవి నాలుగు వైపులకూ ఇటువైపు నుంచి అటు వైపుకు నెమ్మదిగా స్టేజీ మీద వున్న డాన్సర్స్ తలపై నుంచి, ముఖాల మీంచి, శరీరాల మీంచి కదలసాగింది. డాన్సర్స్‌లో కొందరు ధరించిన డ్రెస్ ఆ కాంతి పడగానే ఒకసారి తళుక్కున మెరుపులు మెరిసి మాయమవసాగింది.

మెల్లని మ్యూజిక్ పెరిగి పెరిగి తారాస్థాయి నందుకోగానే స్టేజీమీద కదలికలు ఒకేసారిగా మొదలయ్యాయి. కొలనులోని కొంగలు ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరి రెక్కలు అల్లల్లాడిస్తూ సాగిపోతున్నట్లుగా వుంది. సంగీత ధ్వనులకు అనుగుణంగా కలర్ లైట్ల కాంతితో స్టేజీ అంతా వెలిగిపోసాగింది.

రాంబో చాపి తిప్పుతూన్న చేతిని ప్రక్క వ్యక్తి వేగంగా కదిలి తన్నాడు. ఒక్కసారి చెయ్యి విరిగినంత బాధ వేసింది.

రాంబో వాడిని ఒక్క తన్ను తన్నబోయి తమాయించుకున్నాడు.


ఆ చెవి పోగు మనిషి "సారీ!" అని చెప్పి నవ్వాడు.

రాంబో వాడికి చూపులతోనే వార్నింగ్ ఇచ్చాడు.

దాదాపు పది నిమిషాలు పూర్తి కాగానే అర్థమైంది రాంబోకి తాను పూర్తిగా శత్రువుల మధ్యలో సయ్యాటలాడుతున్నానని. అతడికి తను అరగంటైనా డాన్స్ చెయ్యగలననే ఆశ పోయింది. పక్కవాళ్ళు మీదికి రావడం, అడ్డు నిలవడం చూస్తే రాంబోకి తాను చేసేది ఓ కల్లు తాగిన కోతి చేసే చేష్టల్లా అనిపించి చిరాకువేయసాగింది.

చుట్టూ వున్న మనుషులు కొందరు పూనకం వచ్చినట్లు, కొందరు టెటనస్ వచ్చినట్టు ఊగిపోతున్నారు. కొంతమంది ఒకే ఒక్క కదలికతో శరీరాలను అటుదిటు ఇటుదటు మార్చసాగారు. కొందరు మాత్రం సిన్సియర్‌గా తాము నేర్చుకున్నది చేస్తున్నారు.

వాళ్ళందరినీ, వాళ్ళు చేసే డాన్స్‌ని చూస్తున్న రాంబో మనసు పరిపరివిధాల పోయింది.




ఎర్రని గుల్మొహరా పువ్వులు, యూనివర్సిటీ బిల్డింగ్స్, అతని మిత్రులు అందరూ కళ్ళ ముట్టూ తిరగసాగారు. 'అప్పుడెంత బాగుండేది. ఒక్క క్లాప్ కొడితే చాలు హృదయం స్పందించేలా రెస్పాన్స్ వచ్చేది. అందరి ప్రోత్సాహం అతని కాళ్ళల్లో చేతుల్లో ఎనలేని కదలికలకు ఊపిరిపోసేవి. ఆ రోజు లెంత త్వరగా గడిచిపోయాయి. అంతా ఎలా వున్నారో?' అతనికా క్షణంలో మిత్రులను చూడాలనిపించింది.

తన చుట్టూ వున్న వాతావరణం రాంబోకి సరిపడలేదు. అతని మనసులో హఠాత్తుగా ఆ రోజు అలా వెళ్ళిపోయిన మేఘన రూపం మెదిలింది. తనపై ఆమెకు ఎంత కోపం






## మానవుడా!

మానవుడా! మానవుడా!
ఎంతటివాడవో, అని నీ
తంతు అంతా చూస్తున్నా!

* * *

కొండను సృష్టించలేవు నీవు
పిండి చేయగలవు దాన్ని—
చీమను సృష్టించలేవు నీవు
పామగలవు కాలరాచి—
నదిని ఎడారిలో సృష్టించలేవు
పదిలంగా బంధించగలవు—
ఉప్పెన తప్పించలేవు నీవు
చెప్పగలవు ఎప్పుడొస్తుందో—
భూకంపాన్నరికట్టలేవు
బూడిదపై ఇల్లు కట్టగలవు—
వైధవ్యం రాకుండా చేయలేవు
విధవకు జోడు చూడగలవు—
నువ్వు గొప్పవాడననుకుంటుంటే
నవ్వు వస్తోంది నాకు!

— పైడిపాటి సుబ్బరామశాస్త్రి

వున్నా ఆమె పాట ద్వారా అతడిని ప్రోత్సహించేది. 'ఇప్పుడు ఎక్కడ వుందో? కనీసం చిత్రతో కూడా ఏమీ చెప్పలేదట? తను నిజంగా సంస్కారహీనుడే. ఇంటికి అతిథిగా వచ్చిన ఆమెను పరాభవించి పంపేశాడు. ఆమె ఈ జన్మకి తనను క్షమించదు' అనుకోసాగాడు.

అలా అనుకుంటూ గతంలోకి వెళ్ళిపోయిన రాంబోకి డాన్స్ చెయ్యబుద్ధి కాలేదు. అతడు డ్రాప్ అయిపోదలుచుకున్నాడు. కానీ అమాయకంగా వున్న చిత్ర మొహం కనిపించి 'ప్లీజ్! నా పాకెట్ మనీ!' అంటున్నట్టుగా అనిపించి, నవ్వుకుని కనీసం ఈ అరగంటైనా ఏదో ఒక రకంగా కాలక్షేపం చేయ నిశ్చయించుకున్నాడు.

అతడు ప్రేక్షకులలో కూర్చుని వున్న చిత్రకేసి చూశాడు. ఆమె చాలా దూరంలో వున్నా గుర్తుపట్టి చెయ్యి ఎత్తి బొటనవేలు చూపింది. ఆమె కాన్సన్ట్రేషన్‌కు రాంబో ఆశ్చర్యపోయాడు. 'నువ్వు ముందు స్టేజీ ఎక్కు. తర్వాత దానంతట అవే అన్నీ జరిగిపోతాయి' అని చెప్పిన ఆమె మాటలకు నవ్వు వచ్చింది.

అరగంట గడిచిపోయింది. కానీ ఆ సంగతి రాంబోకి తెలియలేదు. మైక్‌లో ఎనౌన్సర్ చెప్పగానే విని ఆశ్చర్యపోయాడు. ఆలోచనలు సాగిస్తూనే అతని శరీరం డాన్స్ చేసిందన్న మాట. చాలా తక్కువమంది అరగంట కన్నా ముందే డ్రాప్ అయ్యారు. రాంబో వెనక్కి వచ్చేద్దామనుకునే సమయంలో చిత్రకేసి చూశాడు.

ఆమె చేతులు జోడించి 'మరో పది నిమిషాలు' అన్నట్లు పది వేళ్ళు ముడిచి తెరిచింది.

కానీ పక్కవాళ్ళు రాంబోని చెయ్యనివ్వడం లేదు. వాళ్ళకు మాత్రం ప్రేక్షకుల్లో మంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. వాళ్ళు ముద్దులు, సంజ్ఞలు వీళ్ళ అందుకుంటూ హుషారుగా డాన్స్ చేస్తూ రాంబోని ఇరిటేట్ చేయసాగారు.

ఇక అతడెట్టి పరిస్థితిలోనూ అక్కడ డాన్స్ చేయలేడు. తిరిగి చిత్రకేసి చూశాడు.

కానీ అక్కడ ఆమె కనిపించలేదు.

రాంబో చేతులు దించి ఆగిపోబోయే సమయంలో ప్రేక్షకుల వెనుకగా ఎక్కడో ఎవరో క్లాప్ చేసిన సవ్వడి వినిపించింది.

అతడి రెప్పవాల్చని చూపులు ఆవైపుగా ప్రసరించాయి.

దూరంగా ప్రేక్షకులు వచ్చే మార్గంలో వున్న ఖాళీ ప్రదేశంలో శీలామాధురి నిలబడి అలవోకగా ఒక క్లాప్ కొట్టింది.

దానికి రెస్పాన్స్ కుడివైపు మరో చివర నున్న పూరన్ అందుకుని రెండు క్లాప్స్ కొట్టింది.

ఆమెకు వెనుకగా జయసింహ అందుకున్నాడు. మాధవి నవ్వి చేతులు పైకెత్తి క్లాప్ కొట్టింది.

"మోహన్, భార్గవ్, రాజు, రాధ, నళిని! ఓహ్ క్లాసంతా ఇక్కడే వుంది. ఎలా వచ్చారు వీళ్ళంతా?"

రాంబో మనసు ఒక్కసారి ఎలా అయిందంటే సాగరంలో కదిలిన ఓ కదలికకు ఉవ్వెత్తున కెరటం ఉప్పొంగి దూసుకువస్తోన్నట్లుగా అయింది.

"కమాన్ బడ్డీ!" శీలా మాధురి గొంతెత్తి అరిచింది.

'క్లాప్ మీద క్లాప్! ఉత్తేజం అంటే బహుశా ఇదేనేమో! ఎంత ఆనందం? ఎంత ఉత్సాహం!' వాళ్ళను చూడగానే రాంబో మనసు పరవళ్ళు తొక్కింది.

ఆ స్టేజీ ఆనాడు యూనివర్సిటీలో మిత్రులు వేసిన స్టేజీలా కనిపించింది. మారే రంగుల లైట్లన్నీ గుల్మొహరా పువ్వులుగా తోచాయి.

పరవశించిన నెమలి పురివిప్పి ఆడుతుంది. లయకు స్పందించిన నాగు శిరస్సు ఊపి ఆడుతుంది.

అంతమంది మిత్రులను ఒక్కసారిగా చూసిన రాంబో ఇక స్టేజీపై కదం తొక్కసాగాడు.

ఊపిరి నిండిన గంటలు గడిచి నిమిషాలయ్యాయి. స్టేజీమీద రాంబోతో పాటు మరి నలుగురు మిగిలారు.

ప్రేక్షకులలో శీలా మాధురి ప్రక్కనున్న చిత్ర మొహం పట్టరాని ఆనందంతో వెలిగిపోయింది.

అంతా వచ్చి శీలా మాధురి ప్రక్కన గుంపుగా చేరి క్లాప్స్‌తో రాంబోకి ప్రోత్సాహం ఇవ్వసాగారు.

అంతమంది రాంబోకి ఇస్తోన్న ప్రోత్సాహం చూసి చెవిపోగు వ్యక్తి వంకరగా నవ్వాడు.

ఆయాసంతో చెమటకు తడిసిన వాడి మొహం భయంకరంగా తయారైంది. వాడితో పాటు పాల్గొన్న వాడి మిత్రులంతా స్టేజీ దిగిపోయారు.

దాదాపు పావుగంట గడిచిపోయాక అతడు, రాంబో ఇద్దరే మిగిలారు.

ఇక ఇక్కడ మైనస్ పాయింట్స్ మొదలయ్యాయి. కదలికకు ఎక్కువ సమయం తీసుకుంటున్న చెవిపోగు మనిషికి నెమ్మదిగా మైనస్ పాయింట్లు పడ్డాయి.

ఎంత ఉత్సాహానికైనా చివరికి అలుపు వుంటుంది. నాలుగున్నర గంటలకు పైగా నడిచిన ఆ డాన్స్‌లో రాంబో కాళ్ళలో కేవలం మిత్రుల ప్రోత్సాహం మాత్రమే నిలిచింది. అతడిలోని ఓపిక హరించిపోయింది.

మైక్‌లో ఓ గొంతు "మైనస్ పాయింట్స్ చూసి ఓ చిన్న ప్రోత్సాహం ఇవ్వదలిచాం. ఈ డాన్సర్స్ కిష్టమైన సంగీతాన్ని వినిపించదలిచాం. ఇప్పటికిప్పుడు వారి దగ్గర కానీ, వారిని ప్రోత్సహించే వారి దగ్గర కానీ ఆ సంగీతానికి సంబంధించిన కాసెట్ కానీ, రికార్డ్ కానీ వుంటే ఇవ్వవలసిందిగా కోరుతున్నాం! కానీ మొదటి ఛాన్స్ రాంబోకి ఇవ్వడం జరిగింది" అని చెప్పింది.

వెంటనే శీలా మాధురి కదిలి వెళ్ళి ఓ కాసెట్ ఇస్తూ ఆయనను ఏదో అడిగింది. ఆయన తల ఊపి ఏదో చెప్పాడు. శీలా మాధురి వెనక్కి తిరిగి వచ్చింది.

స్టేజీ మీద ఓపిక హరించుకుపోయిన రాంబో, అతని ప్రత్యర్థి ఆఖరి గెలుపు కోసం ఆఖరి సెకను దాకా పోరాడుతున్నారు.

రాంబో కళ్ళకు మెల్లని మగత లాంటిది కమ్ముకోసాగింది.

ఎనౌన్సర్ శీలా మాధురి ఇచ్చిన కాసెట్ ప్లే చేస్తుండగా ఓ వ్యక్తి వచ్చి "మిమ్మల్ని అర్జెంట్‌గా ఆయన రమ్మని పిలుస్తున్నారు" అంటూ దూరంగా వున్న కంపెనీ ఎం.డి.ని చూపించాడు.

అతను కదిలివెళ్ళాడు. ఆ సమయం అతనికి చక్కగా సరిపోయింది. అతని జేబులోని కాసెట్ ప్రదేశం మారింది.

వెళ్ళిన ఎనౌన్సర్ తిరిగి వచ్చేసరికి అతనికి ఇంతకు ముందు పిలిచారని చెప్పిన వ్యక్తి కనిపించలేదు. కనిపించి వుంటే విరుచుకుపడేవాడే అనవసరంగా అతడికి అబద్ధం చెప్పి అక్కడ్నుంచి కదిలించినందుకు.

ఒక్కసారిగా సంగీతం మారింది. అది అతి నీరసంగా, చాలా పేలవంగా చెవిపోగు వ్యక్తి చేస్తున్న డాన్స్‌కి సరిగ్గా అతికినట్లుగా సరిపోయింది.

రాంబోకి ఆ మ్యూజిక్ వినేసరికి మరింత నీరసం కమ్ముకొచ్చింది. అతడి అలసిన కాళ్ళు పనిచెయ్యలేకపోతున్నాయి. చెమట కారిపోతూ అతడిని మరింత ఇరిటేట్ చేస్తోంది.

మొదట శీలా మాధురికి అర్థం కాలేదు. అది ఆమె ఇచ్చిన కాసెట్ కాదు. ఆమె

ఒక్క పరుగు తీసింది. ఒక్క నిమిషం ఆలస్యం అయినా చాలు, ఆ సంగీతానికి రాంబో కుప్పకూలిపోయేలా వున్నాడు.

కానీ ఆమెకు ఆ అవసరం కలగలేదు.

ఒక్కసారి పాము పడగ ఎత్తి నాదస్వరం ఊదేవాడిని చూసినట్లు చూశాడు రాంబో. ఆ కంఠం అతనికెంతో సుపరిచితమైనది.

కొత్త ఊపిరి, కొత్త ఆశ. బలహీనమైపోతున్న శరీరానికి ఉత్సాహం ఎక్కిస్తున్నట్లుగా వినిపిస్తోంది.

"ఆఖరి నిమిషంలో ఆకాశం కురిసింది
చినుకు, ఆ చినుకు, ఓ చినుకు
ఆశల మదిలోన మెరిసిపోతూ విరిచింది
చినుకు, ఆ చినుకు, ఓ చినుకు"

పాపికొండల నడుమ నదిలా, ఎత్తిపోతల జలపాతంలా ఒక యాసలో, అతని కాళ్ళకు ఊపిరిలా కోమలమైన కంఠస్వరం వినిపించింది.

దాని లయను అందుకోవడానికి అతని మిత్ర బృందానికి ఎక్కువ సమయం పట్టలేదు. "చినుకు, ఆ చినుకు, ఓ చినుకు" అన్న మాట కందిరీగల రొదలా మారి అందరి నోటి వెంట వినిపించసాగింది.

మేఘన మైక్ పట్టుకుని రాంబోకేసి తిరిగి నవ్వింది.

అతడు 'నిజమేనా?' అన్నట్టు చూశాడు.

ఆమె చెయ్యి ఊపి నవ్వి తిరిగి పాటలోకి జారుకుంది.

గుల్మొహరా పువ్వులన్నీ గుత్తులు, గుత్తులుగా, ఎర్రని కాంతులతో అతని కళ్ళలో తిరగసాగాయి.

"ఒకదాని వెనుక జలతారు పోత
చినుకు! ఆ చినుకు! ఓ చినుకు!!!
హృదయాల గుడిలోన రాగాల మోత
చినుకు! ఆ చినుకు! ఓ చినుకు!!!

చెవిపోగు వ్యక్తి నెమ్మదిగా క్రిందకు జారిపోయాడు. అతడింక పైకి లేవలేకపోయాడు.

కొత్త ఊపిరి పది నిమిషాలు సాగింది. ఆనందంతో ప్రేక్షకుల నుంచి ఒక్కసారిగా హర్షధ్వానాలు ఉప్పెనలా విరిగిపడ్డాయి.

పావుగంట కంటే ఎక్కువసేపు మాత్రమే రాంబో చేయగలిగాడు. అతని కళ్ళపై మగత తెర దిగుతోంది.

ఎవరెవరో వచ్చి అభినందనలు తెలియచేస్తున్నారు. రాంబోకి బహుమతి అందుకోవడం, ఆ తరువాత జనాలు చేసిన హర్షధ్వానాలు మాత్రమే గుర్తున్నాయి.

ఆ తరువాతెప్పుడో అతడికి మెలకువ వచ్చింది. అతడు మంచంమీద వున్నాడు. ముందు ఎదురుగా మిత్ర బృందం కనిపించారు.

"మేఘన ఏది?" అడిగాడు. అతనికింకా పూర్తిగా మెలకువ రాలేదు.

మేఘన వచ్చింది.

"ఐయామ్ సారీ! నేను నీకు సారీ చెబుతున్నాను. నువ్వు నన్ను ఓ విలన్‌లా అనుకోవు కదా?" అడిగాడు మగతగా!

"అనుకోను" మేఘన అతని చేయి పట్టుకుని చెప్పింది.

"నామీద కోపం పోయినట్లేనా?"

"నా కసలు కోపమే లేదు."

"లేదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"లేదు! ఆ రోజు నువ్వు వెళ్ళిపోయాక ఏం చెయ్యాలో తోచలేదు. చిత్రకు అంతా చెప్పాను. ఆమె వెంటనే ఆలోచించి ఈ ప్రణాళిక వేసింది. అటు నీపై కోపం చూపించినట్టూ వుంటుంది. ఇటు మనవాళ్ళ నందరినీ తీసుకుని నీ ప్రోగ్రాంకి వచ్చినట్లూ వుంటుంది."

"అయితే అక్కడ నువ్వు పాట పాడడం మీ ప్లాన్‌లో లేదా?"

"లేదు. అది యాదృచ్ఛికం. అంతే."

"అయితే నువ్వు..." రాంబో ఆగిపోయాడు.


"అయితే నేను..." మేఘన రెట్టించింది.

రాంబో లేవబోతూ "ఇప్పుడు నేనెక్కడ వున్నాను?" అని అడిగాడు.

అతని భుజాలు పట్టి ఆపి, అతని చెవిలో గుసగుస లాడుతున్నట్లు "ప్రియురాలి మదిలో!" చెప్పింది మేఘన.

* * *

"అయితే వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటారంటావా?" త్రివేది లక్ష్మిని అడిగాడు. అప్పటికి గంటనుంచి లక్ష్మి, రాంబో మేఘనల స్టోరీ మొత్తం హిచ్‌కాక్ సినిమాలా



వినిపిస్తోంది. త్రివేది అంతా థ్రిల్లింగ్‌గా విని చివరికి ఇలా అడిగాడు.

అప్పటికి సమయం రాత్రి రెండు దాటింది.

"మీకు కారు పందాల గురించి చెప్పాను. డిపార్ట్‌మెంట్ స్టోర్స్ గొడవ గురించి చెప్పాను. చెంపదెబ్బల గురించి చెప్పాను. డాన్స్ ప్రోగ్రాం గురించి చెప్పాను. ఇన్నీ విన్నాక ఇదేం ప్రశ్న?" లక్ష్మి చిరాగ్గా అంది.

"ఇంత చెప్పిన దానివి ఆ ఒక్కటీ చెప్పేస్తే నీ సొమ్మేం పోయింది?" అన్నాడు త్రివేది.

హాల్లో ఏదో పడి పెద్ద శబ్దమైంది.

లక్ష్మి వెళ్ళబోయింది.

"ఆగు! ఇంత రాత్రెవరు వస్తారు?" అతడు అనుమానంగా చూశాడు.

ఇద్దరూ కలిసి బయటకు వచ్చారు. ఎవరూ కనిపించలేదు. తిరిగి బెడ్‌రూంలోకి వచ్చి కొయ్యబారిపోయారు.

కరకు గడ్డం, మాసిపోయిన గళ్ళ చొక్కా, ఖాకీ కలర్ పాంట్, వాడి చేతిలో మెరుస్తున్న మడత చాకు.

"మీ ఇనప్పెట్టె తాళాలిస్తారా?" అడిగాడు వాడు చాలా బండగా.

"ఇవ్వం!" చెప్పాడు త్రివేది.

"మరైతే చంపేస్తా?"

"ఎవర్నీ! మమ్మల్నే?"

"కాదు. నిన్నొక్కడినే తూట్లు తూట్లుగా పొడిచి చంపేస్తా!" చెప్పాడు వాడు.

లక్ష్మి కెవ్వుమంది. వెంటనే వణికిపోతూ "ఇచ్చెయ్యండి బాస్! నా పై ప్రాణాలు పైనే పోతున్నాయి" అంది లక్ష్మి.

ఆ దొంగాడు ఆమె భయానికి ఆనందంగా చూసి "అలా వుండాలి భర్తపైన ప్రేమ!" అని త్రివేది కేసి తిరిగి "...తాళాలు ఎక్కడ చెప్పు. నేనే తీసుకుంటా" అన్నాడు.

త్రివేది ఆలోచించాడు. అతడి కిన్నాళ్ళ థ్రిల్లింగైన అనుభవాలకు ఈ రోజు ధైర్యంగా నిలబడదలిచాడు.

అతడు సొరుగుకేసి చూపించి "అందులో వున్నాయి. తీసుకుంటారా? ఆ సహాయం నేనే చెయ్యనా?" అని అడిగాడు.

"ఎందుకులే!" అతడే కదిలి సొరుగు దగ్గరకు వచ్చాడు.



త్రివేది పక్కనున్న ఫ్లవర్ వాజ్‌తో ఆ దొంగాడిపై మెరుపు దాడి చేశాడు.

దొంగాడు అతని మెరుపులాంటి చురుకైన వేగానికి నివ్వెరపోయి ఆడగొంతుకతో కెవ్వుమన్నాడు.

లక్ష్మి, త్రివేది ఇద్దరూ ఆశ్చర్యంగా చూశారు.

దొంగాడి మీసం వేలాడుతోంది.

''నువ్వా?'' త్రివేది ఆశ్చర్యమైన కోపంతో చూశాడు.

''నేనెవరినో తెలుసా? తెలుసుకున్నావన్న మాట? రాజమండ్రిని గడగడలాడించిన గండ్రగొడ్డలి పేరు నీ చెవి దాకా పాకిందన్న మాట'' వాడు గర్వంగా నవ్వాడు.

''చాల్లే చిత్రా! వేథవ్వేషాలు మాను!'' అన్నాడు త్రివేది.

చిత్ర ఉలిక్కిపడింది. ఆ తరువాత దొరికిపోయానని అర్థం చేసుకుంది. ఈసారి త్రివేది, లక్ష్మి ఇద్దరూ ఆమెకు ప్రత్యర్థులైపోయారు.

ఆమె పారిపోవడానికి దారులు వెదకసాగింది.

''లక్ష్మి నువ్విటు నిలబడు. నేనిటు చూస్తా! రామ్మా రా! ఇవ్వాళ నీకు మైసూర్ పాక్ తప్పదు'' త్రివేది పిలిచాడు.

''వద్దండీ అన్నయ్యగారూ! ఇవ్వాళతో నా హాలిడేస్ అయిపోయాయి. ఆఖరి థ్రిల్లింగ్‌గా ఇలా వచ్చాను.''

''లాభం లేదు'' చెప్పాడు త్రివేది.

లక్ష్మి కూడా ముందుకొచ్చింది.

చిత్ర గడ్డం పీకేసింది. మీసాలు తీసేసి పాంట్ కొంచెం పైకి మడిచి, మడత వాకు దాచుకుంటూ రూమంతా గంతులు వేస్తూ పారిపోయే మార్గాలు చూసుకోసాగింది.

(సమాప్తం)